

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 5

గురువారం 28-3-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సన్‌రైజర్స్ 'రన్'రంగం...

ముంబై ఇండియన్స్‌తో బుధవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు పరుగుల 'రన్'రంగం సృష్టించింది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన జట్టుగా హైదరాబాద్ (277/3) రికార్డు నెలకొల్పింది. అనంతరం ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 246 పరుగులు సాధించి ఓడిపోయింది.

12లో





వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు 'ఫ్యాన్'ను ప్రజలకు చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్.. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

మోసాలు, నేరాలే వారి చరిత్ర

ప్రొద్దుటూరు బహిరంగ సభలో నిప్పులు చెరిగిన ఏపీ సీఎం జగన్

- చిన్నాన్న వివేకాను ఎవరు చంపారు.. ఎందుకు చంపించారో అందరికీ తెలుసు
- చంపినోన్ని చంద్రబాబు, ఎల్లో మీడియా నెత్తిన పెట్టుకున్నారు
- విశాఖ డ్రగ్స్ కేసులో ఉన్నది చంద్రబాబు, పురందేశ్వరి బంధువులే
- నేరం వాళ్లు చేసి.. నెపం వైఎస్సార్‌సీపీపైకి తోస్తున్నారు
- బతికున్నప్పుడు ఎన్టీయార్‌కు వెన్నుపోటు.. చనిపోయాక వీళ్లే విగ్రహాలు పెట్టిస్తారు
- అబద్ధాలు చెప్పేవాళ్లు, మోసాలు చేసే వాళ్లే మనకు ప్రత్యర్థులు
- వీరంతా కలిసి నన్ను దెబ్బతీసేందుకు కుట్రలు, కుతంత్రాలు
- ఈసారి నా ఇద్దరు చెల్లెళ్లు కూడా కుట్రలో భాగస్వాములయ్యారు
- మీ కోసం 130 సార్లు బటన్ నొక్కి రూ.2.70 లక్షల కోట్లు జమ చేశాను
- మీరు నా కోసం మే 13న ఎమ్మెల్యే, ఎంపీల ఎన్నికకు రెండుసార్లు బటన్ నొక్కండి
- చంద్రబాబుకు ఓటేస్తే పేదల సంక్షేమానికి వ్యతిరేకంగా ఓటేసినట్టే..
- ఇప్పుడున్న సంక్షేమ పథకాల రద్దుకు అంగీకరించినట్లేనని ప్రతి ఇంటా చెప్పండి

10లో

వసతుల కల్పనతో సత్వర న్యాయం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

కోర్టుల్లో పనిచేసే సిబ్బందికి అవి బూస్టర్లా పనిచేస్తాయి..

దేశవ్యాప్తంగా దిగువ కోర్టులతో పాటు హైకోర్టుల్లోనూ సదుపాయాల కొరత..

కనీసం టాయిలెట్లు లేని కోర్టులు కూడా ఉన్నాయి.. అలాంటప్పుడు మహిళల పరిస్థితేమిటి? వారు ఎలా ఉండాలి?

మహిళలు, దివ్యాంగులకు అన్ని సౌకర్యాలూ ఉండాలని సూచన

తెలంగాణ హైకోర్టు నూతన ప్రాంగణానికి సీజేఐ శంకుస్థాపన..

32 జిల్లా కోర్టుల్లో ఈ-సేవా కేంద్రాలు ప్రారంభం



బుద్వేల్‌లో హైకోర్టు నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్. చిత్రంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ ఎస్వీ భట్టి, హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే తదితరులు

సాక్షి, హైదరాబాద్

కోర్టుల్లో మౌలిక వసతుల కల్పన సత్వర న్యాయానికి దోహదపడుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా న్యాయస్థానాల్లో ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. కోర్టుల్లో పనిచేసే వారికి వసతులు బూస్టర్లా పనిచేస్తాయని అన్నారు. దేశవ్యాప్తంగా దిగువ కోర్టుల్లోనే కాకుండా హైకోర్టుల్లోనూ సదుపాయాల కొరత ఉందని తెలిపారు. కనీసం టాయిలెట్లు లేని కోర్టులు కూడా ఉన్నాయని వెల్లడించారు. 'మరి మహిళలు ఎక్కడికి పోవాలి? ఉదయం ఇంటి నుంచి వస్తే సాయంత్రం ఇల్లు చేరేవరకు వారు ఎలా ఉండాలి? పాలిచ్చే తల్లి కోసం ఓ గది, చిన్న పిల్లల కోసం ఊయల.. ఇలా కనీస వసతులు కూడా లేని పరిస్థితి ఉంది..' అని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో 100 ఎకరాల్లో నిర్మించనున్న తెలంగాణ హైకోర్టు నూతన ప్రాంగణానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ ఎస్వీ భట్టి, రాష్ట్ర హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధేతో కలసి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీజేఐ మాట్లాడారు.

కోర్టులు మార్గదర్శకంగా నిలవాలి

'హైకోర్టు అనేది ప్రజల హక్కులను, విలువలను, విధులను పరిరక్షించే ఒక ప్రాంతం. మహిళలంటే వివక్ష తగదు. మహిళలకు, దివ్యాంగులకు కొత్త భవనంలో అన్ని సౌకర్యాలూ ఉండాలి. అన్ని వనరులతో పనిచేస్తూ కోర్టులు ఇతర ప్రభుత్వ శాఖలకు మార్గదర్శకంగా నిలవాలి. సాంకేతికతను

మిగతా 5వ పేజీలో ▶

మరో నలుగురు..

లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం

మెదక్, నిజామాబాద్, భువనగిరి, ఆదిలాబాద్ స్థానాలకు అభ్యర్థులు ఖరారు

మరో 4 స్థానాలు పెండింగ్‌లోనే.. 31న మరోసారి భేటీ కానున్న సీఈసీ



జీవన్‌రెడ్డి
నిజామాబాద్



నీలం మధు
మెదక్



చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
భువనగిరి



ఆత్రం సుగుణ
ఆదిలాబాద్

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ నుంచి బరిలో దిగే మరో నలుగురు లోక్‌సభ అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. మెదక్ నుంచి నీలం మధు, భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, నిజామాబాద్ నుంచి తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ నుంచి ఆత్రం సుగుణ పోటీ చేస్తారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 17 స్థానాలకుగాను 9 స్థానాలకు ఇంతకుముందే అభ్యర్థులను ప్రకటించగా, మిగతా స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ బుధవారం ఢిల్లీలో సమావేశమైంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్రం తరపున టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి

మిగతా 2వ పేజీలో ▶

తలనొప్పిగా మారిన ఖమ్మం

తెలంగాణలో ఖమ్మం పార్లమెంట్ స్థానం హాట్ సీట్‌గా మారింది. ఎక్కువమంది పోటీ పడుతుండటంతో ఇక్కడ ఎవరిని బరిలో దించాలన్న అంశం కాంగ్రెస్ అధిష్టానానికి తలనొప్పిగా మారింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు తమకు సంబంధించిన అభ్యర్థులకు సీటు కేటాయించాలని ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. భట్టి తన సతీమణి నందిని కోసం, పొంగులేటి తన సోదరుడు ప్రసాద్‌రెడ్డి కోసం, తుమ్మల తన కుమారుడు యుగంధర్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు. వీరితో పాటు కమ్మ సామాజికవర్గానికి చెందిన పారిశ్రామికవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్‌లు సైతం తమకు ఖమ్మం సీటు కేటాయించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఖమ్మం అభ్యర్థి ప్రకటన వాయిదా పడుతోందని చెబుతున్నారు.

ధాన్యం.. దళారుల దోపిడీ

- జిల్లాల్లో జోరుగా కోతలు.. ఏర్పాటుకాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో పది రోజుల క్రితం నుంచే వ్యాపారుల కొనుగోళ్లు
- నేరుగా రైతుల నుంచి అగ్గువకు కొనుగోలు చేసి మిల్లులకు విక్రయం

5లో

హైకోర్టు సాక్షిగా తేలిపోయిన ఈనాడు అసత్య ఆరోపణలు

- ఏపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తోందన్న ఈనాడు
- ఏబీసీ నుంచి గణాంకాలు తెప్పించిన ఢిల్లీ హైకోర్టు వెనక్కి తగ్గిన ఈనాడు... అనుబంధ పిటిషన్ ఉపసంహరణ
- 'సాక్షి' సర్క్యులేషన్ గణాంకాల ప్రచురణకు ధర్మాసనం అనుమతి



- వివరాలు 10లో ▶



ట్యాపింగ్ పేరుతో డైవర్ట్ చేస్తున్నారు

రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: 'పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇద్దరం ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి మల్కాజిగిరిలోనే పోటీకి దిగుదాం రమ్మంటే నోరు మెదపలేదు. దమ్ముంటే పోటీ చెయ్.. ఇప్పటికీ నేను నా సవాల్‌కు కట్టుబడే ఉన్నా' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో

మిగతా 2వ పేజీలో ▶

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల గోల్‌మాల్...

లబ్ధిదారులకు ఇవ్వకుండా కొల్లగొట్టిన ముఠా అరెస్ట్



నరేశ్‌కుమార్

- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆఫీస్‌లో పనిచేసిన నరేశ్‌కుమార్
- సచివాలయంలో అప్పగించాల్సిన చెక్కులు పక్కదారి.. మరో ముగ్గురితో కలసి అక్రమంగా నగదు డ్రా
- లబ్ధిదారుల ఫిర్యాదుతో వెలుగులోకి..
- చెక్కుల మాయంపై డిసెంబర్‌లోనే పోలీసులకు ఫిర్యాదు చేశామని హరీశ్‌రావు కార్యాలయం వెల్లడి

- వివరాలు 5లో ▶

ఇదండీ సంగతి



సార్ ఢిల్లీ వెళ్లలేదయ్యా! ఢిల్లీనే సార్ దగ్గరకొచ్చింది!

కేజ్రీవాల్ నిజాలన్నీ వెల్లడిస్తారు...

కేజ్రీవాల్ మద్యం కుంభకోణం కేసులో నిజాల్ని గురువారం కోర్టులో బయటపెట్టబోతున్నారని ఆయన భార్య సునీత చెప్పారు.



6లో



అమెరికా జోక్యంపై అభ్యంతరం

కేజ్రీవాల్ అరెస్ట్‌పై అమెరికా స్పందించడాన్ని భారత్ తప్పుబట్టింది. అమెరికా దౌత్యవేత్తను పిలిపించి తన అసంతృప్తిని తెలిపింది.

క్లుప్తంగా...

బీజేపీకి మాజీ మంత్రి రాజీనామా

కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించిన చిత్తరంజన్‌దాస్



కల్వకుర్తి రూరల్: బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ తెలిపారు. బుధవారం కల్వకుర్తిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, గతంలో బీజేపీలో చేరిన కొద్ది నెలలకే జడ్చర్ల స్థానం నుంచి పోటీకి అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు చెప్పారు. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణం అన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తానని స్వయంగా సీఎం ప్రకటించడం తనను ఆలోచింపజేసిందని, అందుకోసమే బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. శుక్ర లేదా శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరతానని ప్రకటించారు. 1989లో కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుపై విజయం సాధించిన చిత్తరంజన్‌దాస్ సంచలనం సృష్టించారు.

హరీశ్ బీజేపీలోకి పోకుండా చూసుకో..

కేటీఆర్‌కు కాంగ్రెస్ నేతల సూచన

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరుతారని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించడం విడ్డూరమని కాంగ్రెస్ నేతలు గజ్జెల కాంతం, పిడమర్తి రవి అన్నారు. ముందు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో హరీశ్‌రావు బీజేపీలోకి పోకుండా చూసుకోవాలని హితవు పలికారు. వారు బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇకపై రేవంత్‌రెడ్డిపై ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేటీఆర్‌కు దమ్ముంటే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ చేశారు. పదేళ్లలో దోచుకున్న దానిపై విచారణ జరుగుతోందని చెప్పారు. కేటీఆర్ చెల్లి కవిత తీహార్ జైలుకు పోయిందని, లోక్‌సభ ఎన్నికలైపోగానే కేసీఆర్ కుటుంబ సభ్యులందరూ జైలుకే పోతారని స్పష్టం చేశారు. ఫోన్లు ట్యాపింగ్ చేసింది మీరు కాదా? అని ప్రశ్నించారు.

సీఎం రేవంత్‌తో వీహెచ్ భేటీ



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు భేటీ అయ్యారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డిలతో కలిసి సీఎం రేవంత్‌తో ఆయన సమావేశమయ్యారు. ఖమ్మం లోక్‌సభ సీటును ఆశించిన వీహెచ్ గత కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల ఆయన మీడియా సమక్షంలో తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. రేవంత్ తనకు సమయం ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ చొరవ తీసుకుని వీహెచ్‌ను సీఎం రేవంత్ వద్దకు తీసుకెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీలో సమన్వయ లోపం ఉండకూడదన్న ఉద్దేశంతో సీఎం వీహెచ్‌తో భేటీ అయి అన్ని విధాలా అండగా ఉంటానని ఆయనకు హామీ ఇవ్వడం గమనార్హం.

రుణమాఫీ, రైతుబంధుపై పచ్చి అబద్ధాలు

బీఆర్‌ఎస్ నేత దేవీప్రసాద్



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీపై మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడిన తీరు ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసినట్లుగా ఉందని బీఆర్‌ఎస్ నాయకుడు దేవీ ప్రసాద్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎన్నికల హామీల్లో ఏ ఒక్కదానినీ నెరవేర్చలేదన్నారు. ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీలు ఎక్కడివక్కడే ఉన్నాయని, రైతుబంధుపై మంత్రులు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని అన్నారు. పార్టీ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలసి బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 93 శాతం మంది రైతులకు రైతుబంధు సాయం అందిందని ప్రభుత్వం చెప్తున్నా.. 3 ఎకరాలకు పైగా ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు పడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటే కరువు కూడా వచ్చిందని, 170 మండలాల్లో 20 లక్షలకు పైగా ఎకరాల్లో పంట ఎండిపోయిందని పేర్కొన్నారు.

ఎన్నికల హామీలపై చర్చకు సిద్ధం: ఎర్రోళ్ల
ఐదేళ్ల పాటు నాటి టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పాలమూరు జిల్లాపై గుత్తాధిపత్యం చెలాయించిన మంత్రి జూపల్లి కృష్ణారావు.. కేసీఆర్ కేబినెట్‌లో పనిచేసిన విషయాన్ని మరచి విమర్శలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో పాలమూరు జిల్లాలో ప్రాజెక్టుల కింద ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చిన విషయం జూపల్లికి తెలియదా అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులతో పాటు రేవంత్ ఇచ్చిన ఎన్నికల హామీలపై జూపల్లితో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్‌ను వేటాడతామని శ్రీనివాస్ హెచ్చరించారు.

మల్కాజిగిరిలో భారీ మెజారిటీతో గెలవాలి

బీఆర్‌ఎస్, బీజేపీల అడ్రస్ గల్లంతవ్వాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్, టీడీపీ నేతలు
- పాల్గొన్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్సీ పట్నం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీలో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గతంలో తనకు వచ్చిన మెజారిటీ కంటే మరింత భారీ ఆధిక్యం సాధించి మల్కాజిగిరి నియోజకవర్గంలో పార్టీ జెండాను మరోమారు ఎగురవేయాలని ఆయన కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఎల్బీనగర్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు చెందిన బీఆర్‌ఎస్, టీడీపీతో పాటు పలువురు కమ్మ సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున వచ్చిన నాయకులు, కార్యకర్తలకు సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా దూసుకుపోతోందని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ, రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన బీఆర్‌ఎస్‌లకు మల్కాజిగిరిలో ఉనికి లేకుండా చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడ్డా.. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికల్లో గెలవ లేవని ఆయన అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో తమకు అడ్రస్ లేకుండా పోతుందనే భయంతో బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీలో చేరిన వారిలో గతంలో మేడ్చల్ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసిన కృష్ణ ప్రసాద్, తెలంగాణ కమ్మ సంఘం నాయకులు బి.రవిశంకర్, అరికెపూడి ప్రసాద్ (మేడ్చల్), కుత్బుల్లాపూర్‌కు చెందిన బోడు వెంకటేశ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు శాలిని, పావనిరెడ్డి, రమణారెడ్డి, మాజీ ఎంపీపీ సి.దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సీఎం రేవంత్ సమక్షంలో పార్టీలో చేరిన బీఆర్‌ఎస్, టీడీపీ నేతలు. చిత్రంలో మంత్రి తుమ్మల, మహేందర్‌రెడ్డి

అధికారం, ఆస్తుల కోసమే ద్రోహం చేశాడు

మనం టికెట్ ఇస్తేనే రంజిత్‌రెడ్డి ఎవరో తెలిసింది: కేటీఆర్
- ఏప్రిల్ 13న చేవెళ్లలో జరిగే బీఆర్‌ఎస్ సభకు కేసీఆర్
- చేవెళ్లలో కాంగ్రెస్‌కు అభ్యర్థి కూడా దొరకలేదు
- చేవెళ్లలో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో తలసాని, మల్లారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: అధికారం, ఆస్తులను కాపాడుకోవడం కోసమే చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పార్టీని విడిచిపెట్టి ద్రోహం చేశారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. చేవెళ్ల నుంచి బీఆర్‌ఎస్ సీటు ఇచ్చి గెలిపించుకున్న తర్వాతే రంజిత్‌రెడ్డి ఎవరో ప్రపంచానికి తెలిసిందన్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో బుధవారం కేటీఆర్ తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. చేవెళ్ల పరిధిలో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డిపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. '2019లో రాజకీయాల్లోకి రంజిత్‌రెడ్డి కొత్తగా వచ్చినా పార్టీ కార్యకర్తలంతా కష్టపడి ఆయనను గెలిపించారు. ఆయనకు పార్టీలో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు నియోజకవర్గంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయను అని పార్టీ ఎదుట అశక్తతను వ్యక్తం చేయడంతోపాటు రాజకీయాల నుంచి తప్పుకుంటా అని రంజిత్‌రెడ్డి చెప్పారు. కానీ రంజిత్‌రెడ్డి తన సోదరి అని చెప్పుకున్న కవిత నివాసంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు సోదాలు జరిపి అరెస్టు చేసిన రోజే నవ్వుకుంటూ కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడిగా మిగిలిపోయారు. 2019 లోక్‌సభ ఎన్నికల ముందు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా పార్టీ కంటే తానే ఎక్కువ అనుకుని వేరే పార్టీలోకి వెళ్లి పోటీ చేస్తే ఫలితం ఏమైందో అందరికీ తెలుసు. పార్టీ కంటే తాను పెద్ద అనే అహంకారం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లో గెలవరు. అదే నిజమైతే దేశంలో పార్టీలతో సంబంధం లేకుండా స్వతంత్ర అభ్యర్థులే గెలుస్తారు. సీఎం రేవంత్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి మనసులు కలిసినంత మాత్రాన క్షేత్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు కలిసి పనిచేస్తాయని అనుకోవడం వారి రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం. చేవెళ్లలో కాంగ్రెస్‌కు కనీసం అభ్యర్థి కూడా దొరకలేదు. పార్టీలో సొంతంగా అభ్యర్థులు లేని కాంగ్రెస్.. చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో గెలుపొందడం అసాధ్యం'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

13న చేవెళ్లలో భారీ సభ
ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 13న చేవెళ్లలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. ఈ సభకు పార్టీ అధినేత కేసీఆర్ హాజరుకానున్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన భేటీలో సభ ఏర్పాట్లు, జన సమీకరణ తదితరాలపై కేటీఆర్ చర్చించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత బీఆర్‌ఎస్ నిర్వహిస్తున్న తొలి సభ కావడంతో ఏర్పాట్లను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నిర్ణయించారు. కాగా చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని నేతలతో ఈ నెల 29న తెలంగాణ భవన్‌లో సమావేశం జరగనుంది. బుధవారం కేటీఆర్ అధ్యక్షతన జరిగిన భేటీలో పార్టీ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తోపాటు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు వాణీదేవి, ఎగ్గె మల్లేశం, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, డాక్టర్ ఆనంద్, రోహిత్‌రెడ్డితోపాటు పార్టీ నేతలు కార్తీక్ రెడ్డి, శ్రీశైల్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్యాపింగ్ పేరుతో డైవర్ట్ చేస్తున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'భారీ డైలాగులే తప్ప విషయానికి వస్తే పారిపోయే పిరికివాడు రేవంత్‌రెడ్డి. ఈ ఎన్నికల పోరు వ్యక్తుల మధ్య కాదు. పదేళ్ల నిజానికి (బీఆర్‌ఎస్), వంద రోజుల అబద్ధానికి (కాంగ్రెస్), మరో పదేళ్ల విషానికి (బీజేపీ) మధ్యన జరుగుతున్నాయి. కేసీఆర్‌ను నోటికొచ్చినట్లు తిడుతున్న వారిని చూసి ఎందరో వేదన చెందుతున్నారు. నాకూ తన్నాలనే ఉంది కానీ అంతకంటే బలమైన ఓటు దెబ్బతోనే గట్టిగా జాడించి తన్నాలి. ఆరు గ్యారంటీల అమలు చేతకాక ట్యాపింగ్‌లు, స్కాములు, స్కీముల పేరిట గారడీలు చేస్తూ ప్రజలను డైవర్ట్ చేస్తున్నారు. పది లక్షల ఫోన్లు ట్యాప్ చేశారంటున్నారు. లంగలవి, దొంగలవి, ఒకరిద్దరు లుచ్చాగాళ్లవి ట్యాప్ చేసి ఉండొచ్చు. అది పోలీసుల పని. హీరో నాగార్జున గ్రీకువీరుడైతే, ఈయన లీకు వీరుడు. ధైర్యముంటే లీకులు బంద్ చేసి మీరు చేసిన తప్పు ఇదీ అని చెప్పు. నువ్వే ముఖ్యమంత్రివి, ఎవరిని లోపల వేస్తావో వేయ్.. అంతేకానీ లేనిపోని మాటలెందుకు' అని కేటీఆర్ అన్నారు.

ఈటల ఇంకా బీఆర్‌ఎస్‌లో ఉన్నా అనుకుంటున్నడు
'హుజూరాబాద్, గజ్వేల్‌లో ఓడిపోయిన ఈటల రాజేందరన్న తానింకా బీఆర్‌ఎస్‌లో ఉన్నా అనుకుంటున్నడు. రైతులకు రుణమాఫీ ప్రకటిస్తే ఇప్పుడు పోటీ నుంచి తప్పుకుంటా అంటున్నడు. మల్కాజిగిరిలో వేరే పార్టీల నుంచి పోటీ చేస్తున్న వారు కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి వెళ్లినవారే. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలి' అని కేటీఆర్ చెప్పారు. కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రులు తలసాని, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఉపఎన్నిక

- మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ పరిధిలో ఏర్పాట్లు పూర్తి
- 10 పోలింగ్ స్టేషన్లు.. 1,439 మంది ఓటర్లు
- కొడంగల్‌లో ఓటుహక్కు వినియోగించుకోనున్న సీఎం రేవంత్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం పోలింగ్ జరగనుండగా.. స్థానిక సంస్థల పరిధిలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, పురపాలక కౌన్సిలర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరితోపాటు ఎక్స్ అఫీషియో హోదాలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలతోపాటు ముగ్గురు ఎమ్మెల్సీలు మొత్తం 1,439 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ అఫీషియోగా కొడంగల్‌లో ఓటు వేయనున్నారు. ఉపఎన్నికకు మహబూబ్‌నగర్, కొడంగల్, నారాయణపేట, వనపర్తి, గద్వాల, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. బ్యాలెట్ ద్వారా ప్రజాప్రతినిధులు ఓట్లు వేయనున్నారు. బుధవారం ఉమ్మడి జిల్లా కేంద్రం నుంచి అన్ని పోలింగ్ సెంటర్లకు ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. వచ్చే నెల రెండో తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

నేరుగా పోలింగ్ కేంద్రాలకే..
పార్లమెంట్ ఎన్నికలకు ముందు వచ్చిన ఉప ఎన్నిక కాగా.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికార కాంగ్రెస్ నుంచి యువ పారిశ్రామిక వేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి పోటీ పడుతున్నారు. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకుని పట్టు సాధించాలని బీఆర్‌ఎస్.. ఈ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని కాంగ్రెస్ ఎత్తుకు పైఎత్తులతో ముందుకు సాగుతున్నాయి. ఓటర్లు చేజారొద్దనే ఉద్దేశంతో ఓటర్లను ఆయా పార్టీలు గోవా, ఊటీ, కొడైకెనాల్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యాంప్‌లకు తరలించారు. గురువారం పోలింగ్ జరగనుండగా.. బుధవారం తెల్లవారుజామునే క్యాంపుల నుంచి తరలించే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్టు తెలిసింది. రాత్రికి వారిని హైదరాబాద్‌లోని రిసార్ట్స్‌కు తరలించి.. గురువారం ఉదయం నేరుగా ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ సెంటర్లకు తీసుకురానున్నారు. సంఖ్య ప్రకారం బీఆర్‌ఎస్‌కు మెజారిటీ ఉన్నా, కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల క్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. గెలుపుపై ఆయా పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నాకు పోటీ చేయడం ఇష్టం లేదని చెప్పా

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ
- తెలంగాణ నేతకు ఏపీలో రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి బీసీలకు జగన్ ప్రాధాన్యం కల్పించారు
- ఫోన్ ట్యాపింగ్ కేటీఆర్ పనే అయి ఉంటుంది



సాక్షి, హైదరాబాద్: భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి తనను పోటీ చేయాల్సిందిగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరారని, గెలిపించుకునే బాధ్యత కూడా తీసుకుంటానని ఆయన చెప్పినా తనకు పోటీ చేయడం ఇష్టలేదని స్పష్టం చేశానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయిన తర్వాత కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలు రాజకీయంగా వెనుకబడి పోతున్నారని అభిప్రాయపడ్డారు. తెలంగాణకు చెందిన బీసీ నేత ఆర్.కృష్ణయ్యకు ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యత్వం ఇవ్వడం ద్వారా ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు తగిన ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. బీఆర్‌ఎస్‌నుద్దేశించి సీఎం రేవంత్ ఒక్క మాట మాట్లాడితే ఎగిరెగిరి పడిన ఆ పార్టీ నేతలు, ఇప్పుడు కేటీఆర్ మాట్లాడుతున్న మాటలకు, ఆయన భాషకు ఏం చెప్తారని ప్రశ్నించారు. కేటీఆర్‌కు ముసళ్ల పండుగ ముందుందని, బీఆర్‌ఎస్ ఆరిపోయే దీపమని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వెనక కేటీఆర్ ఉండి ఉంటారని అభిప్రాయపడ్డ మధుయాష్కీ.. ఈ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లు ఎ1, ఎ2 అవుతారని జోస్యం చెప్పారు. ఎన్నికలకు ముందు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడాన్ని మాత్రమే తప్పు పట్టామని, కేజ్రీవాల్‌పై విచారణను ఏఐసీసీ తప్పు పట్టలేదని మధుయాష్కీ స్పష్టం చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌లో కేటీఆర్‌ది మేకపోతు గాంభీర్యం

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బయటకు వచ్చిన తర్వాత మాజీ మంత్రి కేటీఆర్ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని, ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్‌లు జైలుకు వెళ్లాల్సిందేనని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ట్యాపింగ్‌ను కేసీఆర్ ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు చేశారని, నిజంగా ఈ వ్యవహారంలో కేసీఆర్ కుటుంబం పాత్ర లేకపోతే లైడిటెక్టర్ పరీక్షకు వస్తారా? అని సవాలు విసిరారు. బుధవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ప్రైవేట్ ట్యాపింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని, నిఘా వ్యవస్థను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. చెల్లెలు కవిత తీహార్ జైలుకు వెళ్తే.. కేటీఆర్ మాత్రం ఎమ్మెల్సీ సీటు కోసం గోవాలో చిందులు వేశాడని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదని, పరిస్థితులన్నీ బాగున్నప్పుడు కాదని, ఇలాంటి సమయంలో కేసీఆర్ కుటుంబ సభ్యులు పార్లమెంటుకు పోటీ చేయాలని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బాధితులు చాలా మంది ఉన్నారన్నారు. తాను ఫిర్యాదు చేసినట్లే అందరూ డీజీపీకి ఫిర్యాదు చేయాలని, ప్రతి జిల్లాలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్ ఫిర్యాదులు స్వీకరించాలని శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

రెండంకెల సీట్లతో సత్తా చాటుతాం

ప్రజలు మరోసారి మోదీ పాలన కోరుకుంటున్నారు: కిషన్‌రెడ్డి



సనత్‌నగర్ నియోజకవర్గంలో స్థానికులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్ (హైదరాబాద్): తెలంగాణలో మెజార్టీ ఎంపీ సీట్లను బీజేపీ గెలుచుకుంటుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సహా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇప్పటికే రాష్ట్ర బీజేపీ కార్యక్రమాల్లో పాల్గొన్నారని, వారి పర్యటనలతో ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. బుధవారం ఆయన సికింద్రాబాద్ పార్ల మెంట్ పరిధిలోని సనత్‌నగర్ నియోజకవర్గం రాంగోపాల్‌పేట, పాన్‌బజార్, రాణిగంజ్, ప్యాట్నీ, కళాసీగూడ, ఓల్డ్ బోయిగూడ, నాలాబజార్, మోండా మార్కెట్ బస్తీల్లో పర్యటించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో డబుల్ డిజిట్ సీట్లను గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల ప్రచార కా ర్యక్రమం ప్రారంభమైందని, తెలంగాణలో నిర్వహించిన ఐదు బీజేపీ కార్యక్రమా ల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పోలింగ్ బూత్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని కేడర్‌కు దిశా నిర్దేశం చేశారని చెప్పారు. భారీ బహిరంగ సభలే కాకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి మాట్లాడాలని నిర్ణయించామని వెల్లడించారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మోదీ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

బీజేపీ తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జిగా అభయ్ పాటిల్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల వ్యవహారాల ఇన్‌చార్జిగా అభయ్ పాటిల్‌ను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని ఎన్నికల వ్యవహా రాలను పాటిల్ పర్యవేక్షించనున్నారు. ఈయనతో పాటు 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఎన్నికల ఇన్‌చార్జులు, సహ ఇన్‌చార్జు లను నియమించారు. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు.

మరో నలుగురు..



సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీ

▶ మొదటి పేజీ తరువాయి

దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి పాల్గొన్నారు.

ఇంకా పెండింగ్‌లో నాలుగు స్థానాలు
సీఈసీలో 8 స్థానాలపై చర్చ జరుగుతుందని భావించినప్పటికీ కేవలం ఆరు స్థానాలపై మాత్రమే చర్చ జరిగింది. పార్టీలో అంతర్గతంగా ఒత్తిడి ఎక్కువగా ఉన్న ఖమ్మం స్థానంతో పాటు హైదరాబాద్ అభ్యర్థి ఎవరనేది ప్రస్తావనకు రాలేదు. ఇక ఆరు స్థానాల్లోనూ నాలుగు సీట్లను మాత్రమే ఖరారు చేశారు. వరంగల్ నుంచి దొమ్మాట సాంబయ్య, నమిళ్ల శ్రీనివాస్, కరీంనగర్ నుంచి ప్రవీణ్ రెడ్డి, రాజేందర్ రావు, తీన్మార్ మల్లన్నల పేర్లను పరిశీలించినా నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈ రెండు స్థానాలతో పాటు ఖమ్మం, హైదరాబాద్ స్థానాల్లో ఎవరి అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ అధిష్టానం మొగ్గు చూపుతుందనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నెల 31న మరోసారి జరగనున్న సీఈసీ భేటీలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఎన్నికలకు రాష్ట్ర పార్టీని సన్నద్ధం చేసేలా..

- నేటి నుంచి బీజేపీ ముఖ్య నేతల క్షేత్రస్థాయి పర్యటనలు
- లోక్‌సభ ఎన్నికల్లో సమన్వయంపై సునీల్ బన్సల్ తరుణ్‌చుగ్, శివప్రకాశ్, ఇతర నేతల సమీక్ష



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్ర పార్టీని పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయడంలో భాగంగా బీజేపీ జాతీయ నాయకులు తెలంగాణకు రానున్నారు. ముఖ్యంగా పార్టీలో నాయకులు, కార్యకర్తల మధ్య మెరుగైన సమన్వయ సాధన కోసం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జిలు సునీల్ బన్సల్, తరుణ్ చుగ్, సంస్థాగత సహ ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, ఇతర నేతలు సమీక్షించనున్నారు. గురువారం నుంచి వరుసగా రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్ల పరిధిలో ఎక్కడికక్కడ సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గాల ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీలతో భేటీ అయ్యి ఇప్పటి వరకు చేపట్టిన, చేపడుతున్న కార్యకలాపాలను సమీక్షిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని లోక్‌సభ నియోజకవర్గాల్లో మండల పార్టీ అధ్యక్షులు, ఆపై స్థాయి నాయకులతో, పట్టణ ప్రాంతాల్లోని స్థానాల్లో డివిజన్, ఆపై స్థాయి నాయకులతో సమావేశమై ఆయా అంశాలపై సమీక్ష నిర్వహిస్తారు. గురువారం శివప్రకాశ్ నాగర్‌కర్నూల్, హైదరాబాద్ ఎంపీ స్థానాలో పర్యటించనుండగా, మిగతా నేతలకు కూడా రెండేసి లోక్‌సభ స్థానాలను కేటాయించినట్టు తెలిసింది. సునీల్ బన్సల్, ఇతర నేతలు కూడా ఒకట్రెండు రోజుల్లో రాష్ట్రాన్ని సందర్శించనున్నట్టు తెలుస్తోంది. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్‌లకు కూడా కొన్ని ఎంపీ సీట్లలో నాయకుల మధ్య సమన్వయం సాధించే బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం. పార్టీ జాతీయ నాయకులతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీ కూడా ఈ సమీక్ష సమావేశాల్లో పాలుపంచుకోనున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన వారిని, ముఖ్యంగా మహిళలు, ఇతర వర్గాల వారిని కలుసుకుని మద్దతును కూడగట్టాలని నిర్ణయించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల కార్యాలయాలు ప్రారంభించడం, ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీల భేటీల నిర్వహణ, ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేయడంపై దృష్టి పెట్టనున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆ ముగ్గురిపై కేసులు పెట్టాలి

- విడివిడిగా ఎఫ్‌ఐఆర్‌లు పెట్టి త్వరితంగా విచారణ జరిపించాలి
- డీజీపీ రవిగుప్తాకు మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్, దుబ్బాక ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఉన్న మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు అప్పటి కలెక్టర్ వెంకటరామిరెడ్డిని ముద్దాయిలుగా చేర్చి కేసులు పెట్టాలని డీజీపీ రవిగుప్తాకు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ ముగ్గురిపై విడివిడిగా ఒక్కో ఎఫ్‌ఐఆర్ పెట్టి, ఈ కేసులపై వెంటనే విచారణ జరిపి త్వరితంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై స్పందించి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి, చీఫ్ జస్టిస్‌లకు కూడా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. దుబ్బాక ఉపఎన్నికతో పాటు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తనతోపాటు, తన కుటుంబసభ్యుల ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేయడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం డీజీపీ ఆఫీసులో రవిగుప్తాకు వినతిపత్రం సమర్పించాక రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడారు. ట్యాపింగ్‌పై సమగ్ర విచారణ జరిపించాలని డీజీపీని కోరానని, ఆవిధంగా జరగని పక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయిస్తానని చెప్పారు. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికలప్పుడు కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అరెస్ట్ అయిన ప్రణీత్‌రావు చెప్పినట్టు మీడియాలో వచ్చిందని, ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై చర్యలు తీసుకోవాలని డీజీపీకి విజ్ఞప్తి చేశామన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాలు లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరిగే ప్రసక్తే లేదని రఘునందన్ స్పష్టం చేశారు. సినిమా పరిశ్రమలో ఉన్న వారితో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఫోన్లను కొందరు ట్యాపింగ్ చేసి బెదిరింపులతో డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. హైకోర్టు జడ్జిల ఫోన్ సంభాషణలు విన్నారని కూడా తెలుస్తోందని, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి తెలంగాణకు వస్తున్నందున ఆయనకు ఫోన్ ట్యాపింగ్ విషయం ఇక్కడి న్యాయమూర్తులు తెలియజేయాలని కోరారు.

టెట్.. సర్వీస్ టీచర్లు లైట్!

పరీక్షకు ఎక్కువ మంది ప్రభుత్వ టీచర్లు దూరం ● ఇప్పుడు సన్నద్ధత కష్టమంటూ అసంతృప్తి

- ఏ పేపర్ ఎవరు రాయాలో స్పష్టత ఏది?
- మారిన సిలబస్, సన్నద్ధతకు సమయంపై గందరగోళం
- సర్వీస్ టీచర్లకోసం ప్రత్యేక టెట్ పెట్టాలనే డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఎస్ టెట్)పై సర్వీస్ టీచర్లు ఆసక్తి చూపడం లేదు. ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్న టీచర్లు అసలే ముందుకు రావడం లేదు. ఎవరు ఏ పేపర్ రాయాలో స్పష్టత లేదని.. దానికితోడు సన్నద్ధతకు సమయం లేదని ప్రభుత్వ టీచర్లు పేర్కొంటున్నారు. విద్యార్థులకు వార్షిక పరీక్షల నిర్వహణ, ఆపై ఎన్నికల విధులు ఉంటాయని.. అలాంటిది టెట్‌కెలా సన్నద్ధమవుతామని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో 2012కు ముందు సర్వీస్‌లో చేరిన 80వేల మందికిపైగా ప్రభుత్వ టీచర్లకు టెట్ అర్హత లేదు. అయితే విద్యాహక్కు చట్టం ప్రకారం.. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) నుంచి స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ).. స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎం పదోన్నతి పొందాలంటే టెట్ ఉత్తీర్ణత పొందాలి. అయితే ఈ పదోన్నతి కూడా అవసరం లేదనే భావన టీచర్లలో కనిపిస్తోందని విద్యాశాఖ వర్గాలు చెప్తున్నాయి. పదోన్నతి వస్తే వేరే ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుందని కొందరు టీచర్లు అంటున్నారు. ఉన్న ప్రాంతంలోనే పనిచేయడం ఉత్తమమని పేర్కొంటున్నారు.



టెట్ దరఖాస్తుల ప్రక్రియ మొదలైన నేపథ్యంలో.. సర్వీస్ టీచర్లు విద్యాశాఖ వద్ద అనేక సందేహాలు లేవనెత్తుతున్నారు.

పరీక్షపై స్పష్టత ఏదీ?

వృత్తి నైపుణ్యం పెంపు కోసం సర్వీస్ టీచర్లు కూడా టెట్ రాయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారని.. పదోన్నతుల కోసం టెట్ తప్పనిసరి అని చెప్పలేదని ఉపాధ్యాయ వర్గాలు చెప్తున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే టీచర్లు డీఎడ్ అర్హతతో ఉంటారు. వారు పేపర్–1 పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేయాలంటే బీఈడీ అర్హత ఉండాలి. వారు పేపర్–2 రాయాలి. ఎస్జీటీలు పేపర్–1 మాత్రమే రాయగలరు. వారికి బీఈడీ లేని కారణంగా పేపర్–2 రాయలేరు. పదోన్నతులూ పొందే ఆస్కారం లేని పరిస్థితి తలెత్తుతుంది. ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎంలుగా మాత్రం వెళ్లే వీలుంది. ఆ పదోన్నతి వస్తే ఇతర స్కూళ్లకు వెళ్లాలి. వేతనంలోనూ పెద్దగా తేడా ఉండదనేది టీచర్ల అభిప్రాయం. అంతేగాకుండా ఎవరు ఏ పేపర్ రాయాలనే దానిపై నోటిఫికేషన్‌లో స్పష్టత ఇవ్వలేదని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి.

సన్నద్ధతకు సమయమేదీ?

చాలా మంది టీచర్లు పదేళ్ల క్రితమే ఉపాధ్యాయులుగా చేరారు. అప్పటికి, ఇప్పటికి బీఈడీ, డీఎడ్‌లో అనేక మార్పులు వచ్చాయి. టెక్స్ట్ పుస్తకాలు అనేక సార్లు మారాయి. అయితే టీచర్లు వారు బోధించే సబ్జెక్టులో మాత్రమే అప్‌గ్రేడ్ అయ్యారు. కానీ టెట్ రాయాలంటే అన్ని సబ్జెక్టులూ చదవాలి. జూన్ 12 నుంచి టెట్ పరీక్షలు జరగనున్నాయి. టీచర్లు ఏప్రిల్ నెలాఖరు వరకు పరీక్షల నిర్వహణ, పేపర్లు దిద్దడంలోనే నిమగ్నమై ఉంటారు. మే నెలలో లోక్‌సభ ఎన్నికలున్నాయి. టీచర్లు ఆ విధులకు హాజరవ్వాల్సి ఉంటుంది. దీనితో టెట్ సన్నద్ధతకు అతి తక్కువ రోజులే ఉంటాయని టీచర్లు చెప్తున్నారు. ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు అన్ని తరగతులకు సంబంధించిన అని సబ్జెక్టులు చదివితే తప్ప టెట్‌లో అర్హత మార్కులు సాధించడం కష్టమని అంటున్నారు. ఈ క్రమంలోనే చాలా మంది టీచర్లు టెట్ రాసేందుకు సుముఖత చూపడం లేదు. టీచర్ల కోసం ప్రత్యేక టెట్ చేపట్టాలని, నోటిఫికేషన్‌లోని అంశాలపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

‘సీఎం అపరిచితుడిగా మాట్లాడుతున్నారు’

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికలు రాగానే సీఎం రేవంత్‌రెడ్డి అపరిచితుడిగా మాట్లాతున్నారని బీజేపీ అధికార ప్రతినిధి రాణీ రుద్రమ ఎద్దేవా చేశారు. అంతకుముందు ప్రధాని మోదీ తమకు పెద్దన్న అని, బొల్లారం మిలటరీ భూమి సమస్యను మోదీ పరిష్కరించారని రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు తెలంగాణకు మోదీ ఏం చేశారంటూ మాటమారుస్తున్నారని విమర్శించారు. బుధవారం రాణీరుద్రమ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి దోహదపడిన ప్రధాని మోదీని చూసే బీజేపీకి ఓటేయమని తాము ప్రజలను కోరతామన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య లేఖ

కాచిగూడ(హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫీజును రూ.2వేల నుంచి రూ.200లకు వెంటనే తగ్గించి నిరుద్యోగులకు ఉపశమనం కలిగించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. గతంలో పేపర్‌కు కేవలం రూ.100, రెండు పేపర్లకు కలిపి రూ.200 ఫీజు ఉండేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశ పరీక్షలకు, పోటీ పరీక్షలకు ఫీజులు తగ్గిస్తామని హామీ ఇచ్చారని, పరీక్ష ఫీజుల పెంపును నిరుద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే నిరుద్యోగులు వివిధ పరీక్షలకు కోచింగ్‌ల కోసం అప్పుల పాలయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



ఓపెన్ స్కూల్ చదివితే డీఎస్సీకి చాన్స్ లేనట్టే

- టెట్‌కు కూడా అనర్హులే.. 25 వేల మందికి నిరాశ
- సుప్రీంకోర్టు తీర్పుతో ‘ఓపెన్’అభ్యర్థులకు చిక్కులు



సాక్షి, హైదరాబాద్: ఓపెన్ స్కూల్ విధానంలో కోర్సులు చేసిన వారికి ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసే అవకాశం ఉండదని అధికార వర్గాలు తెలిపాయి. వీళ్లు గతంలో టెట్ పాసయినా ఉపాధ్యాయ నియామకాల్లో దరఖాస్తు చేసేందుకు అనుమతి నిరాకరించాలని నిర్ణయించారు. ఇటీవల జరిగిన విద్యాశాఖ సమీక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. దీనిపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత ఇవ్వనున్నారు. దీనివల్ల దాదాపు 25 వేల మంది డీఎస్సీకి దూరమయ్యే అవకాశం ఉంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ గతంలో ఇంటర్ ఉత్తీర్ణతతో డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించింది. వీటిని రెగ్యులర్ డీఎడ్ కోర్సులతో సమానంగా భావించారు. ఈ అర్హతతో అభ్యర్థులు ఇంతకాలం రాష్ట్రంలో నిర్వహించిన టెట్‌కు హాజరయ్యారు. టెట్ దరఖాస్తులో అర్హత కాలంలో డీఎడ్‌కు బదులు ‘ఇతరులు’అనే కాలంతో వీళ్లు దరఖాస్తు చేసేవాళ్లు. కానీ సుప్రీంకోర్టు జనవరిలో ఈ వ్యవహారంపై తీర్పు చెప్పింది. రెగ్యులర్ డీఎడ్‌తో ఇది సమానం కాదని పేర్కొంది. నేషనల్ ఓపెన్ స్కూల్ ఇచ్చే సర్టిఫికెట్‌తో కేవలం ప్రైవేటు స్కూళ్లలో టీచర్లుగానే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఈ తీర్పును అమలు చేయాలని భావిస్తోంది. టెట్‌కు, డీఎస్సీకి ఇప్పటికే ఎవరైనా దరఖాస్తు చేసినా, వెరిఫికేషన్‌లో వీరిని పక్కన పెట్టాలని అధికారులు నిర్ణయించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకే ఇలా చేయాల్సి వస్తోందని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

స్వచ్ఛంద సంస్థకు మినీ బస్సు

నిర్వాహకులకు కీని అందజేసిన ఎస్‌బీఐ

సాక్షి, హైదరాబాద్: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)లో భాగంగా సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలోని ‘మంచికలలు– హోమ్ ఫర్ ద నీడీ చిల్డ్రన్’స్వచ్ఛందసంస్థకు భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) టాటావింగర్ మినీబస్సును అందజేసింది. బుధవారం కోఠిలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శరత్‌కుమార్ పుప్పాల సమక్షంలో ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ (ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్ అండ్ టెక్నాలజీ) చల్లా శ్రీనివాసులు శెట్టి మినీ బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎస్ శెట్టి మాట్లాడుతూ...‘మంచికలలు’సంస్థ కంటున్న కలలు గొప్పకలలుగా మారాలని కోరుకుంటున్నామన్నారు. ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ... అనాథలు, ‘మంచికలలు’కు సహకారం అందించడం తమకెంతో గౌరవాన్ని కలిగిస్తోందన్నారు.



స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు మినీ బస్సు కీని అందజేస్తున్న సీఎస్ శెట్టి

ఐసీఏఆర్–ఐఐఆర్ఆర్‌కు రూ. 4.5 లక్షలు

ఈ సందర్భంగా ఎస్‌బీఐ ఫౌండేషన్ గ్రామసేవలో భాగంగా...‘ప్రమోషన్ ఆఫ్ డైరెక్ట్ సీడెడ్ రైస్’ (డీఎస్ఆర్)కు సంబంధించి ఎస్‌బీఐ ఫౌండేషన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్)–హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్ఆర్)ల మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఇందులో భాగంగా ఐసీఏఆర్– ఐఐఆర్ఆర్‌కు రూ. నాలుగున్నర లక్షల చెక్కును సీఎస్ శెట్టి అందజేశారు. కార్యక్రమంలో రాజేశ్ కుమార్, ఎస్‌బీఐ ఫౌండేషన్ ఎండీ సంజయ్ ప్రకాశ్, ఐసీఏఆర్– ఐఐఆర్ఆర్ డైరెక్టర్ రామన్ మీనాక్షి సుందరం, హెడ్ ఆఫ్ క్రాప్ ప్రొడక్షన్ మహేందర్ కుమార్ పాల్గొన్నారు.

1,300 కిలోల పేలుడు పదార్థాల పట్టివేత

- ఇద్దరు అరెస్ట్..పరారీలో మరొకరు

మహబూబాబాద్ రూరల్ : పోలీసులు 1,300 కిలోల పేలుడు పదార్థాలను పట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్ట్ చేయగా, మరొకరు పరారయ్యారు. బుధవారం మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాంనాథ్ కేకన్ ఈ కేసు వివరాలు వెల్లడించారు. మరిపెడ ఎస్సై తాహెర్ బాబా ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. వీరారం క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులను గమనించిన బొలెరో వాహన డ్రైవర్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో అనుమానం వచ్చి వెంటనే వాహనం ఆపి తనిఖీ చేయగా బాక్సులు కనిపించాయి. అందులో పేలుడు పదార్థాలకు సంబంధించిన జిలెటిన్ స్టిక్స్, ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు లభించాయి. జగిత్యాల జిల్లా వెలగటూరు మండలం జయదేవపేట గ్రామానికి చెందిన కస్తూరి కుమార్, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం దంటకుంట తండాకు చెందిన బాదావత్ కిశోర్‌లను అదుపులోకి తీసుకున్నారు. కుమార్‌కు వెంకటరమణ ఎంటర్ ప్రైజెస్ పేరు మీద లైసెన్స్ ఉంది. ఆ లైసెన్స్ ప్రకారం నిరీత పరిధిలో మాత్రమే పేలుడు పదార్థాలను అమ్ముకోవాలి. కానీ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాల నే ఉద్దేశంతో అక్రమంగా పేలుడు పదార్థాలను అనుమతి లేని వారికి అమ్ముతూ పట్టుబడ్డారు. ఈ ఘటనలో జగిత్యాల జిల్లా వెలగటూరు మండలం జయదేవపేట కస్తూరి సారయ్య పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు.

క్లుప్తంగా...

ఏప్రిల్ 1 నుంచి ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు శిక్షణ

- శిక్షణ ఇవ్వడం లేదన్న ఆరోపణలు అవాస్తవం
- రాష్ట్ర ప్రభుత్వం స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం లేదన్న ప్రచారంలో వాస్తవం లేదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఎంపికైన 555 మంది అభ్యర్థుల్లో ఇప్పటివరకు 397 మంది జాయినింగ్ రిపోర్టు ఇచ్చారని, ఏప్రిల్ 13 వరకు గడువు ఇచ్చినట్టు వెల్లడించింది. ఇప్పటికే విధుల్లో చేరిన అభ్యర్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 1 నుంచి శిక్షణ ప్రారంభించాలని నిర్ణయించినట్టు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 614 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రకటన జారీ చేయగా, 555 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ఫిబ్రవరి 14న నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎంపికైన అభ్యర్థులకు 3 నెలల పాటు శిక్షణ, మరో 45 రోజులు క్షేత్రస్థాయి శిక్షణ ఉంటాయి. ఇప్పటికే 120 మంది అభ్యర్థులకు ఎక్సైజ్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణనిచ్చేందుకు షెడ్యూల్ ఖరారైందని, మిగతా అభ్యర్థులను జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, ఎక్సైజ్ స్టేషన్లు, చెక్ పోస్టుల్లో క్షేత్రస్థాయి శిక్షణకు పంపించనున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేసిన ఆరోపణలను పరోక్షంగా ఖండిస్తూ ప్రభుత్వం ఈ ప్రకటన విడుదల చేసింది.

బీసీ గురుకుల డిగ్రీ ప్రవేశాలకు ఏప్రిల్ 12 వరకు గడువు



సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని 29 డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కార్యదర్శి బి.సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 12వ తేదీ వరకు గడువు అని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 28న అర్హత పరీక్ష నిర్వహిస్తామని, మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని వెల్లడించారు. బీసీ గురుకుల సొసైటీ పరిధిలో 29 డిగ్రీ కాలేజీలున్నాయని, ఇందులో 15 మహిళ, 14 బాలుర కాలేజీలున్నాయని తెలిపారు. వీటి పరిధిలో వివిధ కేటగిరీల్లో 9,120 సీట్లు ఉన్నాయన్నారు. ప్రధానంగా జనరల్ కోర్సులతో పాటు మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, క్లౌడ్ టెక్నాలజీ, న్యూట్రిషన్ ఫుడ్ టెక్నాలజీ, ఫ్యాషన్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ, బీబీఏ, బీకాం కంప్యూటర్స్, ఎంపీసీఎస్, ఎమ్మెస్సీఎస్ కోర్సులున్నాయన్నారు. మరిన్ని వివరాలకు 040–23828266 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వేతన సవరణ భారం పూడ్చుకునేందుకు కసరత్తు

- ఆరు బృందాలను ఏర్పాటు చేసిన ఆర్టీసీ




సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల నుంచి అమలు చేయబోయే వేతన సవరణ(2017)తో సంస్థపై పడే ఆర్థిక భారాన్ని పూడ్చుకునేందుకు ఆర్టీసీ చర్యలు ప్రారంభించింది. సాలీనా రూ.360 కోట్ల భారం పడుతుందని ఆర్టీసీ అంచనా వేస్తోంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించే అవకాశం లేనందున, ఆ భారాన్ని పూర్తిగా సంస్థనే భరించాలి. దీంతో అంతమేర ఆదాయం పెంచుకునేదిశగా చర్యలు ప్రారంభించింది. రోజువారీగా అదనంగా రూ.కోటి మేర ఆదాయం పెరగాలంటే ఏం చేయాలనే విషయంలో మేధోమథనం ప్రారంభించింది. ఇందుకు అధికారులతో ఆరు బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ఐదుగురు సభ్యులు ఉన్నారు. ఈ బృందాలు మంగళవారం తొలి భేటీ నిర్వహించాయి. ఆయా బృందాల్లోని సభ్యులు చర్చించి ఎలాంటి చర్యలు తీసుకోవాలో జాబితా రూపొందించారు. అలా ఆరు బృందాలు కలిపి వంద వరకు అంశాలను సిద్ధం చేశాయి. వచ్చే నెల మొదటివారంలో మరో సమావేశం నిర్వహించి వాటిల్లోని ముఖ్యమైన సూచనలతో షార్ట్‌లిస్టు చేసి వాటి ప్రకారం అమలు చేస్తారు. ఆ కొత్త నిర్ణయాలతో ఆర్టీసీ ఆదాయం పెరుగుతుందని సంస్థ భావిస్తోంది.

అప్పులు తీర్చే మార్గం లేక...

- పెట్రోలు పోసుకుని దంపతుల ఆత్మహత్య

జనగామ: వ్యాపారం కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్తాపంతో దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన జనగామ జిల్లా కేంద్రం వీవర్స్ కాలనీ లో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మృతుల కుమారుడు తెలిపిన వివరాల మేర కు.. తమిళనాడుకు చెందిన రాజ్ సెల్వరాజ్ (55), భార్య భాగ్యలక్ష్మి (45)కి ఇద్దరు కుమా రులు, ఒక కూతురు ఉన్నారు. మూడు దశా బ్దాల క్రితం వ్యాపారం కోసం వచ్చి వీవర్స్ కాలనీలో స్థిరపడ్డారు. రెండేళ్ల క్రితం పెద్ద కుమారుడి వివాహం చేశారు. అనంతరం వ్యాపారంలో వరుసగా నష్టాలు వచ్చాయి. దీంతో సెల్వరాజ్ మొత్తం రూ.50 లక్షల అప్పు చేశా రు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో ఇద్దరు కుమా రులు వేరుగా ఉంటూ వ్యాపారం చేసుకుంటు న్నారు. రోజురోజుకూ సెల్వరాజ్ వ్యాపారం తగ్గిపోవడంతో అప్పులు తీర్చే మార్గాలు మూసుకుపోయాయి. దీంతో మనస్తాపానికి గురైన భార్యాభర్తలు అర్ధరాత్రి సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నారు. ఇంట్లో నుంచి వస్తున్న పొగను గమనించిన వాచ్ మన్ చిన్న కుమారుడు చిన్నస్వామికి ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకుని తలుపులు తెరిచి చూసేసరికి అప్పటికే దంపతులు పూర్తిగా కాలిపోయి మృతి చెందారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు.



"నేను ఎవరికీ ఏమీ బోధించలేను.
నేను వాళ్లను ఆలోచించేలా చేయగలనంతే.
– సోక్రటీస్

సాక్షి

గురువారం, 28 మార్చి 2024

పాలస్తీనాపై అమెరికా 'ప్రేమ'!

మన కళ్లను మనమే నమ్మలేని అరుదైన అసాధారణమైన ఉదంతాలు చరిత్రలో అప్పుడప్పుడు చోటు చేసుకుంటాయి. సోమవారం భద్రతామండలిలో జరిగిందదే. గాజాలో ఇజ్రాయెల్ దాష్టీకాన్ని నిలిపేయాలని, తక్షణం బేషరతు కాల్పుల విరమణ పాటించాలని కోరే తీర్మానంపై జరిగిన వోటింగ్‌కు అమెరికా గైర్హాజరైంది. నిరుడు అక్టోబర్‌లో హమాస్ మిలిటెంట్లు హఠాత్తుగా దాడిచేసి 1,200 మంది ఇజ్రాయెల్ పౌరులను హతమార్చి 250 మందిని బందీలుగా తీసుకుపోయారు. ఆ ఘటనలో అనేకమంది గాయాలపాలయ్యారు. ఆ సంస్థ చెరలో ఇంకా 134 మంది వరకూ వున్నారని అంచనా. ఆనాటినుంచీ ఇజ్రాయెల్ పగబట్టి గాజాలోని జనావాస ప్రాంతాలే లక్ష్యంగా క్షిపణుల వర్షం కురిపిస్తోంది. బాంబుల మోత మోగిస్తోంది. ఎడతెగని ఈ దాడుల్లో ఇంతవరకూ 32,000 మంది పాలస్తీనా పౌరులు మరణించారు. లక్షలమంది తీవ్రంగా గాయపడ్డారు. ఆకలితో అలమటిస్తున్న వారు ఆహారం తీసుకొచ్చిన వాహనాలపైకి ఎగబడినప్పుడు వారిని అదుపు చేసే పేరిట అమానుషంగా ప్రవర్తించటంతోపాటు కాల్చిచంపుతున్న ఉదంతాలకు కొదవలేదు. మంచినీరు, ఆహారం, మందుల కొరతతో పాలస్తీనా పౌరులు పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కాదు. ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేథం, విధ్వంసం ఆధునిక చరిత్రలో కనీవినీ ఎరుగనివి. ఇజ్రాయెల్‌ను సమర్థించటానికి అలవాటుపడిన అమెరికా, పాశ్చాత్య దేశాలు దీన్నంతటినీ నిర్వికారంగా చూశాయి. అదేమంత విషయం కాదన్నట్టు మొదట్లో వ్యాఖ్యానించాయి. భద్రతామండలిలో ఇజ్రాయెల్‌ను అభిశంసిస్తూ ఇంతవరకూ వచ్చిన మూడు తీర్మానాలను వీటో చేశాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ 'యుద్ధం సాగుతున్నప్పుడు పౌరుల మరణాలు సంభవించటం రివాజే' అని వ్యాఖ్యానిస్తే ప్రపంచవ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. ఒకపక్క ఇజ్రాయెల్‌కు ఆయుధాలు, ఇతర యుద్ధ సామగ్రి అందజేస్తూ, అంతర్జాతీయ వేదికలపై దాని దురాగతాలను సమర్థిస్తూ... మరోపక్క పౌర ప్రాంతాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఆ దేశానికి సుద్దులు చెబుతూ అమెరికా కాలక్షేపం చేసింది. హమాస్ అంతమొందేవరకూ ఇజ్రాయెల్ దాడులు ఆగరాదనీ, అలా ఆపితే అది ఆ మిలిటెంటు సంస్థకు బలం చేకూరుస్తుందనీ వాదించింది.

అంతర్జాతీయంగానూ, స్వదేశంలోనూ వస్తున్న ఒత్తిళ్ల కారణంగా దాదాపు ఆర్నెల్లయ్యాక ఇన్నాళ్లకు ఇజ్రాయెల్‌ను వ్యతిరేకించే తీర్మానంపై వోటింగ్‌లో గైర్హాజరైంది. నిజానికి ఇది కంటితుడుపు చర్య. ఆ తీర్మానాన్ని సమర్థించి, ప్రతీకారానికి కూడా హద్దులుంటాయని చెప్తే వేరుగా వుండేది. ఇకపై ఇజ్రాయెల్‌కు అన్ని రకాల సాయం నిలిపేస్తామని ప్రకటించివుంటే హుందాగా వుండేది. వాటన్నిటి బదులూ వోటింగ్‌కు గైర్హాజరు కావటంవల్ల పెద్దగా ఒరిగేది వుండదు. హమాస్ ఉగ్ర దాడిని ఎవరూ సమర్థించటం లేదు. దాని దుందుడుకు చేష్టలు స్వతంత్ర పాలస్తీనా లక్ష్యానికి విఘాతం కలిగిస్తాయని, రాజ్యాల అమానుష కృత్యాలకు సాధారణ పౌరులపై కక్ష తీర్చుకోవటం పరిష్కారం కాదని ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు దుయ్యబట్టాయి. అయితే గత ఏడు దశాబ్దాలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న దురాగతాలు తక్కువేమీ కాదు. నిజానికి పాలస్తీనా సమస్య సాకుగా ఇజ్రాయెల్‌లో జాతీయవాదాన్ని రెచ్చగొట్టి ఎన్నికల్లో పబ్బం గడుపుకోవాలన్న మితవాద పక్షాల వైఖరివల్లే పరిష్కారం జటిలంగా మారింది. పాలస్తీనా పౌరుల నిరాశానిస్పృహలే మిలిటెంటు సంస్థలకు ఊపిరులూదాయి. పాలస్తీనా మనోభావాలను బేఖాతరు చేసి ఇజ్రాయెల్ ఆవిర్భావానికి కారణమై, దాని దురాక్రమణలకు వంతపాడుతూ వచ్చిన అమెరికా, పాశ్చాత్య దేశాల వైఖరి సైతం మిలిటెంట్లకు బలం చేకూర్చింది.

భద్రతామండలి తీర్మానాన్ని అమెరికా వీటో చేయకుండా గైర్హాజరు కావటం సహజంగానే ఇజ్రాయెల్‌కు మింగుడుపడటం లేదు. ఆ దేశ ప్రధాని నెతన్యాహూ అలకబూనారు. జో బైడెన్‌తో చర్చల కోసం వాషింగ్టన్ వెళ్లబోతున్న ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పర్యటనను చివరి నిమిషంలో రద్దుచేశారు. చరిత్ర తిరగేస్తే ప్రతి మలుపులోనూ ఇజ్రాయెల్‌కు అమెరికా అండగా నిలబడిన సంగతి కనబడుతుంది. దాని అకృత్యాలను తక్కువచేసి చూపడం లేదా మూర్ఖంగా సమర్థించటం కళ్లకు కడుతుంది. అదే సమయంలో ప్రతి సందర్భంలోనూ అమెరికా హితవచనాలను ఇజ్రాయెల్ బేఖాతరు చేయటం కూడా తేటతెల్లమవుతుంది. ఈ యేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికలుండటం, ఇజ్రాయెల్ సేనలు నిరాటంకంగా ఊచకోతను కొనసాగించటం బైడెన్‌కు ఇబ్బందిగా మారింది. ఒకపక్క ఇజ్రాయెల్‌కు అన్నివిధాలా సాయపడుతూ కూడా దాన్ని కించిత్తు కూడా ప్రభావితం చేయలేని బైడెన్ తీరు ఆయన బలహీనతను ప్రస్ఫుటం చేసింది. ఇదంతా చివరకు తన విజయావకాశాలను దెబ్బతీసేలా వున్నదని ఆయన గ్రహించారు. పర్యవసానంగా భద్రతామండలిలో భిన్నమైన వైఖరి తీసుకున్నారు. ఇది తమ విధానానికి అనుగుణంగానే వున్నదని అమెరికా చెబుతున్నా ఇజ్రాయెల్ స్పందననుబట్టే నిజానిజాలేమిటో గ్రహించవచ్చు. ఏదేమైనా భద్రతామండలి తీర్మానం ఆశించిన విధంగా గాజాలో తక్షణం కాల్పుల విరమణ అమల్లోకి రావాలి. రంజాన్ మాసం పూర్తయ్యేవరకూ ఇది అమల్లోవుండాలని తీర్మానం కాంక్షిస్తున్నా ఈ కాలంలో ఉద్రిక్తతలు ఉపశమిస్తే... బందీల విడుదల జరిగితే అది శాంతికి దోహదపడుతుంది. ఆ పరిణామం సమస్య శాశ్వత పరిష్కారానికి దారితీస్తే అంతకన్నా కావలసిందేముంది? ఇజ్రాయెల్ మంకుపట్టు విడనాడాలి. గాజాలో హంతక దాడులకు స్వస్తి చెప్పాలి. తన సైన్యం చేసిన దురాగతాలపై విచారణకు అంగీకరించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** బ.తదియ సా.4.29 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** స్వాతి సా.4.31 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.10.28 నుండి 12.08 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.03 నుండి 10.51 వరకు తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.02 నుండి 8.43 వరకు.

సూర్యోదయం : 6.01
సూర్యాస్తమయం: 6.08
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సాటి లేని సామాజిక న్యాయం

అభిప్రాయం



ఆర్. కృష్ణయ్య

తాజాగా వైఎస్సార్‌సీపీ ప్రకటించిన లోక్‌సభ స్థానాల్లో 11 బీసీలకు కేటాయించారు; అలాగే 59 ఎమ్మెల్యే స్థానాలను కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి 100 ఎమ్మెల్యే సీట్లను ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రాలలో కూడా ఇంతటి ప్రాతినిధ్యం వారికి లభించలేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు అధికారంలో, బడ్జెటులో, సంపదలో, గౌరవంలో, విద్యా, ఉద్యోగాలలో జనాభా కంటే ఎక్కువ వాటా యిచ్చి సామాజిక న్యాయం కల్పించిన చరిత్ర పురుషుడు జగన్. అంతేగాకుండా, వివిధ విద్యా పథకాల ద్వారా ప్రజలను విద్యావంతులను చేస్తూ, వారు శాశ్వతంగా అభివృద్ధి చెందేలా చూస్తున్నారు. ఇది జగన్‌కు జనం పట్ల ఉన్న నిబద్ధత, అంకితభావాన్ని చాటుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో గత 71 సంవత్సరాల కాలంలో ఏ ముఖ్యమంత్రి కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిలాగా ఇంత పెద్ద ఎత్తున చర్యలు తీసుకోలేదు. ఆ కులాల అభివృద్ధిలో జగన్ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి, చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంటు చరిత్రను తిరగరాశారు. వైసీపీ రెండేళ్ల క్రితమే రాజ్యసభలో బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ బిల్లు పెట్టి, దీనికి 14 రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టింది. అధికార బీజేపీ వ్యతిరేకించడంతో బిల్లు పెండింగ్‌లో పడింది. విశేషం ఏమిటంటే, గత 75 సంవత్సరాల భారత దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ కూడా పార్లమెంటులో ఈ బిల్లు పెట్టలేదు. చివరకు బీసీ పార్టీలుగా చలామణి అవుతున్న డీఎంకే, అన్నా డీఎంకే, పీఎంకే, ఆర్జేడీ, సమాజ్‌వాదీ, అప్నా దళ్, జనతాదళ్ కూడా ఈ బిల్లు పెట్ట లేదు.

చారిత్రక ఘట్టం

ఇటీవల 18 ఎమ్మెల్సీ పదవులు ఇస్తే, అందులో 11 సీట్లు బీసీలకు కేటాయిస్తే దేశంలోని బీసీలందరూ ఆశ్చర్య పోయారు. గత ఏప్రిల్ 11న చేపట్టిన మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో 25 మందితో కూడిన మంత్రివర్గంలో ఏకంగా 17 పదవులను (70 శాతం)... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకే అవకాశం కల్పించడం ద్వారా సరికొత్త సామాజిక మహావిప్లవాన్ని జగన్ ఆవిష్కరించారు. అందులో బీసీ, మైనారిటీలకు 11 పదవులు ఇచ్చారు. ఐదుగురికి డిప్యుటీ సీఎం పదవులు ఇస్తే... నాలుగు (80 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే ఇచ్చారు. దేశ చరిత్రలో ఒక రాష్ట్ర హోంమంత్రిగా ఎస్సీ మహిళను నియమించడం ఇదే ప్రథమం. నామినేటెడ్ పోస్టులలో 50 శాతం స్థానాలను వెనుకబడిన వర్గాలకు కల్పిస్తూ, అలాగే కాంట్రాక్టు పనులలో 50 శాతం కోటా ఇస్తూ అసెంబ్లీలో చట్టం చేసి దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ముఖ్యమంత్రులకు సవాల్ విసిరారు.

56 బీసీ కులాల కోసం ఏర్పాటుచేసిన కార్పొరేషన్లకు 56 చైర్మన్లు, 672 డైరెక్టర్‌లలో మొత్తం 100 శాతం పోస్టులు బీసీలకు కేటాయించారు. 193 కార్పొరేషన్లలో బీసీలకు 109 కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కడం చూసి ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు దిమ్మతిరిగింది. నామినేటెడ్ పదవులలో 50 శాతానికి చట్టం చేయడమే కాదు; అమలులో 70 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇచ్చి ఈ వర్గాలలో అచంచల విశ్వాసం చూరగొన్నారు. దీని మూలంగా ఈ కులాలలో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరిగాయి. తరతరాలుగా పేరుకుపోయిన భావదాస్యం పోయి, నాయకత్వ లక్షణాలు పెరిగాయి. వేష భాషలు, నడవడి, సంస్కృతి మూలంగా సమగ్రంగా మారి ఆధునీకరణ చెందుతారు.



సామాజిక న్యాయంలో మేటి: ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

రాజ్యసభలో మొత్తం 9 మంది వైసీపీ సభ్యులుంటే... అందులో నలుగురు బీసీలు, ఒకరు ఎస్సీ. శాసనసభ స్పీకర్‌గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారాం ఎన్నికయ్యేలా చొరవ తీసుకున్నారు. మండలి చైర్మన్‌గా ఎస్సీ వర్గానికి చెందిన కొయ్యే మోషేన్ రాజుకూ, మండలి డిప్యుటీ చైర్‌పర్సన్‌గా మైనారిటీ మహిళ జకియా ఖానంకు అవకాశం కల్పించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి సుప్రీంకోర్టు తగ్గిస్తే, పార్టీ పరంగా అదనంగా 20 శాతం కలిపి, మొత్తం 44 శాతం స్థానాలకు పైగా బీసీలకు ఇచ్చి తన చిత్తశుద్ధి నిరూపించుకున్నారు జగన్. జిల్లా పరిషత్ ఎన్నికల్లో మొత్తం 13 జిల్లా పరిషత్‌లను వైసీపీ గెలవగా, అందులో తొమ్మిది పదవులను (70 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే కేటాయించారు. మండల పరిషత్ ఎన్నికల్లో, వైసీపీ 635 మండల పరిషత్ అధ్యక్ష పదవులను గెలిస్తే, అందులో ఈ వర్గాలకు 442 స్థానాలు కేటాయించారు(67 శాతం). 13 మున్సిపల్ కార్పొరేషన్లలో, 92 శాతం మేయర్ పదవులు ఈ వర్గాల వారికే ఇచ్చారు. 196 వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవుల్లో 60 శాతం వీరికే కేటాయించారు. గ్రామ – వార్డు సచివాలయాల్లో ఇచ్చిన శాశ్వత ఉద్యోగాలు దాదాపు 1.30 లక్షలు. వీటిలో 83 శాతం ఈ వర్గాలవారే. ఈ 57 నెలల్లోనే మరో 2.70 లక్షల వలంటీర్ ఉద్యోగాలు, మిగిలిన ఉద్యోగాలు కలుపుకొని 6.03 లక్షల ఉద్యోగాలు కొత్తగా వచ్చాయి. ఇందులోనూ 75 శాతం వాటా ఈ వర్గాలదే.

దీర్ఘ దృష్టి

విద్య ద్వారానే బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయనీ, వారికి గౌరవం పెరుగుతుందనీ దానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తు న్నారు జగన్. అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. అమ్మఒడి పథకం కింద ఒకటి నుంచి పదవ తరగతి వరకు 15,000 రూపాయలు ఇస్తున్నారు. దీని వలన ప్రతి ఒక్కరు చదువుకుంటు న్నారు. కాలేజీ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రతి సంవత్సరం 20 వేల రూపాయల స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ తదితర ఉన్నత చదువులు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులను ఇచ్చేటట్లు జీవోలు జారీ చేశారు.

పాలకులు ఓట్లు వస్తాయనే ఆశతో జనాకర్షక పథకాలు పెడతారు. దీర్ఘకాలంలో సమాజ శ్రేయస్సు ఎలా సాధ్యమవుతుందని ఆలోచించరు. కానీ జగన్ వివిధ విద్యా పథకాల ద్వారా ప్రజలను విద్యావంతులను చేస్తూ, వారు శాశ్వతంగా అభివృద్ధి చెందేలా చూస్తున్నారు. తమ కాళ్లపై తాము నిలబడే విధంగా ముందు చూపుతో, విజన్‌తో ఈ పథకాలను ప్రవేశపెట్టడం చారిత్రాత్మకం. ఇది జగన్‌కు ప్రజల పట్ల ఉన్న నిబద్ధత, అంకితభావాన్ని చాటుతుంది. ఉన్నత విద్య వలన జ్ఞాన సమాజం ఏర్పడుతుంది. సమాజంలో ప్రతి పౌరుడు సభ్యతతో, సంస్కారంతో, ఉన్నత జీవన ప్రమాణాలతో జీవిస్తాడు. దీని మూలంగా వైద్యం, ఆరోగ్యంపై పెట్టే బడ్జెట్ తగ్గుతుంది. శాంతిభద్రతలు కూడా చక్కగా ఉండటంతో పోలీసు శాఖపై పెట్టే ఖర్చు తగ్గుతుంది. ఇలా ఒకదానితో ఒకటి ముడిపడి, ప్రత్యక్షంగా, పరోక్షంగా సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి.

ఒక తరపు పెట్టుబడి

ఇంజినీరింగ్, ఇతర పీజీ కోర్సులు, మెడిసిన్ చదివేవారు విదేశాలకు వెళ్లి, ముఖ్యంగా అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, ఆఫ్రికా, యూరోపియన్, గల్ఫ్ దేశాల్లో ఉద్యోగం లేదా ఉపాధి పొందుతున్నారు. దీని మూలంగా దేశానికి, రాష్ట్రానికి విదేశ మారక ద్రవ్యం లభిస్తుంది. ఇది రాష్ట్ర అభివృద్ధికి చేయూతనిస్తుంది. చదువు ద్వారా పొందిన జ్ఞానంతో ఆధునిక వ్యవసాయం చేస్తే అధిక ఉత్పత్తి సాధించడానికి వీలు కలుగుతుంది. దీనిమూలంగా ఆ యా కుటుంబాలు అభివృద్ధి చెందుతాయి. సమాజ కోణంలో చూస్తే, ఒకసారి ఒక కుటుంబం ఉన్నత చదువులు చదివితే, సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగిపోతాయి. ఆ కుటుంబం ప్రభుత్వ రాయితీల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండదు. ఆదాయం పెరగడం మూలంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యంగా సబ్సిడీ బియ్యం, వృద్ధాప్య పింఛన్లు, గృహ నిర్మాణ పథకాలపై ప్రభుత్వానికి భారం తగ్గుతుంది. పదేళ్లలో 40 శాతం, మరో పదేళ్లలో మరో 50 శాతం, మొత్తంగా 20 ఏళ్లలో 90 శాతం మంది సబ్సిడీ పథకాలు వద్దనే స్థాయికి చేరిపోతారు. వీటిపై ప్రభుత్వం ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లో 90 శాతం తగ్గిపోతుంది. ఒక తరంపై ఖర్చుపెడితే రెండవ తరానికి ఈ విద్యా పథకం స్కీముల అవసరం ఉండదు. పేదరికం ఉండదు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుంది.

వ్యాసకర్త పార్లమెంటు సభ్యులు (రాజ్యసభ); జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు | 90000 09164

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎందుకీ ఆసక్తి?



అవినీతి ఆరోపణల మీద విచారణను ఎదుర్కొన్న మొదటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఏమీకారు. అలాంటప్పుడు ఈ ఒక్క కేసు విషయంలో ఉన్నట్టుండి యునైటెడ్ స్టేట్స్, జర్మనీ ఎందుకు అంత ఆసక్తి చూపుతున్నాయి?

– సునంద వశిష్ఠ్, కాలమిస్ట్

జవాబు ఉందా?



పాకిస్తాన్‌లోని నా సోర్సులు నిజమే అయితే, పాకిస్తాన్‌కు చైనా గట్టి కోటింగ్ ఇవ్వనుంది. ఐదుగురు(కొందరు 6 అంటున్నారు) చైనీస్ ఇంజినీర్లు చనిపోయారు; కానీ 'ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్మీ', 'ప్రపంచంలోనే నంబర్ వన్ గూఢచర్య సంస్థ'లకు ఇసుమంత ఆచూకీ లేదు. చైనా వాళ్లు ఆచరణాత్మక జీవులు. 'యూదులు, హిందువుల కుట్ర' అని దులిపేసుకుంటే నమ్మరు. వాళ్లకు నిజమైన జవాబులు కావాలి.

– గౌరవ్ ఆర్యా, ఆర్మీ మేజర్ (రిటైర్డ్)

అడగకూడదా?



గాజాలో జరుగుతున్నది భయానకమైనది. యుద్ధాన్ని ఆపాలని ఇజ్రాయెల్ మీద అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నది. రోజురోజుకూ అది పెరుగుతోంది కూడా. కానీ బందీలుగా పట్టుకున్నవారిని విడుదల చేయాలని హమాస్ మీద అలాంటి ఒత్తిడి ఎందుకు పెద్దగా లేదు?

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

అసలు శక్తి



నా కడుపు(గట్) బాగయ్యాక, నా ఆందోళన తగ్గింది. నా కడుపు బాగయ్యాక మంచి నిద్ర పడుతోంది. నా కడుపు బాగయ్యాక నా చర్మం మెరుగైంది. కడుపు అనేది జీవశక్తికి అతి కీలకం. ఇందులో నాకు సందేహమే లేదు.

– జాన్ కాన్‌స్టాస్, మెడికల్ యాక్టివిస్ట్

సాహస బాలుడు



మాస్కో తీవ్రవాద దాడి సమయంలో ఒక పదిహేనేళ్ల ముస్లిం బాలుడు (కిర్గిజ్‌స్తానీ అయిన ఇస్లామ్ ఖలీలోవ్) సుమారు 100 మంది ప్రాణాలు కాపాడి, రియల్ హీరో అవార్డు పొందాడు. తీవ్రవాదానికీ, హింసకూ మతంతో సంబంధం లేదని నమ్మడానికి మరో కారణం ఇది.

– అభిషేక్ గోయల్, వ్యాఖ్యాత

చక్కెర రూపాలు



బెల్లం చక్కెర. మిశ్రీ (పటిక బెల్లం) చక్కెర. తేనె చక్కెర. చక్కెర చక్కెర. తేడాలు ఏమీ లేవు. టీలో బెల్లం వేసుకున్నా, ఓట్‌మీల్‌లో తేనె కలుపుకున్నా... మీరు చక్కెరకు దూరంగా లేనట్టే. మీరు అదే స్థాయి చక్కెరను, అదేస్థాయి క్యాలరీలను తీసుకుంటున్నారు. అసలు సమస్య వీటిని తినడంలో కన్నా, వీటిని తింటూ చక్కెరకు దూరంగా ఉంటున్నామని అనుకోవడంలో ఉంది.

– చిరాగ్ బడ్‌జాత్యా, ఫిట్‌నెస్ నిపుణుడు

ఇదా ప్రజాస్వామ్యం?



నేను ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతుదారుణ్ని కాను. కానీ ఒక భారత పౌరుడిగా అడుగుతున్నా: ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా విచారణ లేకుండా, దోషిగా తేలకుండా ఏడాదిగా ఎందుకు అరెస్టయి ఉన్నారు? లోక్‌సభ ఎన్నికల ప్రకటన వెలువడ్డాక ఇప్పుడు ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టయ్యారు. ఎందుకు?

– సుధీంద్ర కులకర్ణి, పొలిటికల్ యాక్టివిస్ట్

వైజ్ఞానిక వేగుచుక్కలు

మహిళారోగ్యానికి ఆధునిక వైద్య పునాది

ఆధునిక భారతదేశ వైద్య విజ్ఞాన ప్రస్థానంలో ఒక కీలకమైన మలుపు వంటి సంఘటన 1885 ఆగస్టులో సంభవించింది. అదేమిటంటే 'డఫ్రిన్ ఫండ్' ఏర్పాటు. దీని పూర్తి పేరు 'నేషనల్ అసోసియేషన్ ఫర్ సప్లైఆఫ ఫిమేల్ మెడికల్ ఎయిడ్స్ టు ఉమెన్ ఆఫ్ ఇండియా'. ఇది ఏర్పడటంతో భారతీయ మహిళలు కూడా డాక్టర్స్, హాస్పిటల్ అసిస్టెంట్స్, నర్సులు, మిడ్‌వైఫ్స్‌గా విద్య పొంది, శిక్షణ గణించడానికి ఉపకార వేతనాలు లభించాయి. అంతేకాకుండా ఈ సేవలను మరింత విస్తృత పరుస్తూ హాస్పిటల్స్‌లో స్త్రీలకు సంబంధించిన విభాగాలను అదనంగా నిర్మించడం కూడా మొదలైంది. అయితే ఇది సాకారం కావడానికి పన్నా సంస్థానపు రాజ దంపతులు, క్రైస్తవ మిషనరీ ఎలిజిబెత్ బెయిల్బే, ఇంగ్లాండు విక్టోరియా రాణి కారకులుగా చెప్పుకోవాలి.

ఇప్పటి మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లాయే 'పన్నా సంస్థానం'గా ఉండేది. 1870లో మహారాజా రుద్ర ప్రతాప్ సింగ్ పన్నా సంస్థానపు అధినాయకుడయ్యారు. తన మహారాణికి అనారోగ్యం కలగడంతో లాహోర్‌లో ఉన్న ఎలిజిబెత్ బెయిల్బేకు చికిత్స చేయాలని కబురు పంపారు. ఆమె పన్నా వచ్చి మహారాణి ఆరోగ్యాన్ని బాగుచేసింది. రాజ దంపతులు సంతసించి శిక్షణ కోసం లండన్ వెళుతున్న ఎలిజిబెత్‌కు విక్టోరియా మహారాణికి స్వయంగా అందజేయమని లాకెట్‌లో పెట్టిన ఓ వినతి పత్రాన్ని ఇచ్చారు. లండన్‌లో మేరీ స్కార్లిబ్‌తో సహా శిక్షణ పూర్తి అయ్యాక, మళ్లీ ఇండియా రాబోయే ముందు క్వీన్ విక్టోరియాను కలిసి పన్నా రాజదంపతుల వినతిపత్రాన్ని అందించింది ఆమె.

భారతదేశంలో స్త్రీలు అనారోగ్యం కలిగినప్పుడు ఎటువంటి స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారో చెబుతూ దానికి తరుణోపాయం గురించి ఆలోచించవలసిందిగా విక్టోరియా రాణిని ఆ వినతిపత్రంలో రాజదంపతులు కోరారు. దాంతో విక్టోరియా రాణి, భారత మహిళల పట్ల తనకు ఎంతో సానుభూతి ఉందనీ, వారి అనారోగ్యానికి వీలైనంత త్వరగా పరిష్కారం చూడాలని అప్పటి వైస్రాయ్ లార్డ్ డఫ్రిన్ భార్య లేడీ హేరియట్ డఫ్రిన్‌కు సూచన చేశారు. ఆ సూచన ఫలితమే 1885 ఆగస్టులో 'డఫ్రిన్ ఫండ్' ఏర్పాటు. దీంతో బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, అమెరికా దేశాల నుంచి బాగా విద్యావంతులైన మిషనరీ డాక్టర్లు భారతదేశానికి వైద్యం చేయడానికి రావడం మొదలైంది. ఇక్కడ ఉండే ఆసుపత్రుల్లో ఉన్నత స్థానాలతో పాటు సమాజంలో విశేష గౌరవాన్ని కూడా పొందారు వారు. అంతేకాకుండా వైద్య వృత్తిలో స్థానిక మహిళలను తీర్చిదిద్దే అవకాశం కూడా భారత్‌లో ఈ మహిళా మణులకు దొరికింది.

– డా|| నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి | 94407 32392

ఎప్పుడో తేవాల్సిన చట్టం

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

భారతీయ జనతా పార్టీ దేశ భద్రతను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి చట్టం చేసినా, మోదీ వ్యతిరేకులూ, ప్రతిపక్షాల వాళ్లు నానా యాగీ చేయడం పరిపాటి అయింది. భారత ఉపఖండంలో భాగాలుగా ఉండి, భారతీయ సంస్కృతి గొడుగు కింద వందల సంవత్సరాలు కొన సాగిన అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు స్వతంత్ర ఇస్లామిక్ దేశాలుగా రూపాంతరం చెందడంతో ఆ ప్రాంతాలలో మైనారిటీలైన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారసీకులు అనేక అఘాయిత్యాలకు గురికావడం అనేది చరిత్ర చెబుతున్న సాక్ష్యం. ఆ యా దేశాలలో బాధలు భరించలేక శరణార్థులుగా పారిపోయి వచ్చిన వారికి పౌరసత్వం ఇవ్వడానికి మోదీ ప్రభుత్వం ఉదాత్తమైన ఆలోచనతో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) రూపొందించిందని ఈ దేశంలోని విజ్ఞులందరి అభిప్రాయం.

అయితే ఈ చట్టం ముస్లింల విషయంలో మత వివక్ష చూపుతోందనీ, రాజ్యాంగంలోని 14వ నిబంధనకు ఇది వ్యతిరేకమనీ ప్రతిపక్షాల వారి ఆరోపణ. వాస్తవంగా భారత రాజ్యాంగం ఈ దేశ పౌరుల పట్ల ఎటువంటి వివక్ష చూపలేదు. పర్షియా(నేడు అది ఇరాన్) నుండి పారిపోయి వచ్చిన పారసీకులను, ఇజ్రాయిల్ నుండి పారిపోయి వచ్చిన యూదులను ఈ సమాజం ఆదరించింది. అక్రమంగా చొరబడిన వారికి రాజ్యాంగంలోని 14వ నిబంధన వర్తిస్తుందా? మయన్మార్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల నుండి అక్రమంగా చొరబడిన ముస్లింలకు సైతం ఈ దేశ పౌరసత్వం ఇవ్వాలని ప్రతిపక్షాల వారి ఆకాంక్ష.

ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయాలు నడిపే కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వాళ్లు అక్రమ చొరబాటుదారులకు చాలా చోట్ల రేషన్ కార్డులు, ఆధార కార్డులు, ఓటర్ కార్డులు ఇప్పించి ఘనకార్యాన్ని సాధించి పెట్టారు. 32 సంవత్సరాలు పశ్చిమ బెంగాల్లో కమ్యూనిస్టులు అధికారం వెలగ పెట్టడం వెనుక దాగి ఉన్న రహస్యం ఇదే! కాంగ్రెస్ పార్టీలో పుట్టి పెరిగి, ప్రత్యేక పార్టీని పెట్టి కమ్యూనిస్టులను మట్టి కరిపించి, అధికారం చేపట్టిన మమతా బెనర్జీకి అక్రమ చొరబాటుదారుల ఓట్లే గెలుపుకు ప్రధాన సాధనంగా మారినాయి. పౌరసత్వ సవరణ చట్టం అంటేనే చిర్రెత్తిపోయేది అందుకే మరి!

అక్రమ చొరబాటుదారులకు ప్రపంచంలో ఏ దేశం కూడా పౌరసత్వం ఇవ్వదు. ఇక శరణార్థుల విషయంలో ఐక్యరాజ్యసమితి ఏర్పాటుచేసిన ఒప్పందంపై సంతకం చేసిన విషయంలో మాత్రమే ఆ యా దేశాలు కొంత సానుకూలతతో ఉంటాయి. మన దేశం ఆ ఒప్పందం పరిధిలోకి రాదు. దేశభద్రత, సమగ్రత, సమైక్యతల విషయంలో తేడాలు వస్తే – శరణార్థులకు పౌరసత్వం ఇవ్వడం కాదు నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టేందుకు కూడా ఆ యా దేశాల ప్రభుత్వాలకు హక్కు ఉంటుంది. అఫ్గాన్ శరణార్థుల పట్ల పాక్, పాలస్తీనా శరణార్థుల పట్ల ఈజిప్టు ఎలా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాయో ఇటీవలి ఉదాహరణలే.

భారత ఉపఖండం నుంచి విడిపోయి, ఇస్లామిక్ మత రాజ్యాలుగా మారిన దేశాల్లోని ముస్లిమేతరులకు భారతదేశం ఎప్పుడో ఆశ్రయం కల్పించి ఉండవలసింది. ఈ మహత్కార్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి ఉండవలసింది. కానీ ఆ ప్రభుత్వం ఆ పని చేయలేదు. కారణం ఈ దేశ ముస్లింల గంప గుత్త ఓట్లు. మోదీ ప్రభుత్వం ఈ పనిని చేసి, హిందువుల మనసుల్లో శాశ్వతమైన ముద్రను సంపాదించుకుంది. ఈ చట్టాన్ని ఎవరు అడ్డుకోవాలని ప్రయత్నించినా – వారి ఉనికి భవిష్యత్తులో ప్రశ్నార్థకమే అవుతుంది.


వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు

ఆత్మజ్ఞానాన్ని బోధించువాడే గురువు

ఆత్మజ్ఞానమును బోధించునట్టి సద్గురువు కృపవలననే భక్తుడు ఆత్మానుభవమును పొందగలడు. అజ్ఞానమును తొలగించి ఆత్మజ్ఞానాన్ని బోధించువాడే గురువు. మనకు ఆత్మ జ్ఞానం లేకపోవుట వలనే బాధలు, అవస్థలు, కష్టాలు కలుగుచున్నవి. ఎవరైతే తన గురించి తాను తెలుసుకుంటారో అట్టి వారికి గురువు అజ్ఞానాన్ని దూరం చేయగలరు.

ఆధ్యాత్మిక మార్గమునందు ప్రగతిని సాధించుటకు సద్గురు సాంగత్యం చాలా ముఖ్యమైనది. ఇట్టి సాంగత్యమునే 'సత్సంగము' అని అంటారు. సద్గురువు అనగా కేవలము భౌతిక శరీరము కాదు, కాని ఆయన సమస్త జీవమునకు మూలాధారమైన నిరాకార తత్త్వం.

దత్తబోధ



గణపతి సచ్చిదానందస్వామి

దేశ, కాలాల బంధములు సద్గురువుకు ఉండవు. సద్గురువు వీటన్నిటికీ అతీతుడు. సద్గురువుతో సాంగత్యము అనగా ఎల్లప్పుడు ఆయనను అంటిపెట్టుకొని ఉండుటని అర్థము కాదు. ప్రతి భక్తుడు తన స్వభావమునకు సరిపోవు మార్గాన్ని అనుసరించ వలయును.

ఉదాహరణకు ఒక ప్రత్యేకమైన చిత్రపటమును దగ్గరలో ఉంచుకొనుటవలన కానీ, ఆయన (గురువు) రచనలు కానీ, లేక జీవిత చరిత్ర, బోధనల గ్రంథములను చదువుటవలన కానీ, లేక ఆయనతోగల గత అనుభవమును జ్ఞప్తికి తెచ్చుకొనుట వలన కానీ సద్గురువుతో సంబంధమును స్థిరపరచుకొనవచ్చు. ఇవి కొన్ని ఉపయోగకరమైన పద్ధతులు. ఎల్లప్పుడూ సద్గురువు సాంగత్యముతోనే మనలోని 'అహం' సులభంగా తొలగుతుంది. చివరిగా ఆత్మానందమును కూడా అనుభవించగలం.

సద్గురువు ఒక అద్దము లాంటివాడు. సామాన్యముగా మామూలు అద్దమునందు నీవు నీ ముఖమును చూచుకొనవచ్చును. అలాగే నీ ఇష్టము వచ్చినట్లు అలంకరించుకొనవచ్చును. ఇట్టి అద్దము నీ శారీరక అవసరములను తీర్చుకొనుటకు ఉపయోగపడును. సద్గురువనే అద్దము నీ యొక్క ఆంతరంగిక వ్యక్తిత్వమును ప్రతిబింబింపజేయును. అందువలన నీలో దాగియున్న ప్రకృతి బహిర్గతం చేయబడును. దాని ఫలితముగా నిన్ను నీవు తెలిసుకొనగలవు. నిత్య జీవితమునందు నీ వేషం, అలంకరణను చూచుకొనుటకు మామూలు అద్దమును ఉపయోగించినట్లు, సద్గురువు అనెడి అద్దమును ఉపయోగించి మనం మనలో దాగియున్న ఆంతరంగిక ప్రకృతిని కనుగొనవలెను. ఆత్మ సంబంధమైన విషయమందు ఈ పద్ధతి మనకు సద్గురువుతో ఆధ్యాత్మిక సంబంధము ఏర్పరచుకొనుటకు చక్కగా తోడ్పడుతుంది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల గోల్‌మాల్..

లబ్ధిదారులకు ఇవ్వకుండా కొల్లగొట్టిన ముఠా అరెస్ట్

- మాజీ మంత్రి హరీశ్‌రావు కార్యాలయంలో పనిచేసిన నరేశ్‌కుమార్
- సచివాలయంలో అప్పగించాల్సిన చెక్కులు పక్కదారి..
- మరో ముగ్గురితో కలసి అక్రమంగా నగదు డ్రా
- పలువురు లబ్ధిదారుల ఫిర్యాదుతో వెలుగులోకి..
- చెక్కుల మాయంపై డిసెంబర్‌లోనే పోలీసులకు ఫిర్యాదు చేశామని హరీశ్‌రావు కార్యాలయం వెల్లడి
- మాజీ మంత్రి పీఏ కాజేశాడంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు



బంజారాహిల్స్ (హైదరాబాద్): పేదల వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద మంజూరైన చెక్కుల గోల్‌మాల్ అంశం వెలుగులోకి వచ్చింది. లబ్ధిదారులకు అందాల్సిన చెక్కులను కొల్లగొట్టి సొమ్ము చేసుకున్న ముఠాను హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం వారిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ వ్యవహారంలో సూత్రధారిగా వ్యవహరించిన నరేశ్‌కుమార్ అనే వ్యక్తి గతంలో మాజీ మంత్రి హరీశ్‌రావు కార్యాలయంలో పనిచేయడంతో.. హరీశ్‌రావు పీఏ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అక్రమాలకు పాల్పడ్డాడంటూ ప్రచారం జరిగింది. హరీశ్‌రావు కార్యాలయం దీనిని ఖండిస్తూ ప్రకటన చేసింది.

ఆఫీసు మూసివేశాక అక్రమానికి తెగబడి..

గత ప్రభుత్వంలో హరీశ్‌రావు మంత్రి కావడంతో ఆయన నియోజకవర్గంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల వారు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఆయన ద్వారా దరఖాస్తు చేసుకునేవారు. వారికి మంజూరైన చెక్కులు హరీశ్‌రావు క్యాంపు ఆఫీసు ద్వారా పంపిణీ చేసేవారు. హైదరాబాద్‌లోని కోకాపేటలో ఉన్న ఈ క్యాంప్ ఆఫీస్‌లో మెట్టుగూడకు చెందిన జోగుల నరేశ్‌కుమార్ (40) కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేశాడు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో.. డిసెంబర్ 6వ తేదీన హరీశ్‌రావు తన క్యాంపు కార్యాలయాన్ని మూసేశారు. వివిధ ప్రాంతాల లబ్ధిదారులకు చెందిన 240 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఆఫీసులో మిగిలిపోవడంతో.. వాటిని తిరిగి సచివాలయంలోని సీఎంఆర్‌ఎఫ్ కార్యాలయంలో అప్పగించాల్సిందిగా నరేశ్‌కుమార్‌కు సూచించారు. ఇక్కడే నరేశ్ తన తెలివితేటలు ప్రదర్శించాడు.

మరో ముగ్గురిని కలుపుకొని..

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల సొమ్మును కొల్లగొట్టాలని భావించిన నరేశ్‌కుమార్.. అసెంబ్లీలో అటెండర్‌గా పనిచేస్తున్న బాలగోని వెంకటేశ్ (35), ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బీఆర్‌ఎస్ నేత కొర్లపాటి వంశీ (24), గోదావరిఖనికి చెందిన పులిపాక ఓంకార్(34)తో కలసి పథకం వేశాడు. ఓంకార్ ఈ చెక్కులపై ఉన్న పేర్లను పోలిన పేర్లున్న ఇతర వ్యక్తులను గుర్తించి.. వారి ఖాతాల్లో చెక్కులను డిపాజిట్ చేయించాడు. వారి నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని.. నలుగురూ పంచుకుంటూ వచ్చారు. చెక్కులు మాయమైన విషయం తెలుసుకున్న హరీశ్‌రావు.. గత ఏడాది డిసెంబర్ 17వ తేదీనే నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు కూడా.

ఓ లబ్ధిదారు ఫిర్యాదుతో వెలుగులోకి..

తనకు సీఎంఆర్‌ఎఫ్ సాయం మంజూరైనా, చెక్కు రాకపోవడంతో మెదక్ జిల్లా పీర్ల తండాకు చెందిన రైతు రవినాయక్ ఆరా తీశారు. అయితే ఆయన పేరుపై సీఎంఆర్‌ఎఫ్ చెక్కు వచ్చిందని, సొమ్ము కూడా డ్రా అయిందని తేలింది. దీనిపై ఆయన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా.. నరేశ్, వంశీ, వెంకటేశ్, ఓంకార్‌ల నిర్వాకం వెలుగులోకి వచ్చింది. వారు కోట్ల రూపాయలు కొల్లగొట్టినట్టు తేలింది. గడువు తీరడంతో కొన్ని చెక్కులను దహనం చేశామని వంశీ పోలీసులకు చెప్పినట్టు తెలిసింది. చెక్కుల గోల్‌మాల్ విషయం తెలిసిన లబ్ధిదారులు ఠాణాకు క్యూకట్టారు. ఇప్పటికే 24 మంది ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పోలీసులు నిందితులపై ఐపీసీ సెక్షన్లు 417, 419, 420, 120 (బి), 66 (సి) ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు

నరేశ్‌తో సంబంధం లేదు..
చెక్కులపై గతంలోనే ఫిర్యాదు..
హరీశ్‌రావు కార్యాలయం ప్రకటన

సాక్షి, హైదరాబాద్: సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల వ్యవహారం బయటపడటంతో.. వాటిని మాజీ మంత్రి హరీశ్‌రావు పీఏ కాజేశాడంటూ బుధవారం సోషల్ మీడి యాలో, బయటా ప్రచారం జరిగింది. దానిని ఖండిస్తూ హరీశ్‌రావు కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. "నరేశ్ అనే వ్యక్తి మాజీ మంత్రి హరీశ్‌రావు పీఏ కాదు. అతను కంప్యూటర్ ఆపరేటర్, తాత్కాలిక ఉద్యోగి. మంత్రిగా హరీశ్‌రావు పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో.. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2023 డిసెంబర్ 6న క్యాంపు కార్యాలయాన్ని మూసివేసి, సిబ్బందిని పంపించి వేశాం. ఆ రోజు నుంచి నరేశ్ అనే వ్యక్తితో హరీశ్‌రావు కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదు. అయితే ఆఫీసు మూసివేసే క్రమంలో ఎలాంటి సమాచారం లేకుండా నరేశ్ కొన్ని సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను తన వెంట తీసుకువెళ్లినట్టు మా దృష్టికి వచ్చింది. దీనిపై డిసెంబర్ 17వ తేదీనే నార్సింగి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ఈ వాస్తవాలను గుర్తించకుండా మాజీ మంత్రి పీఏ చెక్కులు కాజేశాడంటూ తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఒక వ్యక్తి చేసిన తప్పును మొత్తం కార్యాలయానికి వర్తింపచేయడం బాధాకరం. వాస్తవాలను గుర్తించాలి" అని ప్రకటనలో పేర్కొంది.

'సాక్షి' ఆధ్వర్యంలో

ఈఏపీసెట్, నీట్ మాక్‌టెస్టులు

- ఏప్రిల్ 27న నీట్.. 28న ఈఏపీసెట్

సాక్షి, ఎడ్యుకేషన్: ఎక్కువ మంది విద్యార్థుల లక్ష్యం ఇంజనీరింగ్, లేదా మెడిసిన్. అధికశాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్‌ను అందించే ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో చేర్పించాలని కోరుకుంటున్నారు. అందుకు ఖర్చులకు వెనుకాడకుండా పిల్లలను కోచింగ్‌లో చేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్.. అలాగే తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్ తదితర కోర్సుల్లో అడ్మిషన్ కల్పించే ఈఏపీసెట్‌కు లక్షల మంది విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు చేయూతనిచ్చేలా నిపుణుల ఆధ్వర్యంలో ఈఏపీసెట్, నీట్ పరీక్షలకు సాక్షి మీడియా మాక్‌టెస్టులు నిర్వహించనుంది. టెక్నాలజీ పార్ట్‌నర్ మై ర్యాంక్ వ్యవహరించనుంది. పరీక్షకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకుని, మరింత మెరుగుపరచుకోవచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు https:// www.areanaone.in/mock ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.250. రిజిస్ట్రేషన్‌కు ఏప్రిల్ 22 చివరి తేదీ. రిజిస్టర్ చేసుకున్న ఈమెయిల్‌కు పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్ నెంబర్ వస్తుంది. ఏప్రిల్ 27న నీట్, ఏప్రిల్ 28న ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఇంజనీరింగ్ పరీక్షలుంటాయి. ఈ ఆన్‌లైన్ టెస్ట్ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో ఎప్పుడైనా రాసుకోవచ్చు. పరీక్షా సమయం 3 గంటలు. ఈ పరీక్షలను మీ హాల్ టికెట్ నెంబర్ (యూజర్ నేమ్), ఫోన్ నెంబర్ (పాస్‌వర్డ్)తో ఆ సమయంలో ఎప్పుడైనా లాగిన్ అయి రాసుకోవచ్చు. అలాగే పరీక్ష ముగిసిన వెంటనే మీ స్కోర్‌ను కూడా మీరు చూసుకోవచ్చు. మాక్ పరీక్షలను https://sakshimocktest.myrank.co.in వెబ్‌సైట్‌లో నిర్వహిస్తారు. టెస్ట్‌కి సంబంధించిన 'కీ'ని ఏప్రిల్ 30న ఇదే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన నెంబర్లు: 95055 14424, 96660 13544, 96665 72244.

వసతుల కల్పనతో సత్వర న్యాయం

▶ మొదటి పేజీ తరువాయి

వినియోగించుకోవాలి. ఈ–కోర్టుల్లో భాగంగా ఈ–సేవా కేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం. న్యాయవాదులైనా, న్యాయమూర్తులైనా.. జూనియర్లకు సీనియర్లు సలహాలు, సూచనలు ఇస్తుండాలి. ఇది న్యాయ విలువలను పెంపొందిస్తుంది. జస్టిస్ చిన్నపరెడ్డి, జస్టిస్ సుబ్బారావు, జస్టిస్ జీవన్‌రెడ్డి లాంటి వారు ఇక్కడినుంచి సుప్రీంకోర్టు వరకు ఎదిగి న్యాయ వ్యవస్థ విలువలు పెంపొందించారు..' అని జస్టిస్ చంద్రచూడ్ గుర్తు చేశారు.

నా కల నెరవేరుతోంది: జస్టిస్ పీఎస్ నరసింహ

'నేను తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశా. న్యాయవాదిగా నమోదు చేసుకున్న కొత్తలో ఎప్పుడూ వసతుల లేమిపై ఆలోచిస్తుండేవాడిని. న్యాయమూర్తులతోపాటు న్యాయవాదులకు మౌలిక సదుపాయాలు ఉంటే వారు మరింత ఉత్సాహంగా పనిచేస్తారని అనిపించేది. నాటి కల ఇప్పుడు కొత్త భవన నిర్మాణంతో నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉంది. హైకోర్టు భవన నిర్మాణం వెనుక సీజే జస్టిస్ అలోక్ అరాధే కృషి అభినందనీయం. ప్రభుత్వాన్ని కూడా ప్రశంసించాల్సిందే. నిజాం కాలం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. ఇలా మూడు దశల్లోనూ వందేళ్లకు పైగా ప్రస్తుత భవనం సేవలందించింది. ప్రస్తుతం జడ్జిల చాంబర్లు కూడా బాగాలేవు. లాన్‌లో సమావేశాలు నిర్వహించుకోవాల్సి వస్తోంది. జడ్జిలకే కాదు.. న్యాయవాదులకు కూడా కన్సల్టేషన్ రూంలు అవసరం. మీటింగ్ చాంబర్, క్లినిక్‌లాంటివి లగ్జరీ వసతులేం కావు. కనీస వసతులే. పూర్తి పర్యావరణ హితంగా హైకోర్టు నిర్మాణం జరగాలి..' అని జస్టిస్ పీఎస్ నరసింహ సూచించారు.



హైకోర్టు నూతన భవన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్. చిత్రంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ ఎస్వీ భట్టి, హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే

విద్యార్థి సంఘాల నేతల అరెస్టు

ఏజీ వర్సిటీ: నూతన హైకోర్టు భవనానికి శంకుస్థాపన పురస్కరించుకుని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు వర్సిటీలకు చెందిన 100 ఎకరాల్లో హైకోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా పలు విద్యార్థి సంఘాల నాయకులు, వ్యవసాయ, ఉద్యాన వర్సిటీల విద్యార్థులు గత 60 రోజులుగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించారు.

అందరికీ ఉపయుక్తంగా
కొత్త కోర్టు: సీజే అలోక్ అరాధే

'కోర్టులు అన్ని వసతులతో సిద్ధంగా ఉంటే వేగవంతంగా, పారదర్శకంగా కేసులు పూర్తి చేయవచ్చు. కొత్తగా నిర్మిస్తున్న హైకోర్టు న్యాయ వర్గాలకే కాదు.. ప్రజలకు కూడా ఉపయుక్తంగా ఉంటుంది. పర్యావరణ హితంగా నిర్మాణం సాగుతుంది..' అని హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే చెప్పారు. హైకోర్టు నిర్మాణానికి వేగంగా చర్యలు చేపట్టిన ప్రభుత్వానికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నరసింహ శర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) గాడి ప్రవీణ్‌కుమార్, అడ్వొకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్‌రెడ్డి, ఏఏజీ లు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు, హైకోర్టు పీపీ పల్లె నాగేశ్వర్‌రావు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 32 జిల్లా కోర్టుల్లో ఈ–సేవా కేంద్రాలను జస్టిస్ చంద్రచూడ్ ప్రారంభించారు.

శ్రీలక్ష్మీ నారసింహుడి ఉత్తర దిగ్యాత్ర



ధర్మపురిలోని ఉసిరిక వాగు వద్ద శ్రీలక్ష్మీనృసింహుడికి ప్రత్యేక పూజలు

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన ఉత్తర దిగ్యాత్రను బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిపారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు చేశారు. దిగ్యాత్ర సందర్భంగా ఆలయం నుంచి ఉసిరిక వాగు వద్దకు స్వామివార్లను అశ్వవాహనంపై శోభాయాత్రగా తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యాదాద్రి ఆలయం అద్భుతం

- భారత నావికాదళాధిపతి హరికుమార్ కితాబు



భారత నావికా దళాధిపతి ఆర్.హరికుమార్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం అద్భుతంగా ఉందని భారత నావికా దళాధిపతి ఆర్.హరికుమార్ కితాబిచ్చారు. యాదాద్రీశుడిని బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకుని, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. అనంతరం హరికుమార్‌కు ఆలయ ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేయగా, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి.. శ్రీస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఆచార్యులు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం హరికుమార్ మాట్లాడుతూ శ్రీస్వామి వారి దర్శనంతో ఎంతో ఆధ్యాత్మికతను, పవిత్ర అనుభూతిని పొందానని పేర్కొన్నారు. ఆలయ నిర్వహణ తీరును కొనియాడారు.

వివాహ వేడుకలో మృత్యుఘంటికలు

ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు మృతి..



బోల్తాపడిన ట్రాక్టర్ వద్ద క్షతగాత్రులు



రావుగారి భూదమ్మ



జెట్టిగారి సంగమ్మ

పాపన్నపేట (మెదక్)/ వట్‌పల్లి (అందోల్): సంతోషంగా జరుగుతున్న పెళ్లి వేడుకలో విషాదం చోటుచేసుకుంది. పెళ్లి కూతురును తీసుకొచ్చేందుకు వెళ్తున్న ట్రాక్టర్ సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం మన్సాన్‌పల్లి వద్ద బుధవారం సాయంత్రం బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మృత్యువాతపడగా, మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం బాచారం గ్రామానికి చెందిన సొంగ రాముకు అందోల్ గ్రామానికి చెందిన మమతతో గురువారం నార్సింగిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వివాహం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పెళ్లి కూతురుని తీసుకొచ్చేందుకు గ్రామానికి చెందిన 29 మంది మహిళలు ట్రాక్టర్‌పై బయలుదేరారు. గమ్యం చేరకముందే మన్సాన్‌పల్లి వద్ద ట్రాక్టర్ బోల్తాపడటంతో పారిగింటి వారైన రావుగారి బూదమ్మ (52), జెట్టిగారి సంగమ్మ (45), రావుగారి ఆగమ్మ (45) మృత్యువాత పడ్డారు. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. దీంతో పెళ్లింట్లో విషాదం చోటుచేసుకుంది.

బాచారంను వెంటాడుతున్న మృత్యు ఘంటికలు

ఫిబ్రవరి 16వ తేదీన బాచారం గ్రామానికి చెందిన చిలుముగారి సుభాష్ నిశ్చితార్థం కోసం అందోల్ మండలం నాదుల్లపూర్ గ్రామానికి వెళ్లిన అతడి మిత్రులు అల్లాదుర్గం శ్రీకాంత్, గడ్డం ప్రభాకర్, గడ్డం భీమయ్యలు బైక్‌పై వస్తూ గడిపెద్దాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆ సంఘటన మరవకముందే మరో విషాదం చోటుచేసుకోవడంతో గ్రామస్తులు భయబ్రాంతులకు గురవుతున్నారు.

తాళపత్రాల్లోని విజ్ఞానం భావితరాలకు అందాలి

- పురాతన న్యాయశాస్త్ర గ్రంథాల్లో విలువైన సమాచారం
- తాళపత్రాల డిజిటలైజేషన్, పరిశోధనలు అభినందనీయం
- వేదిక్ వర్సిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

తిరుపతి సిటీ/తిరుమల: తాళపత్ర గ్రంథాల్లోని విజ్ఞానాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేదిక్ యూనివర్సిటీని బుధవారం ఆయన సందర్శించి తాళపత్ర గ్రంథాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేల సంవత్సరాల పూర్వం మహర్షులు, రుషులు, మేధావులు అపారమైన విజ్ఞానాన్ని, శాస్త్ర సాంకేతిక అంశాలను తాళపత్రాల్లో లిఖించారన్నారు. అటువంటి విజ్ఞానాన్ని సంరక్షించి, పరిశోధనలు చేసి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వేదిక్ వర్సిటీలో తాళపత్ర గ్రంథాల సంరక్షణ, డిజిటలైజేషన్ చేయడం ప్రశంసనీయమన్నారు. పురాతన న్యాయ శాస్త్ర గ్రంథాల్లో చాలా విలువైన సమాచారం ఉందని జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. పురాతన నాగరికతలో న్యాయశాస్త్ర విద్యాభ్యాసం, న్యాయవ్యవస్థల సమాచారం తాళపత్రాల్లో ఉండటం విశేషమన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న తాళపత్ర గ్రంథాలను సంరక్షించి, పరిశోధనలు, ప్రచురణలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో వేదిక్ వర్సిటీ నడవడం, తాళపత్ర గ్రంథాల పరిరక్షణకు పెద్దపీట వేయడం శుభపరిణామమన్నారు. అనంతరం ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో కలసి ఆయన వర్సిటీలోని వేద, వేదాంగ, ఆగమ, పురాణ, ఇతిహాస, న్యాయ శాస్త్ర తాళపత్రగంథాల సంరక్షణ, డిజిటలైజేషన్ ప్రక్రియను, ప్రచురణను పరిశీలించారు. అనంతరం వర్సిటీ, టీటీడీ అధికారులు సీజే దంపతులను, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దంపతులను ఘనంగా సన్మానించారు.



పెద్ద శేష వాహనం వద్ద సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులతో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ దంపతులు

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న సుప్రీం కోర్ట్, హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తులకు టీటీడీ ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అధికారులు శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, డైరీ, క్యాలెండర్ అందజేశారు.

నేతకార్మికులకు పని కల్పించాలి

సిరిసిల్లలో నేతన్నల భిక్షాటన • నేతన్నచౌక్‌లో ఆందోళన



సిరిసిల్ల షాపుల్లో నేత కార్మికుల భిక్షాటన

సిరిసిల్ల (రాజన్న సిరిసిల్ల): సిరిసిల్ల వస్త్రపరిశ్రమలోని పవర్‌లూమ్ కార్మికులకు పనికల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నేతకార్మికులు జిల్లా కేంద్రంలో బుధవారం భిక్షాటన చేశారు. అనంతరం పాతబస్టాండు వద్ద ఉన్న నేతన్న చౌక్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నేతకార్మిక నాయకులు మాట్లాడుతూ...మూడు నెలలుగా సిరిసిల్లలో సాంచాలు బంద్ ఉన్నాయని, నేత కార్మికులకు పని లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేతకార్మికులు పలు రూపాల్లో నిరసన తెలుపుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించడం లేదన్నారు. సిరిసిల్లకు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడం లేదని చెప్పారు. కార్మికు లకు రావాల్సిన 10 శాతం యార్న్ సబ్సిడీ అందించాలని, సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు రావాల్సిన రూ.275 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పవర్‌లూమ్ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, కార్మిక నాయకులు సిరిమల్లె సత్యం, కుమ్మరికుంట కిషన్, ఉడుత రవి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం..దళారుల దోపిడీ

- ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో పది రోజుల క్రితం నుంచే ప్రైవేట్‌లో ధాన్యం అమ్మకాలు

సాక్షి, హైదరాబాద్: వరికోతలు మొదలైనా, ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాలేదు. దీంతో రైతులు దళారులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో వరికోతలు పదిహేను రోజుల క్రితమే మొదలు కాగా, ఉమ్మడి కరీంనగర్, మెదక్ జిల్లాల్లో కూడా కోతలు మొదలయ్యాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలోని గ్రామాల రైతులు కోసిన పచ్చి ధాన్యాన్నే నేరుగా మిల్లులకు తీసుకొని వెళ్లి, వారిచ్చిన ధరకు అమ్ముకుంటున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని మండలాల్లో రైతుల వద్దకే వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో మాత్రం రైతులు దళారులనే నమ్ముకుంటున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిద్ధిపేట జిల్లాల్లో కూడా కోతలు షురూ అయ్యాయి.

ఉమ్మడి నిజామాబాద్‌లో
4.16 లక్షల ఎకరాల్లో వరిసాగు

ఉమ్మడినిజామాబాద్ జిల్లాలో యాసంగి సీజన్‌లో 4.16లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. 11.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానిక అవసరాలకు నాణ్యమైన ధాన్యం రైస్‌మిల్లర్లు కొనుగోలు చేయగా, మిగతా 6 లక్షల మెట్రిక్ టన్నులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే వర్ని, రుద్రూర్, మోస్రా, చందూర్, సిరికొండ, మోపాల్, ధర్పల్లి, డిచ్‌పల్లి, చాలా మండలాల్లో కోతలు ముమ్మరం అయ్యాయి. మిల్లర్లు, వ్యాపారులు సన్నరకం ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.1,900 నుంచి రూ.2,300 వరకు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. నిజామాబాద్‌లోని నాణ్యమైన ధాన్యాన్ని నల్లగొండ, మిర్యాలగూడ, ఏపీకి చెందిన మిల్లర్లు కూడా కొనుగోలు చేస్తున్నారు. పది రోజుల క్రితం క్వింటాలు ధాన్యానికి రూ. 2,500 ధర చెల్లించిన దళారులు ఇప్పుడు రూ.1,900 కే కొంటున్నారు.



మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో ధాన్యం విక్రయించేందుకు మిల్లుల వద్ద నిలిపి ఉంచిన ట్రాక్టర్లు

మిర్యాలగూడలోని 75 మిల్లులకు ధాన్యం

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా మిర్యాలగూడ రైస్ మిల్లులకు ధాన్యం భారీగా వస్తోంది. మిర్యాలగూడలోని 87 రైస్‌మిల్లులు ఉండగా, ప్రస్తుతం 75 మిల్లుల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. ఇటీవల మిల్లర్లు ధాన్యం కొనుగోళ్లకు ఆంక్షలు విధించగా, మంత్రి కోమటిరెడ్డి మిల్లుకు వచ్చిన ప్రతిరైతు నుంచి ధాన్యం కొనుగోలు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. అయితే తొలుత వ్యాపారులు మొదట క్వింటాల్‌కు రూ.2600 నుంచి రూ.2700 వరకు చెల్లించగా, ధాన్యం రాక పెరగడంతో వ్యాపారులు ధర తగ్గించారు. పెరిగిన ఎండల ధాటికి ట్రాక్టర్లతో ధాన్యం తెచ్చిన రైతుల నుంచి కొనుగోలు చేయకుండా సాయంత్రం వరకు వేచి ఉండేలా చేసి క్వింటాల్‌కు రూ.2100 నుంచి రూ.2,400 వరకు మాత్రమే ఇచ్చి కొనుగోలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటి వరకు సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామ మిల్లర్లు చెబుతున్నారు. ప్రతి ఏడాది 4 నుంచి 5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని, ఈసారి పంట దిగుబడి ఆశించినంత రాకపోవడంతో 3లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసినట్టు చెబుతున్నారు.

ఏప్రిల్ ఒకటి నుంచి ప్రభుత్వ కొనుగోళ్లు

యాసంగి సీజన్‌కు సంబంధించి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 7,149 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 75.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అయితే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ఏర్పాటు చేస్తే దళారుల బాధ తగ్గేదని, మిల్లర్ల ఇష్టారాజ్యానికి చెక్ పడేదని రైతులు అంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 'ఏ' గ్రేడ్ రకానికి రూ.2,203, 'బి' గ్రేడ్‌కు రూ. 2,183 ధర వస్తుందని, మిల్లర్లు, దళారుల వల్ల కనీస మద్దతు ధర కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. దళారులు తరుగు తీస్తున్నారనే ఆరోపణలున్నాయి. ధాన్యానికి డబ్బులు చెల్లించేటప్పుడు లక్ష రూపాయలకు రూ.1,000 చొప్పున కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్యం తాగి పాఠశాలకు..

- మత్తులో విద్యార్థినులను చావగొట్టిన ప్రధానోపాధ్యాయుడు
- గదిలో నిర్బంధించిన గ్రామస్తులు.. సస్పెండ్ చేసిన డీఈవో



నిర్బంధంలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణ

చర్ల రూరల్: విద్యాబుద్ధులు చెప్పాల్సిన మాస్టారు మందు కొట్టి పాఠశాలకు హాజరవడమే కాక... విద్యార్థినులను చావగొట్టాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం జీపీ పల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడి నిర్వాకమిది. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బానోత్ కృష్ణ బుధవారం పాఠశాలకు మద్యం తాగి విధులకు హాజరయ్యాడు. ఆ మత్తులో విచక్షణ కోల్పోయి విద్యార్థినులను కర్రతో చితకబాదాడు. దీంతో విద్యార్థినులు రోదిస్తూ వెళ్లి తల్లిదండ్రులకు చెప్పారు. వారు పాఠశాలకు చేరుకుని మద్యం తాగి విధులకు హాజరవడంపై నిలదీయగా.. 'ఎలా వస్తే ఏమిటి.. స్కూల్‌కి వచ్చామా.. లేదా'.. అన్నది చూసుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు ఆయనను కాసేపు పాఠశాల గదిలో నిర్బంధించి.. ఆ తర్వాత బయటకు పంపించారు. దీనిపై ఎంఈవో సూచనతో చర్ల హైస్కూల్ ఇన్‌చార్జి పి.శ్రీనివాస్ జీపీ పల్లి చేరుకుని విద్యార్థినులు, గ్రామస్తులతో మాట్లాడి నివేదిక సమర్పించారు. దీంతో ప్రధానోపాధ్యాయుడు కృష్ణను సస్పెండ్ చేస్తూ డీఈవో బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవో తెలిపారు.

శ్రుతి మించుతోంది

మహిళా అభ్యర్థులపై నీచమైన కామెంట్లు | సోషల్ మీడియాలో కించపరిచే పోస్టులు

ప్రచారంలో పేట్రేగుతున్న పెడ ధోరణి • అన్ని పార్టీలూ ఆ తాను ముక్కలే


కంగనా


సుప్రియ


మమత

ఒకప్పుడు ఎన్నికలొస్తే ప్రత్యర్థుల భావజాలం, అవినీతి, ప్రభుత్వ విధానాల వంటివాటిపై పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సాగేవి. కానీ ఇప్పుడు నేతల నోళ్లు అదుపు తప్పుతున్నాయి. మాటలు హద్దులు దాటుతున్నాయి. ఎన్నికల బరిలో దిగుతున్న మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసే పెడ ధోరణి పెరిగిపోతోంది. వారిని కించపరచడం, లింగవివక్షతో కూడిన వెకిలి కామెంట్లు చేయడం పరిపాటిగా మారుతోంది. చివరికి మహిళా నేతలు ప్రత్యర్థి పార్టీల్లోని సాటి మహిళలపై నోరు పారేసుకోవడానికి వెనకాడటం లేదు! బీజేపీ లోక్‌సభ అభ్యర్థి, సినీ నటి కంగనాపై కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్ వ్యాఖ్యలు అందుకు నిదర్శనమే. నారీ శక్తి అంటూ పార్టీలు ఇస్తున్న నినాదాలు మాటలకే పరిమితమవుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది...

'మండీలో ఇప్పుడు ఏ రేటు పలుకుతోందో!' – ఇది కంగనాపై కాంగ్రెస్ ఐటీ విభాగం చీఫ్ సుప్రియ మూడు రోజుల కింద ఇన్‌స్టాగ్రాంలో పెట్టిన పోస్టు. కంగనా హిమాచల్‌ప్రదేశ్‌లోని తన స్వస్థలమైన మండి నుంచి లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. మండి అంటే బజారు అన్న అర్థాన్ని సాకుగా తీసుకుని, కంగనా ఫొటో పెట్టి మరీ చేసిన ఈ నీచమైన వ్యాఖ్యలపై దుమారం రేగింది. బీజేపీ వెంటనే దీన్ని అందిపుచ్చుకుంటూ కాంగ్రెస్ అంటేనే సంస్కారరాహిత్యానికి మారుపేరంటూ మండిపడింది. ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ మొదలుకుని పలువురు నేతలు చేసిన ఇలాంటి కామెంట్లన్నింటినీ ప్రస్తావిస్తూ దుమ్మెత్తిపోసింది. దాంతో ఆ పోస్టుతో తనకు సంబంధం లేదని, ఎవరో తన ఇన్‌స్టా అకౌంట్‌ను హాక్ చేసి ఈ పని చేశారని సుప్రియ వివరణ ఇచ్చుకున్నా కాంగ్రెస్‌కు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ''ఓ యువకునికి టికెట్ దక్కితే అతని భావజాలంపై దాడి! అదే ఒక యువతి ఎన్నికల బరిలో దిగితే లింగవివక్షతో కూడిన ఇలాంటి వ్యాఖ్యలు! ఈ నీచమైన పోకడకు ఇకనైనా తెర పడాలి. సెక్స్ వర్కర్ల జీవితాలు ఎంతో దుర్భరం. వాటినిలా మహిళలపై బురద జల్లేందుకు సరుకుగా వాడుకోవడం సరికాదు'' అంటూ కంగనా హుందాగా ఇచ్చిన రిప్లై అందరి మనసులూ గెలుచుకుంది. భారత్‌లో ఎన్నికల వేళ మహిళా నేతలపై ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు కొత్తేమీ కాదు. కానీ ఈసారి మాత్రం ఎన్నికల వేడి మొదలవుతూనే ఈ తరహా దూషణ పర్వం ఊపందుకోవడం ఆందోళన కలిగిస్తోంది. రాహుల్ కూడా అయోధ్య రామాలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి మోదీ సర్కారు కేవలం వీఐపీలనే పిలిచిందంటూ తప్పుబట్టే క్రమంలో నటి ఐశ్వర్యారాయ్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ''ఆ కార్యక్రమాన్ని మీరంతా చూశారు కూడా! ఐశ్వర్య, అమితాబ్, మోదీ... ఇలాంటివాళ్లే ఉన్నారు. కార్యక్రమంలో ఐశ్వర్య డ్యాన్సులు చేసింది. కానీ అక్కడ ఓబీసీలు, ఇతర సామాన్యులు ఒక్కరన్నా కన్పించారా?'' అన్న రాహుల్ కామెంట్లపై తీవ్ర విమర్శలే వచ్చాయి. వాటిపై నెటిజన్లు కూడా దుమ్మెత్తిపోశారు. కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ కూడా ఇలాంటి వ్యాఖ్యల బాధితురాలే. అమేథీ నియోజకవర్గానికి ఆమె కేవలం అప్పుడప్పుడూ వచ్చి తన హావభావాలతో జనాన్ని ఆకర్షించి వెళ్లిపోతారంటూ కాంగ్రెస్ నేత అజయ్‌రాయ్ ఇటీవల నోరుపారేసుకున్నారు.

బీజేపీ నేతలు కూడా...

మహిళా నేతలపై అభ్యంతరకర వ్యాఖ్యల విషయంలో అధికార బీజేపీ నాయకులూ ఏమీ తక్కువ తినలేదు. తాజాగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీపై రాష్ట్ర బీజేపీ నేత దిలీప్ ఘోష్ చేసిన వ్యాఖ్యలు కూడా మంటలు రేపాయి. ''మమత గోవాకు వెళ్తే తాను గోవా కూతురినంటారు. త్రిపురకు వెళ్తే త్రిపుర బిడ్డనని చెప్పుకుంటారు. ముందుగా మమత తన తండ్రెవరో గుర్తించాలి'' అంటూ తీవ్ర అభ్యంతరకరకర వ్యాఖ్యలు చేశారాయన. సుప్రియా, ఘోష్ ఇద్దరికీ కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా తలంటింది. వారి వ్యాఖ్యలకు వివరణ కోరుతూ తాఖీదులిచ్చింది. ఘోష్‌కు బీజేపీ అధినాయకత్వం కూడా షోకాజ్ నోటీసిచ్చింది. అడ్డగోలు వ్యాఖ్యలు చేయడం ఆయనకు కొత్తేమీ కాదు. 2021 పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ మమత కాలికి గాయమైంది. దాంతో కొంతకాలం వీల్‌చైర్‌లోనే ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో తృణమూల్‌తో హోరాహోరీ తలపడ్డ బీజేపీ ఇదంతా సానుభూతి స్టంటేనంటూ ఎద్దేవా చేసింది. ఆ క్రమంలో, 'బెర్ముడాలు (నిక్కర్లు) వేసుకుంటే సౌలభ్యంగా ఉంటుంది' అంటూ అప్పట్లో మమతపై ఘోష్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఇక కేరళలో బీజేపీ నేత, సినీ నటుడు సురేశ్ గోపీ ప్రెస్‌మీట్ సందర్భంగా ఓ మహిళా జర్నలిస్టును పదేపదే అభ్యంతరకరంగా తాకడమూ వివాదం రేపింది. ఆమె ఒకటికి రెండుసార్లు ఆయన చేయిని అడ్డుకుంటూ నెట్టేసినా అలాగే వ్యవహరించారు. దీనిపై గొడవ పెద్దదవడంతో తప్పనిసరైన క్షమాపణలు చెప్పినా, పితృవాత్సల్యంతో అలా చేశానంటూ సమర్థించుకున్నారు. చిర్రెత్తుకొచ్చిన సదరు జర్నలిస్టు ఆయనపై కేసు పెట్టేదాకా వెళ్లింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ అగ్ర నేత కైలాశ్ విజయవర్గీయ కూడా ఇలాగే నోరు పారేసుకున్నారు. అభ్యంతరకర దుస్తులు ధరించే మహిళలు శూర్పణఖల్లా కనిపిస్తారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా, ''దేవుడు మీకు అందమైన శరీరమిచ్చాడు. మంచి బట్టలేసుకోవచ్చుగా'' అన్నారు. వీటిని సుప్రియా శ్రీనేత్ అప్పట్లో తీవ్రంగా తప్పుబట్టడం, మహిళలంటే బీజేపీకి గౌరవం లేదంటూ దుయ్యబట్టడం విశేషం! రాజకీయాలు అర్థం కాకుంటే ఇంటికెళ్లి వంట చేసుకొమ్మంటూ ఎన్సీపీ నేత సుప్రియా సులేను ఉద్దేశించి మహారాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రకాంత్ పాటిల్ వ్యాఖ్యలు కూడా అప్పట్లో మంటలు రేపాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఆందోళనకరమే..

మన దేశంలో ఎన్నికల వేళ మహిళా నేతలపై అభ్యంతరకర వ్యాఖ్యలు పెరిగిపోతాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా పరిశోధన తేల్చింది. ''2019 లోక్‌సభ ఎన్నికల్లోనైతే వారిపై వ్యక్తిగత విమర్శలు అనూహ్య స్థాయిలో పెరిగిపోయాయి. 95 మంది మహిళా నేతలకు వచ్చిన 1.14 లక్షల ట్వీట్లను పరిశీలిస్తే 14 శాతం దాకా లింగవివక్షతో కూడిన అభ్యంతరకర విమర్శలే. అంటే ఒక్కొక్కరికీ రోజుకు సగటున ఇలాంటి 113 ట్వీట్లొచ్చాయి!'' అని పేర్కొంది. బీజేపీ తరఫున యూపీలో రాంపూర్ నుంచి పోటీ చేసిన జయప్రదపై సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజం ఖాన్ 'ఖాకీ లో దుస్తులు' వ్యాఖ్యలు, ప్రియాంకా గాంధీ 'పప్పూ కీ పప్పీ' అంటూ బీజేపీ నేతల ఎద్దేవా, సినీ నటి హేమమాలిని ఓట్ల కోసం డ్యాన్సులు చేస్తారంటూ ప్రత్యర్థుల విమర్శలు... ఇలా 2019 ఎన్నికల్లో వివాదాలకు దారితీసిన ఉదంతాలెన్నో! ఇలా మహిళా నేతల వ్యక్తిత్వ హననానికి పూనుకునే ధోరణి మన దేశ రాజకీయాల్లో నేటికీ పెద్ద సవాలుగానే ఉందని విశ్లేషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకరకంగా మన సమాజపు పురుషాహంకార వైఖరికి ఇది అద్దం పడుతోందని వారంటున్నారు. నిజానికి పోలింగ్ బూత్‌లకు వచ్చేందుకు పురుషుల నిరాసక్తత నేపథ్యంలో భారత్‌లో కొన్నేళ్లుగా ఏ ఎన్నికల్లోనైనా మహిళల ఓట్లు కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో నాయకురాళ్లను కించపరిస్తే మహిళల ఓట్లకు గండి పడవచ్చని తెలిసి కూడా ఇటువంటి వ్యాఖ్యలు చేస్తుండటం ఆందోళనకర పరిణామమేనంటున్నారు.

కేజ్రీవాల్ నిజాలన్నీ వెల్లడిస్తారు!



- 'లిక్కర్' డబ్బు ఎక్కడుందో నేడు కోర్టులో చెప్పబోతున్నారు
- రుజువులు కూడా సమర్పిస్తారు
- కేజ్రీవాల్ భార్య సునీత వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో నిజాలను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గురువారం కోర్టులో బయటపెట్టబోతున్నట్లు ఆయన భార్య సునీత కేజ్రీవాల్ చెప్పారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈడీ ఆయన్ను అరెస్టు చేసిందంటూ ఆమె బుధవారం వీడియో సందేశం విడుదల చేశారు. ''మంగళవారం కలిసినప్పుడు నా భర్త నాతో పలు విషయాలు పంచుకున్నారు. ఆయన ఆరోగ్యం సరిగా లేదు. డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. కస్టడీలోనూ ప్రజల గురించే ఆలోచిస్తున్నారు. ఢిల్లీలో తాగునీటి సమస్యను నివారించాలని లేఖ ద్వారా పంపిన ఉత్తర్వులను కూడా కేంద్రం వివాదాస్పదంగా మారుస్తోంది. ఢిల్లీ నాశనం కావాలని కోరుకుంటోంది. ఈడీ అధికారులు ఇప్పటిదాకా 250 సార్లు సోదాలు నిర్వహించారు. మా నివాసంలో సోదాలు చేసి కేవలం రూ.73 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కుంభకోణంలో చేతులు మారిన సొమ్ము ఇంకా దొరకలేదని ఈడీ చెబుతోంది. మద్యం కుంభకోణంలో నిజనిజాలు, ఆ డబ్బు ఎక్కడుందో గురువారం కోర్టులో బయటపెడతానని కేజ్రీవాల్ నాతో చెప్పారు. అందుకు రుజువులు కూడా సమర్పిస్తారు'' అని వీడియో సందేశంలో సునీత స్పష్టం చేశారు.

క్షీణిస్తున్న కేజ్రీవాల్ ఆరోగ్యం

ఈడీ కస్టడీలో ఉన్న అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు బుధవారం ఆందోళన వ్యక్తం చేశాయి. మధుమేహ బాధితుడైన కేజ్రీవాల్ రక్తంలో చక్కెరస్థాయిల్లో హెచ్చు తగ్గులు నమోదవుతున్నాయని వెల్లడించాయి. కేజ్రీవాల్ బ్లడ్‌షుగర్ లెవెల్ ఒక దశలో 46 ఎంజీకి పడిపోయిందని డాక్టర్లు చెప్పారని, ఇది చాలా ప్రమాదకరమని తెలియజేశాయి.

హైకోర్టులో కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో నిరాశే ఎదురైంది. ఆయన అరెస్టులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. తనను ఈడీ కస్టడీ నుంచి తక్షణమే విడుదల చేయాలంటూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై ఏప్రిల్ 2వ తేదీలోగా స్పందించాలని న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఈడీకి సూచించారు. తదపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి వాయిదా వేశారు.

అమెరికా జోక్యంపై అభ్యంతరం

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్ట్‌పై అమెరికా వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇది దేశ అంతర్గత, సార్వభౌమత్వానికి సంబంధించిన విషయమని స్పష్టంచేసింది. బుధవారం ఢిల్లీలో అమెరికా దౌత్యవేత్తను పిలిపించి తన అసంతృప్తిని తెలియజేసింది. భారత్‌లో అమెరికా మహిళా దౌత్యవేత్త, యాక్టింగ్ చీఫ్ ఆఫ్ మిషన్ గ్లోరియా బెర్బేనాకు సమన్లు జారీచేసింది. దీంతో బుధవారం ఆమె ఢిల్లీలోని సౌత్‌బ్లాక్‌లో విదేశాంగ శాఖ కార్యాలయానికి వచ్చారు. విదేశాంగ శాఖ అధికారులతో దాదాపు 30 నిమిషాలు సమావేశమయ్యారు. 'స్వేచ్ఛగా, పారదర్శకంగా, వేగవంతంగా, చట్టపరంగా న్యాయం పొందే అర్హత సీఎం కేజ్రీవాల్‌కు ఉంది' అని మంగళవారం అమెరికా ఉన్నతాధికారి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. భారత న్యాయప్రక్రియపై అమెరికా వ్యాఖ్యలను తప్పుబడుతూ భేటీ తర్వాత భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ''దౌత్య సంబంధాలకు సంబంధించి దేశాలు తోటి దేశాల సార్వభౌమత్వం, అంతర్గత వ్యవహారాలకు గౌరవం ఇవ్వాలి. తోటి ప్రజాస్వామ్య దేశాల పట్ల ఇదే బాధ్యతతో మెలగాలి. బాధ్యత విస్మరిస్తే బాగుండదు. భారత్‌లో న్యాయవ్యవస్థ స్వతంత్రమైంది. సత్వర న్యాయమే దాని అంతిమ లక్ష్యం. దానిపై ఇతరుల అభిప్రాయాలు అవాంఛనీయం'' అని ఆ ప్రకటనలో భారత్ తన అసంతృప్తిని తెలిపింది. కేజ్రీవాల్ అరెస్ట్‌పై వ్యాఖ్యలు చేసిన జర్మనీ దౌత్యవేత్త, డెప్యూటీ చీఫ్ మిషన్‌కు ఇటీవల భారత్ సమన్లు జారీచేసిన నేపథ్యంలో మళ్లీ అలాంటి ఘటనే జరగడం గమనార్హం.

కేరళ సీఎం కుమార్తెపై ఈడీ కేసు

కొచ్చి: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదుచేసింది. వీణ, మరికొందరికి చెందిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌పైనా ఈడీ కేసు వేసింది. కొచ్చి కేంద్రంగా పనిచేసే కొచ్చిన్ మినరల్స్, రూటైల్ అనే సంస్థ అక్రమంగా ఎక్సాలిజిక్ సొల్యూషన్స్‌కు రూ.1.72 కోట్ల చెల్లింపులు జరిపిందని ఆరోపణ. 2018–2019కాలంలో ఈ చెల్లింపులు జరిగాయి. కొచ్చిన్ మినరల్స్‌తో ఎక్సాలాజిక్ గతంలో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. అందులోభాగంగా ఎక్సాలాజిక్‌కు కన్సల్టెన్సీ, సాఫ్ట్‌వేర్ సపోర్ట్ సేవలను అందించాలి. కానీ కొచ్చిన్ మినరల్స్‌కు ఎలాంటి సేవలు అందించకున్నా ఆ సంస్థ నుంచి ఎక్సాలాజిక్‌కు నగదు చెల్లింపులు జరగడంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆదాయ పన్ను శాఖ దర్యాప్తు తర్వాత ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని దర్యాప్తు విభాగమైన సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్(ఎస్ఎఫ్ఐఓ) ఈడీకి ఫిర్యాదుచేసింది. దీంతో మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ కేసులు నమోదుచేసింది.

మొయిత్రాకు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం(ఫెమా) ఉల్లంఘన కేసులో విచారణ కోసం తమ ఆఫీస్‌కు రావాలంటూ తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా, దుబాయ్ వ్యాపారి దర్శన్ హీరానందానీలకు ఈడీ సమన్లు జారీచేసింది. ఢిల్లీలోని తమ కార్యాలయానికి గురువారం రావాలని సమన్లలో పేర్కొంది. 49 ఏళ్ల మొయిత్రాకు గతంలో ఇదే కేసులో రెండుసార్లు సమన్లు జారీచేసి రమ్మని పిలిచినా ఆమె గైర్హాజరయ్యారు. ఇతరత్రా అధికారిక పనులు ఉన్నాయని, అయినా తనకు సమన్లు పంపడం చట్టవ్యతిరేకమని మొయిత్రా గతంలో వ్యాఖ్యానించారు. ముంబైలోని దర్శన్‌కు చెందిన రియల్టీ గ్రూప్‌కు వ్యతిరేకంగా నమోదైన ఫెమా కేసులో హాజరుకావాలని ఆయనకు ఈడీ విడిగా సమన్లు పంపింది. ప్రస్తుత కేసుకు సంబంధించి మొయిత్రాతో పరిచయం ఉన్న ఒక లాయర్‌ను ఈడీ బుధవారం ఆఫీస్‌కు పిలిపించి విచారించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. 'నగదుకు పార్లమెంట్‌లో ప్రశ్నలు' ఉదంతంలో అనైతిక ప్రవర్తనకు పాల్పడ్డారంటూ పార్లమెంట్ ఆమెను బహిష్కరించడం తెల్సిందే.

ఎలాన్ మస్క్ ఔదార్యం

- కెనడాలో భారత సంతతి వైద్యురాలికి సాయం
- ఆమె చెల్లించాల్సిన 3 లక్షల డాలర్ల జరిమానా చెల్లించేందుకు సంసిద్ధత


కుల్విందర్ కౌర్ గిల్


ఎలాన్ మస్క్

టొరంటో: కెనడాలో న్యాయపరమైన చిక్కుల్లో ఇరుకున్న భారత సంతతి వైద్యురాలికి సహాయం అందించేందుకు ఎక్స్(ట్విట్టర్) వ్యవస్థాపకుడు, టెస్లా, స్పేస్ ఎక్స్ సంస్థల సీఈఓ, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ముందుకొచ్చారు. ఆమె చెల్లించాల్సిన 3 లక్షల డాలర్లు(రూ.2.50 కోట్లు) జరిమానా చెల్లించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. భారత సంతతి వైద్యురాలు కుల్విందర్ కౌర్ గిల్ కెనడాలోని గ్రేటర్ టొరంటోలో గత పదేళ్లుగా చిన్నపిల్లల వైద్యురాలిగా పని చేస్తున్నారు. పిడియాట్రిక్స్, అలర్జీ, ఇమ్యూనాలజీలో పోస్టుగ్రాడ్యుయేట్ ట్రైనింగ్ పూర్తి చేశారు. స్పెషలిస్టు డాక్టర్‌గా గుర్తింపు పొందారు. పేద ప్రజలకు, వలసదారులకు తన సేవలు అందిస్తుంటారు. 2020లో కెనడాలో కోవిడ్–19 మహమ్మారి ఉధృతంగా వ్యాప్తి చెందుతుండడంతో ప్రభుత్వం లాక్‌డౌన్ విధించింది. ఈ లాక్‌డౌన్‌ను కుల్విందర్ కౌర్ గిల్ వ్యతిరేకించారు. ప్రజలంతా తప్పనిసరిగా కరోనా వ్యాక్సిన్ తీసుకోవాలన్న నిబంధనను కూడా తప్పుపట్టారు. లాక్‌డౌన్, వ్యాక్సినేషన్‌పై ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ ట్విట్టర్(ఇప్పుడు ఎక్స్) ధైర్యంగా పోస్టులు పెట్టారు. దీనిపై కెనడా మీడియా అభ్యంతరం వ్యక్తం చేసింది. చివరకు ఆమెపై కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్, సర్జన్స్ ఆఫ్ అంటారియో విచారణ ప్రారంభించింది. క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేసింది. దీనిపై కుల్విందర్ కౌర్ గిల్ న్యాయ పోరాటానికి దిగారు. కానీ, దురదృష్టం వెక్కిరించింది. 1.2 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించాలని 2022 అక్టోబర్‌లో కోర్టు ఆమెను ఆదేశించింది. పలు విన్నపాల తర్వాత జరిమానాను 3 లక్షల డాలర్లుగా ఖరారు చేస్తూ గత నెలలో తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించడానికి గడువు కూడా ఎక్కువగా లేదు. తన వద్ద అంత సొమ్ము లేకపోవడంతో కుల్విందర్ కౌర్ ప్రజల నుంచి విరాళాలు సేకరించడం మొదలుపెట్టింది. దాదాపు సగం నిధులు సేకరించింది. జరిమానా చెల్లించడానికి మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉంది. ఇంతలో ఈ విషయంలో తెలిసిన ఎలాన్ మస్క్ వెంటనే స్పందించారు. మొత్తం 3 లక్షల డాలర్ల జరిమానా తానే చెల్లిస్తానని ప్రకటించారు. ఆయనకు కుల్విందర్ కౌర్ గిల్ 'ఎక్స్'లో కృతజ్ఞతలు తెలియజేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- డిప్యూటీ కమాండర్ సహా ఆరుగురు మావోల మృతి
- పట్టుబడిన ఒక మావోయిస్టు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం హోరాహోరీగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజీపూర్ జిల్లా పరిధిలో జరిగిన పోలీసుల ఎదురుకాల్పుల్లో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) ప్లాటూన్–10 డిప్యూటీ కమాండర్‌తో సహా ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. బస్తర్ రేంజ్ ఐజీ పి. సుందర్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం..బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధి పూసుబాక మార్గంలో సోమవారం హోలీ వేడుకలు జరుపుకున్న కొందరు యువకులు తాలిపేరు నదిలో స్నానానికి వెళ్లారు. వారిలో ముగ్గురిని మావోయిస్టులు చంపేశారని ఆరోపణలొచ్చాయి. దీంతో మంగళవారం ఉదయం నుంచే పూసుబాక, చీపురుబట్టి గ్రామాల సమీప అటవీ ప్రాంతంలో కోబ్రా 210, 205, సీఆర్‌పీఎఫ్ 229 బెటాలియన్లకు చెందిన పోలీసు బలగాలతో పాటు డీఆర్‌జీ బలగాలు కూంబింగ్ చేపట్టాయి.

హోరాహోరీగా కాల్పులు

కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలకు బుధవారం తెల్లవారుజామున తాలిపేరు నదీ తీరాన మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో 4 గంటల పాటు ఎదురుకాల్పులు కొనసాగాయి. వాటిలో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. దాదాపు 40 మంది మావోయిస్టుల్లో పలువురు గాయాలతో తప్పించుకున్నారనే సమాచారంతో ముమ్మరంగా కూంబింగ్ చేస్తున్నారు. పట్టుబడ్డ మావోయిస్టును విచారిస్తున్నారు. మృతి చెందిన మావోయిస్టులను ప్లాటూన్–10 డిప్యూటీ కమాండర్ పూనెం నగేష్, ఆయన భార్య వెట్టి సోని, అయ్‌తు పూనెం, సుక్కా ఓయం, సుప్పో మోకా, కొవసి గంగిగా గుర్తించారు. వారిపై రూ.14 లక్షల రివార్డుంది. ఘటనాస్థలి వద్ద మందుగుండు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. హోలీ రోజు ఇన్‌ఫార్మర్ల నెపంతో ముగ్గురిని హతమార్చి ఈ వైపుగా పోలీసులను రప్పించి మెరుపుదాడి చేయాలని మావోలు పథక రచన చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఎన్ఐఏ నూతన డీజీగా సదానంద్ వసంత్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ఉగ్రవ్యతిరేక బృందానికి సారథ్యం వహిస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి సదానంద్ వసంత్ దాతెను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) నూతన డైరెక్టర్ జనరల్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈయన నియామకాన్ని ఆమోదిస్తూ నియామకాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకున్నాక కేంద్ర సిబ్బంది శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. 1990 బ్యాచ్ మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్ అధికారి అయిన వసంత్ 2026 డిసెంబర్ 31దాకా ఈ పదవిలో కొనసాగుతారు. రాజస్థాన్ కేడర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ కుమార్ శర్మను బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. జాతీయ విపత్తు స్పందనా దళం(ఎన్‌డీఆర్ఎఫ్) నూతన సారథిగా 1991 బ్యాచ్ యూపీ కేడర్ ఐపీఎస్ అధికారి పీయూశ్ ఆనంద్‌ను నియమించారు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్(ఎస్పీజీ) అదనపు డైరెక్టర్ జనరల్‌గా 1995 బ్యాచ్ కేరళ కేడర్ ఐపీఎస్ అధికారి ఎస్.సురేశ్‌ను నియమించారు.

భారత సిబ్బంది భేష్: బైడెన్

వాషింగ్టన్: బాల్టిమోర్‌లో కంటైనర్ నౌక 'డాలీ' ఢీకొట్టడంతో ఫ్రాన్సిస్ స్కాట్ కీ బ్రిడ్జి కూలిపోయిన ఘటనపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందించారు. ఈ నౌకలో ఉన్న 22 మంది భారతీయ సిబ్బందిపై ప్రశంసల వర్షం కురిపించారు. వారు అప్రమత్తంగా వ్యవహరించడం వల్లే పెనుప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. బైడెన్ బుధవారం శ్వేతసౌధంలో మాట్లాడారు. నౌకపై అందులోని సిబ్బంది నియంత్రణ కోల్పోయారని చెప్పారు. వంతెనను నౌక ఢీకొట్టడానికంటే ముందే జరగబోయే ప్రమాదాన్ని గ్రహించి, స్థానిక రవాణా అధికారులకు సమాచారం చేరవేశారని తెలిపారు. దాంతో అధికారులు వేగంగా స్పందించి, వంతెనపై వాహనాల రాకపోకలను నిలిపివేశారని వెల్లడించారు. ఫలితంగా చాలామంది ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని, ఇదంతా భారతీయ సిబ్బంది అప్రమత్తత వల్లే సాధ్యపడిందని బైడెన్ కొనియాడారు.

రెక్కలు ముక్కలైన విమానాలు

కోల్‌కతా: కోల్‌కతా ఎయిర్‌పోర్టులో బుధవారం పెనుప్రమాదం తప్పింది. ప్రయాణానికి సిద్ధంగా ఉన్న రెండు విమానాలు రన్‌వే సమీపంలోని ట్యాక్సీవేపై అత్యంత సమీపంలోకి రావడంతో వాటి రెక్కలు పరస్పరం ఢీకొన్నాయి. చెన్నై వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం రెక్కలో కొంత భాగం ధ్వంసమైంది. దర్భంగా వెళ్లాల్సిన ఇండిగో విమానం రెక్క చివరి భాగం విరిగింది. ఎయిరిండియా విమానంలో 169 మంది, ఇండిగో విమానంలో 154 మంది ఉన్నారు. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పిందని ఎయిర్‌పోర్టు అధికారులు చెప్పారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తుకు డీజీసీఏ ఆదేశించింది.

ఎలక్షన్ బీట్

ఒక్క ఓటు కోసం 39 కిలోమీటర్ల ట్రెక్కింగ్..

ఈటానగర్: ప్రజాస్వామ్యం మామూలు వ్యక్తిని సైతం మెహమాన్‌ను చేస్తుంది. అందుకు ఉదాహరణ ఈ 44 ఏళ్ల సొకేలా తయాంగ్. అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజ్వా జిల్లాలోని మారుమూలన ఉన్న మలోగాం ఆమె గ్రామం. హయులియాంగ్ అసెంబ్లీతోపాటు, అరుణాచల్ ప్రదేశ్ ఈస్ట్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి ఆ గ్రామం వస్తుంది. అక్కడ ఎన్నికలు మొదటి ఫేజ్‌లో జరగనున్నాయి. ఇంతకీ ఆమె మెహమాన్ ఎందుకయ్యారంటే.. ఆ ఊరులో ఓటరు ఆమె ఒక్కరే. ఆమె కోసం పోలింగ్ సిబ్బంది అంతా.. ఎన్నికలు జరిగే ఏప్రిల్ 19వ తేదీ కంటే ఒకరోజు ముందు.. అంటే ఏప్రిల్ 18న 39 కిలోమీటర్ల ఎత్తు కొండలు ఎక్కాల్సి ఉంటుంది. చైనా సరిహద్దుకు దగ్గరలో ఉన్న ఆ గ్రామంలో తయాంగ్ కోసం తాత్కాలికంగా ఓ పోలింగ్ బూత్ కూడా ఏర్పాటు చేయనున్నారు. మలోగామ్‌లో ఇంకొన్ని కుటుంబాలు కూడా ఉన్నాయి. కానీ వారిలో ఎవరూ ఓటు కోసం నమోదు చేసుకోలేదు. దీంతో వారికి ఓటర్ల జాబితాలో చోటు దక్కలేదు. ఒక్కరికోసం బూత్ ఎందుకని.. సమీపంలోని ఏదైనా పోలింగ్ బూత్‌లో ఓటు వేయాల్సిందిగా అధికారులు ఆమెను కోరారు. కానీ అందుకు తయాంగ్ అంగీకరించలేదు. దీంతో ఆమె ఓటు కోసం అధికారులు, భద్రతా సిబ్బంది, పోర్టర్లతో సహా పోలింగ్ బృందం హయులియాంగ్ నుంచి అనూహ్య వాతావరణం మధ్య ప్రమాదకరమైన భూభాగం గుండా కష్టతరమైన ప్రయాణం చేయనుంది. హయులియాంగ్ నుంచి మలోగామ్‌కి కాలి నడకన వెళ్లడానికి ఒక రోజంతా పడుతుంది. పోలింగ్ రోజు ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బూత్ తెరచి ఉంటుంది. ''నేను మా గ్రామంలో చాలా అరుదుగా ఉంటాను. ఏదైనా పని ఉన్నప్పుడు లేదా ఎన్నికల సమయంలో మాలోగాం వస్తుంటా. మిగతా సమయంలో మాకు వ్యవసాయ భూములు ఉన్న లోహిత్ జిల్లాలోని వక్రోలో ఉంటాను. ఏప్రిల్ 18 సాయంత్రంలోగా ఇంటికి చేరుకుని ఓటు వేస్తా'' అని చెబుతున్నారు.

88 స్థానాలకు నేడు నోటిఫికేషన్

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక పోరులో రెండో విడత ఎన్నికల ప్రక్రియకు రంగం సిద్ధమైంది. రెండో విడతలో భాగంగా దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 88 లోక్‌సభ స్థానాలతో పాటు ఔటర్ మణిపూర్‌లోని ఒక స్థానానికి ఏప్రిల్ 26న పోలింగ్ జరుగనుంది. ఇందుకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ జారీ చేయనుంది. వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 4 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. జమ్మూకశ్మీర్ మినహా 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 5న జరుగనుంది. జమ్మూ కశ్మీర్‌లో మాత్రం నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 6న జరుగుతుంది. రెండో విడతలో అస్సాం, బిహార్, ఛత్తీస్‌గఢ్, జమ్మూకశ్మీర్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్తాన్, త్రిపుర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మణిపూర్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. వీటితో పాటు మహారాష్ట్రలోని అకోలా పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం, రాజస్తాన్‌లోని భాగిడోరా అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతాయి.

ఘోష్, సుప్రియాలకు ఈసీ షోకాజ్

న్యూఢిల్లీ/కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, బీజేపీ నాయకురాలు కంగనా రనౌత్‌పై అసభ్య వ్యాఖ్యలు చేసినందుకు బీజేపీ నేత దిలీప్ ఘోష్, కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్‌లకు కేంద్ర ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు పంపింది. ''ప్రాథమిక సాక్ష్యాధారాలను బట్టి చూస్తే మీ వ్యాఖ్యలు చాలా అగౌరవప్రదంగా, కించపరిచేలా ఉన్నాయి. మీరు ఎన్నికల ప్రవర్తనా నిబంధనావళిని ఉల్లంఘించేలా ప్రవర్తించారు. మార్చి 29వ తేదీ సాయంత్రంకల్లా ఈ విషయంలో సంజాయిషీ ఇవ్వండి'' అని ఆదేశించింది. ''ప్రచారంలో ప్రత్యర్థి నేతల వ్యక్తిగత జీవితాలపై వ్యాఖ్యలు చేయకూడదు. వ్యక్తిగత దూషణ కోడ్ ఉల్లంఘనే. మహిళల గౌరవ మర్యాదలను కించపరిచే వ్యాఖ్యలు, పోస్టులు మానుకోవాలి'' అని ఈసీ పేర్కొంది.

ఘోష్ క్షమాపణలు: మమతాపై వ్యాఖ్యలకు దిలీప్ ఘోష్ క్షమాపణలు చెప్పారు. బీజేపీ అధిష్టానం వివరణ కోరిన కొద్ది గంటలకే, 'నా మాటల్లో తప్పు ఉందని బీజేపీ, ఇతరులు భావిస్తే క్షమించండి' అని ఆయన మీడియాకు చెప్పారు.

బీజేపీలో చేరిన ఆప్ ఎంపీ, ఎమ్మెల్యే

న్యూఢిల్లీ: పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఆ పార్టీకి చెందిన ఏకైక ఎంపీ, జలంధర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సుశీల్‌కుమార్ రింకూ, పశ్చిమ జలంధర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శీతల్ అంగురాల్ బుధవారం బీజేపీలో చేరారు. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి, పార్టీ జాతీయ కార్యదర్శి వినోద్ తావ్డే సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. రింకూ గత ఏడాది జలంధర్ లోక్‌సభ ఉప ఎన్నికకు ముందే కాంగ్రెస్ పార్టీని వీడి ఆప్‌లో చేరారు. పంజాబ్‌లోని 13 స్థానాల్లోనూ పాగా వేయాలని బీజేపీ చూస్తోంది.

'స్టార్' జాబితా నుంచి వసుంధర ఔట్

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే సింధియాకు పార్టీ అధిష్టానం షాక్ ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మధ్యప్రదేశ్‌లో బీజేపీ తరఫున ప్రచారం నిర్వహించే స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో వసుంధరా రాజేకు చోటు దక్కలేదు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సహా మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయినర్లు ప్రచారం నిర్వహించనున్నారు. గత ఎన్నికల్లో ఈ జాబితాలో ఉన్న వసుంధర రాజేను ఈసారి పార్టీ పెద్దలు పక్కన పెట్టారు. ఈసారి స్టార్ క్యాంపెయినర్‌గా రాజస్తాన్ నుంచి ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మకు మాత్రమే అవకాశం కల్పించారు. రాజస్తాన్‌లో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. వసుంధరకు బదులు భజన్‌లాల్ శర్మను పార్టీ అధిష్టానం ముఖ్యమంత్రిని చేసింది. ఇప్పుడు మధ్యప్రదేశ్ స్టార్ క్యాంపెయినర్ల జాబితా నుంచి ఆమె పేరును తొలగించడం విశేషం.

డబ్బుల్లేకే పోటీకి దూరం: నిర్మల

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు 'అవసరమైన నిధులు' తన వద్ద లేవని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అందుకే పోటీకి దూరంగా ఉన్నట్టు చెప్పారు. ''బీజేపీ అధిష్టానం నాకు టికెట్ ఆఫర్ చేసింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో ఏ రాష్ట్రాన్నైనా ఎంచుకోవచ్చని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా చెప్పారు. దానిపై వారం పది రోజులు ఆలోచించా. పోటీకి బోలెడంత డబ్బు కావాలి. పైగా కుల, మత సమీకరణాల వంటి గెలుపు ప్రాతిపదికలెన్నో ఉంటాయి. ఇవన్నీ నా వల్ల కాదనిపించింది. అందుకే పోటీ చేయలేనని పార్టీకి చెప్పా'' అని బుధవారం టైమ్స్ నౌ సదస్సులో చెప్పుకొచ్చారామె. తన వాదనతో ఏకీభవించినందుకు పార్టీకి ధన్యవాదాలన్నారు. ఆమె కర్ణాటక నుంచి రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు.

సింధియాపై యాదవేంద్ర సింగ్ పోటీ

14 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ ఎనిమిదో జాబితా

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని గుణ లోక్‌సభ స్థానంలో బీజేపీ నేత, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాపై కాంగ్రెస్ అభ్యర్థిగా రావు యాదవేంద్ర సింగ్ పోటీకి దిగనున్నారు. ఈ మేరకు 14 మంది అభ్యర్థులతో బుధవారం కాంగ్రెస్ ఎనిమిదో జాబితా విడుదలచేసింది. మధ్యప్రదేశ్‌లో విదిశ స్థానం నుంచి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శివ్‌రాజ్‌సింగ్ చౌహాన్‌పై ప్రతాప్ భాను శర్మ బరిలో దిగనున్నారు. వీటితో పాటు ఉత్తరప్రదేశ్, తెలంగాణలో చెరో నాలుగు స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లో చెరో మూడు స్థానాలకు కూడా అభ్యర్థుల పేర్లను వెల్లడించింది.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 28 । మార్చి । 2024

ఫిర్యాదుపై అలసత్వం

ఇన్‌స్పెక్టర్, ఎస్సై, కానిస్టేబుల్‌పై వేటు



బండ్లగూడ పోలీస్‌స్టేషన్

చాంద్రాయణగుట్ట: పాతబస్తీలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్, ఎస్సై, కానిస్టేబుల్ సస్పెండ్ కావడం చర్చనీయాంశంగా మారింది. బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్‌లో పోయిన జనవరి నెలలో మహిళా కానిస్టేబుల్ కారు పార్కు చేస్తున్న క్రమంలో.. పురుష ఉద్యోగుల్లో ఒకరు బహిరంగంగా మూత్ర విసర్జన చేశారు. ఈ విషయమై సదరు మహిళా కానిస్టేబుల్, మగ ఉద్యోగుల నడుమ గొడవ జరిగింది. ఈ విషయమై ఆమె బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నలుగురిపై కేసు సైతం నమోదయ్యింది. వీరిని రిమాండ్ చేయాలని బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ షాకీర్ అలీ, సెక్టార్ ఎస్సై వెంకటేశ్వర్‌జీలను పలుమార్లు అడిగినా సరైన స్థాయిలో స్పందించలేదు. దీంతో ఆమె విశ్రాంత మిలిటరీ ఉద్యోగి అయిన తన భర్తతో కలిసి నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై విచారణ చేపట్టి ఇన్‌స్పెక్టర్, ఎస్సైలతో పాటు కానిస్టేబుల్ రమేష్‌లను సీపీ సస్పెండ్ చేశారు. సస్పెండ్‌కు గురైన వెంకటేశ్వర్‌జీ మరో మూడు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. గతంలో ఫలక్‌నుమా ఠాణాలో ఎస్సైగా పని చేసిన వెంకటేశ్వర్‌జీతో పాటు బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ షాకీర్ అలీ వ్యవహార శైలి సైతం మొదటి నుంచి కూడా వివాదాస్పదంగా కొనసాగిందన్న ఆరోపణలు సైతం ఉన్నాయి.

దానంతో మేయర్ భేటీ

బంజారాహిల్స్: గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బుధవారం ఉదయం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో భేటీ అయ్యారు. ఇటీవలే నాగేందర్ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో మేయర్ కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్న నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇద్దరి మధ్య రాజకీయ పరమైన విషయాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. వీరిద్దరి భేటీ అనంతరం ఆ వివరాలను ప్రకటించకపోవడం గమనార్హం. కాగా.. దానం నాగేందర్ బుధవారం మధ్యాహ్నం బంజారాహిల్స్‌లోని కె.కేశవరావు నివాసానికి వెళ్లి అరగంట పాటు వివిధ రాజకీయ అంశాలపై చర్చించారు. ఇక్కడ కూడా వివరాలను గోప్యంగా ఉంచారు. నాగేందర్ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. మేయర్ నాగేందర్‌ను కలిసిన కొద్దిసేపటికే, ఆయన కేకేను కలవడం చర్చనీయాంశంగా మారింది.

పోస్టల్ బ్యాలెట్ వినియోగం తప్పనిసరి

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

హిమాయత్‌నగర్: ఎన్నికల విధుల్లోని అధికారులు, సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందజేయడం, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, నిబంధనలు, ఫెసిలిటేషన్ సెంటర్‌ల ఏర్పాటు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకుని జిల్లాలో ఓటింగ్ శాతం పెంచడంలో భాగస్వాములయ్యేలా చైతన్యపరచాలని సూచించారు. సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అడిషనల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, జీహెచ్‌ఎంసీ ఎన్నికల అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు పాల్గొన్నారు.

మహ్మద్ అబ్దుల్ ఖలీమ్ ఆజాద్‌కు తెలుగు వర్సిటీ పురస్కారం



నాంపల్లి: రంగస్థల నటుడు, యువ దర్శకుడు, రచయితడు, సాంకేతిక నిపుణుడు మహ్మద్ అబ్దుల్ ఖలీమ్ ఆజాద్‌కు తెలుగు వర్సిటీ రంగస్థల యువ పురస్కారాన్ని ప్రదానం చేసింది. బుధవారం వర్సిటీ ఎన్టీఆర్ కళా మందిరంలో రంగస్థల కళల శాఖ, కీర్తి శేషులు జె.ఎల్.నరసింహారావు పేరిట నెలకొల్పిన యువ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఖలీం ఆజాద్‌కు రూ.10,116 నగదు ప్రోత్సాహకంతో పాటు పురస్కారాన్ని ప్రదానం చేశారు.

రికార్డు ధర పలికిన పసుపు

సాక్షి, సిటీబ్యూరో: పసుపు ధరలకు రెక్కలొచ్చాయి. నగరంలోని మలక్‌పేట్ మార్కెట్‌లో పసుపు ధర బుధవారం క్వింటాల్‌కు రూ.12 వేలకు పైగా పలికింది. గతంలో పోలిస్తే ఈ మధ్య పసుపు విక్రయాలు నగరంలో భారీగా జరుగుతున్నట్లు వ్యాపారులు అంటున్నారు. యాంటీబయాటిక్స్ గుణాలు ఎక్కువగా ఉండే పసుపును వంటలతో పాటు మందుల రూపంలో కూడా వినియోగించడంతో పసుపు వాడకం పెరిగింది. రోజూ దాదాపు 150 క్వింటాళ్ల పసుపు అవసరం ఉండగా.. నగర మార్కెట్లకు 100 క్వింటాళ్ల పసుపు మాత్రమే దిగుమతి అవుతునట్లు మార్కెట్ లెక్కలు చెబుతున్నాయి. దీంతో డిమాండ్‌కు తక్కువ సరఫరాతో ధరలు విపరీతంగా పెరిగాయి. కరోనా కంటే ముందు పసుపు కేజీ ధర రూ. 120 ఉండగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కేజీ ధర రూ. 180–200 పలుకుతోంది. డిమాండ్ ప్రకారం సరఫరా జరగకపోతే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

బస్తీ యాక్షన్‌ప్లాన్ అమలు చేయండి

సాక్షి, సిటీబ్యూరో: ఇళ్ల నుంచి చెత్త సేకరణ, వల్నరబుల్ ప్రాంతాల్లో చెత్త తరలింపు పనులు విజయవంతంగా నిర్వహించేందుకు వారం రోజుల బస్తీ యాక్షన్ ప్లాన్‌ను సంబంధిత అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ సూచించారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు మహిళల సహకారంతో వీటిని నిర్వహించాలన్నారు. ఇప్పటికే అనేక బస్తీల్లో ఈ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని, వీటిని తప్పనిసరిగా కొనసాగించాలని పేర్కొన్నారు. స్లమ్స్‌లోని అన్ని ప్రాంతాల్లో చెత్త సేకరణ చేయడంలేదంటూ సదరు ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. బస్తీల్లో 1,62,591 ఇళ్లకుగాను 1,23,582 ఇళ్ల నుంచి చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోలను అటాచ్ చేసినట్లు పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్ అరెస్టు

కంటోన్మెంట్: నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నారు. 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన జితేంద్ర నాహక్ (27) కొంతకాలం క్రితం నగరానికి వచ్చి కొత్తగూడలో నివాసం ఉంటున్నాడు. స్విగ్గీ ఫుడ్ డెలివరీ ఏజెంట్‌గా పని చేస్తున్న జితేంద్ర అక్రమ మార్గంలో డబ్బు సంపాదించే క్రమంలో డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. ఒడిశాలోని తన సొంత ప్రాంతం భాంజానగరం నుంచి గంజాయిని తీసుకొచ్చి నగరంలో విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు రూ.20 వేలు వెచ్చించి 5 కిలోల గంజాయి కొనుగోలు చేసిన జితేంద్ర.. ఆ సరుకుతో పాటు మంగళవారం సాయంత్రం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

రన్ రాజా రన్

ఉప్పల్‌లో పరుగుల వరద



సన్‌రైజర్స్ అభిమానుల కోలాహలం



రంగెత్తిన అభిమానం



రోహిత్‌కు జెర్సీని అందిస్తున్న సచిన్



చీర్ బ్యూటీస్



అదిగో.. అదరహో..



విన్ రైజర్స్ జయకేతనం



సన్‌రైజర్స్ ఓనర్ కావ్య



చిల్ బ్రో: విజయ్, ఆనంద్ దేవరకొండ



స్టైల్ బేబీ స్టైల్

సిక్సుల మోత...ఫోర్ల జాతర...వెరసి ఐపీఎల్ తొలి మ్యాచ్ హైదరాబాద్ అభిమానులకు ఫుల్‌జోష్‌ను అందించింది. మైదానంలో ప్రతీ బంతిని వారు ఆస్వాదించారు. వారాంతం...సెలవు దినం కాకపోయినా... నగర క్రికెట్ అభిమానులు ఐపీఎల్ ఆనందానికి జైకొట్టారు. మైదానమంతా ఎస్‌ఆర్‌హెచ్ నినాదాలతో దద్దరిల్లింది. ఫలితంగా స్టేడియం దాదాపు పూర్తి సామర్థ్యంతో నిండిపోయింది. హెచ్‌సీఏ అధికారిక లెక్కల ప్రకారం ఈ మ్యాచ్‌కు 36,426 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. హైదరాబాద్ టీమ్‌కే కాకుండా ముంబై ఇండియన్స్ ఫ్యాన్స్ కూడా పెద్ద సంఖ్యలో ఈ మ్యాచ్‌కు వచ్చారు. టాస్ సమయంలో గత మ్యాచ్‌లాగే మరోసారి హార్దిక్ పాండ్యాను స్టాండ్స్ నుంచి అభిమానులు గేలి చేయగా...రోహిత్, రోహిత్ అంటూ మైదానాన్ని హోరెత్తించారు. ఒకవైపు రైజర్స్ పరుగుల వరద పారిస్తున్నా... మరోవైపు రోహిత్ బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేసినప్పుడల్లా అతని పేరును పిలుస్తూ ఉత్సాహం ప్రదర్శించారు. అతను కూడా ఒకసారి రెండు చేతులు జోడించి దండం పెడుతూ స్పందించాడు. సన్‌రైజర్స్ తరఫున హెడ్, అభిషేక్ శర్మ, క్లాసెన్, మార్క్‌రమ్ 'రన్'రంగం సృష్టించగా..ముంబై ఇండియన్స్ తరఫున 'లోకల్ బాయ్' తిలక్ వర్మ, రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్, టిమ్ డేవిడ్ తదితరులు క్రీజులో ఉన్నంతసేపు అలరించారు. తుదకు ముంబై ఇండియన్స్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టే పైచేయి సాధించి 31 పరుగుల తేడాతో నెగ్గి సొంతగడ్డపై గెలుపు బోణీ కొట్టింది. –సాక్షి, హైదరాబాద్



కూతురితో భువనేశ్వర్ భార్య



నేనూ.. నా అభిమానం..



హాయ్ బుజ్జీ: క్లాసెన్ ఆనంద హేల



హాయ్ డాడీ: కూతురితో క్లాసెన్ భార్య



యాంకర్ వర్షిణి విజయానందం

బస్తీమే సవాల్!

రేవంత్, వర్సెస్ కేటీఆర్ ● ఆసక్తిగా మల్కాజిగిరి పోరు

లోక్‌సభ ఎన్నికలు రాష్ట్రంలోని కీలక రాజకీయ నాయకులు, ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. రాజకీయ భవిష్యత్‌ను ప్రభావితం చేసే ఈ పోరులో పైచేయి సాధించడం కోసం రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తోన్న ఇద్దరు ఉద్దండులు వ్యూహ ప్రతివ్యూహాలు పన్నుతున్నారు. ఈ నేతలెవరో కాదు ఒకరు పీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాగా.. మరొకరు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ ఇరువురి ఎత్తుగడలు ఎంత మేర ఫలిస్తాయో.. ఫలితాలెలా వస్తాయో జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే!

– సాక్షి, సిటీబ్యూరో



గత ఎన్నికల్లో మల్కాజిగిరి ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఇక్కడి నుంచి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిని గెలిపించారు. ఈ సీటును తిరిగి ఈసారి ఎన్నికల్లో దక్కించుకోవడం రేవంత్‌కు కత్తిమీద సాములా మారింది. బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదురవుతుండడం.. ఈ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ ప్రాతినిధ్యం లేకపోవడం.. ఈ పరిస్థితుల్లో ఎంపీ సీటును కైవసం చేసుకునేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. చేరికలను ప్రోత్సహిస్తూ ప్రతిపక్ష బీఆర్ఎస్ బలహీనపరిచే దిశగా పావులు కదుపుతున్నారు.

సిట్టింగ్ సీటును దక్కించుకోవాలని..

ఈ నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఉన్న రేవంత్‌రెడ్డి.. సిట్టింగ్ సీటును నిలబెట్టుకోవడం ద్వారా పట్టు నిలుపుకోవాలనే భావనలో ఉన్నారు. అలాగే ఈ గెలుపుతో విమర్శకుల నోటికి తాళం పడుతుందనే అంచనాలో ఉన్నారు. మరోవైపు చేవెళ్ల లోక్‌సభ స్థానంపై రేవంత్ ప్రత్యేక ఫోకస్ పెట్టారు. నియోజకవర్గ ఇన్‌చార్జీగా ఈ సెగ్మెంట్‌లో పాగా వేసేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందుగా ప్రకటించిన వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని మల్కాజిగిరికి ఖరారు చేశారు. ఇక్కడ సిట్టింగ్ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న గడ్డం రంజిత్‌రెడ్డిని పార్టీలో చేర్చుకోవడం ద్వారా బీఆర్‌ఎస్‌కు షాక్ ఇచ్చారు. దీంతో ప్రతిపక్ష గులాబీ శిబిరాన్ని కకావికలం చేశారు.





● కేవలం ఇక్కడే కాకుండా మల్కాజిగిరి ఎంపీ స్థానానికి పోటీ చేసేందుకు మాజీ మంత్రి మల్లారెడ్డి ఫ్యామిలీ ముందుకొచ్చినా.. చివరి నిమిషంలో వెనక్కి తగ్గేలా చేశారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జిగా చేవెళ్ల, సిట్టింగ్ ఎంపీగా మల్కాజిగిరి స్థానాలను గెలుచుకోవడం రేవంత్‌రెడ్డి ముందున్న పెద్ద సవాల్‌గా భావించవచ్చు. చేవెళ్లలోనూ కొందరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పార్టీలో చేరేలా ఇప్పటికే మంతనాలు సాగించారు. వీరి చేరికతో పార్టీని బలోపేతం చేయవచ్చని ఆయన అంచనా వస్తున్నారు. సికింద్రాబాద్ స్థానానికి దానం నాగేందర్‌ను ప్రకటించడం ద్వారా బీఆర్‌ఎస్‌ను ఇరకాటంలోకి నెట్టారు.

గులాబీలో గుబులు..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మారిన రాజకీయ సమీకరణలు బీఆర్‌ఎస్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఓటమి నుంచి తేరుకోక ముందే.. ఎంపీ స్థానానికి పోటీ చేసేందుకు అభ్యర్థులెవరూ ముందుకు రాకపోవడం.. ప్రకటించిన తర్వాత పార్టీ ఫిరాయించడం గులాబీ శిబిరాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఎట్టకేలకు మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినా.. ఈ రెండు సీట్లను గెలుచుకోవడం మాజీ మంత్రి కేటీఆర్‌కు తలకుమించిన భారంగా పరిణమించింది. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ ప్రత్యర్థిగా మారడం.. మల్కాజిగిరి బలమైన మల్లారెడ్డి ఫ్యామిలీ పోటీకి దూరంగా ఉండడం పార్టీ శ్రేణులను నైరాశ్యంలో పడేసింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు తరచూ ఈ నియోజకవర్గాల నేతలతో గులాబీ దళపతి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌తో సమావేశమవుతున్నారు. ప్రచార పర్వంలో అనుసరించాల్సిన వ్యూహంపై మార్గనిర్దేశం చేస్తున్నారు. మల్కాజిగిరి స్థానాన్ని వశం చేసుకోవడం ద్వారా రేవంత్‌పై పైచేయి సాధించాలని, తద్వారా ఆయనను రాజకీయంగా ఇరుకున పడేయాలని గులాబీ నాయకత్వం భావిస్తోంది. కష్టకాలంలో పార్టీని వీడిన సునీత, రంజిత్, దానంలను ఓడించడం ద్వారా పీసీసీ చీఫ్‌ను ఇరకాటంలోకి నెట్టవచ్చని అంచనా వేస్తోంది.

రాత్రంతా వ్యాపారం చేసుకోవచ్చు: నగర సీపీ

చార్మినార్: రంజాన్ మాసంలో రాత్రంతా వ్యాపారాలు కొనసాగించుకోవచ్చునని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యతో కలిసి ఆయన పాతబస్తీలో పర్యటించారు. మదీనా నుంచి కాలినడకన చార్మినార్ వరకు వెళుతూ స్థానికులను మర్యాదపూర్వకంగా పలకరించారు. వ్యాపారాలు ఎలా కొనసాగుతున్నాయని చిరువ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. కొందరికి రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. మదీనా, పత్తర్‌గట్టి, మీరాలంమండీ, గుల్జార్‌హౌజ్, చార్‌కమాన్ మీదుగా చార్మినార్ వరకు చేరుకుని దారి మధ్యలో ట్రాఫిక్, శాంతి భద్రతలను పర్యవేక్షించారు. సంబంధిత అధికారులను బందోబస్తుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చార్మినార్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. రంజాన్ మాసం ముగిసేంత వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా రాత్రంతా వ్యాపారాలను కొనసాగించుకోవచ్చునన్నారు. జేబుదొంగల పట్ల వినియోగదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మార్కెట్ సందర్భంగా పర్యాటకులు, సాధారణ ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు జరిగాయన్నారు. ఆయన వెంట టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ శ్రీనివాస్ దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్, చార్మినార్ ఏసీపీ పి.చంద్రశేఖర్, చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



అక్రమాల డొంక!

- 1999లో పని చేస్తే 2021లో ఫలితం దక్కింది!
- ఎస్పీగా ఎం.వెంకటేశ్వర్లు పదోన్నతి అక్రమమే
- జీవో నెం.280కి విరుద్ధంగా నాటి డీపీసీ నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర పోలీసు విభాగంలో యాగ్జిలేటెడ్ పదోన్నతుల్లో అక్రమాల డొంక కదులుతోంది. ఓ డీఎస్పీ లిఖిత పూర్వకంగా చేసిన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేస్తున్న ఉన్నతాధికారులు కొన్ని అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఫోన్ ట్యాపింగ్‌లో కీలక పాత్రధారిగా ఉండి అరెస్టు అయిన డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు, హైదరాబాద్ మధ్య మండల డీసీపీగా పని చేస్తూ గత ఏడాది నవంబర్ 29న ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సస్పెండ్ అయిన ఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు పేరు సైతం అక్రమ పదోన్నతులు పొందిన అధికారులు జాబితాలో ఉన్నారు. వీరితో పాటు మరో ఇద్దరు డీఎస్పీల వ్యవహారంపై ప్రస్తుతానికి విచారణ జరుగుతోందని, భవిష్యత్తులో మరిన్ని పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. ఉగ్రవాద, మావోయిస్టు వ్యతిరేక నిఘా, ఆపరేషనల్ విభాగాల్లో పని చేసే అధికారులకు ప్రోత్సాహకంగా ఉండటానికి, ఈ వింగ్స్‌లోకి ప్రతిభ ఉన్న వారిని ఆకర్షించడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2002 సెప్టెంబర్ 17న యాగ్జిలేటెడ్ పదోన్నతులకు అవకాశం కల్పిస్తూ జీవో నెం.280 జారీ చేసింది. ఈ పదోన్నతులు ఎవరికి ఇవ్వాలి? వారికి ఉండాల్సిన అర్హతలు ఏంటి? తదితర అంశాలు ఇందులో స్పష్టంగా పేర్కొంది. వీటికి విరుద్ధంగా నలుగురు అధికారులకు పదోన్నతులు వచ్చాయంటూ డీఎస్పీ స్థాయి అధికారి ఈ నెల 7న డీజీపీగా ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఇందులోని అంశాలను పరిగణనలోకి తీసుకున్న పోలీసు విభాగం లోతుగా విచారణ చేస్తోంది. 2018 నుంచే ఈ అక్రమ పదోన్నతులు ఎక్కువగా జరిగాయని ఫిర్యాదిగా డీఎస్పీ లిఖిత పూర్వకంగా పేర్కొన్నారు.

ఆద్యంతం అతిక్రమణలు.. ఉల్లంఘనలు...

యాగ్జిలేటరీ పదోన్నతులపై మార్గదర్శకాలతో కూడిన జీవో నెం.280కి విరుద్ధంగా ఉన్న అంశాలను ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. ఉమ్మడి, తెలంగాణ రాష్ట్ర పోలీసు విభాగం కేవలం డీఎస్పీ ర్యాంక్ వరకు మాత్రమే యాగ్జిలేటరీ విధానంలో పదోన్నతులు కల్పిస్తూ వచ్చింది. అయితే ఎం.వెంకటేశ్వర్లు విషయంలో మాత్రం దీన్ని తుంగలో తొక్కుతూ, డబుల్ ప్రమోషన్ ఇచ్చారు. 1999లో సిద్దిపేట రూరల్ ఠాణాలో 28/1999 క్రైమ్ నెంబర్‌తో నమోదైన కేసును పరిగణనలోకి తీసుకున్నారు. అక్కడ ఎస్సైగా పని చేస్తూ వెంకటేశ్వర్లు చేసిన సేవల్ని గుర్తిస్తూ ఆయనకు అదనపు ఎస్పీ నుంచి ఎస్పీగా పదోన్నతి ఇచ్చేశారు. దీనికి సంబంధించి 2021 డిసెంబర్ 22న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయనకు పనితీరును పరిగణలోకి తీసుకోవడానికి 22 ఏళ్లు ఎందుకు పట్టిందనేది అంతుచిక్కని విషయం. అలాగే ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న సీహెచ్.రఘునందన్‌రావుపై ఆదిలాబాద్ కోర్టులో ఆజాద్ ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన కేసు విచారణలో ఉండగా.. దాన్ని పక్కన పెట్టి మరీ 2018లో డీఎస్పీగా యాగ్జిలేటరీ పదోన్నతి ఇచ్చారు. 2019, 2023ల్లో ఇన్‌స్పెక్టర్ నుంచి డీఎస్పీగా ప్రమోషన్ పొందిన ఎ.సంపత్‌రావు, దుగ్యాల ప్రణీత్‌రావు వ్యవహారాలు అక్రమమే అంటూ సదరు డీఎస్పీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఉన్నతాధికారులకు ప్రాథమిక ఆధారాలు లభించినట్లు తెలిసింది.

ఆ డీపీసీల నిర్ణయాలపై సమీక్ష..

ఈ పదోన్నతులన్నీ డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్స్ కమిటీ (డీపీసీ) ఆధ్వర్యంలో జరుగుతాయి. అప్పట్లో పని చేసిన డీపీసీలు నిబంధనలు పట్టించుకోకపోవడం వెనుక ఉన్న కారణాలను అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రణీత్‌రావుకు పదోన్నతి ఇచ్చే సందర్భంలో డీపీసీ నిర్ణయాన్ని ఓ ఉన్నతాధికారి తప్పుపట్టారు. దీంతో ఆ ప్రక్రియ వాయిదా పడింది. కొన్నాళ్లకు ఆయన విదేశాలకు వెళ్లగా.. మరోసారి సమావేశమైన డీపీసీ ప్రణీత్ ఫైల్ క్లియర్ చేసిందని విచారణలో అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ విచారణ పూర్తయిన తర్వాత వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. ఇటీవల తెరపైకి వచ్చిన ఎస్ఐబీ కేంద్రంగా సాగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫిర్యాది, నిందితుడూ యాగ్జిలేటరీ పదోన్నతుల జాబితాలో ఉన్నారు. దీనిపై పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసిన అదనపు ఎస్పీ డి.రమేష్, నిందితుడిగా ఉండి అరెస్టు అయిన అదనపు ఎస్పీ నాయిని భుజంగరావులకు యాగ్జిలేటరీ పదోన్నతులు ఇవ్వాలని గతేడాది జాబితాలో చేర్చారు. అయితే డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో మారిన పరిణామాలతో ఈ లిస్ట్ మూలనపడింది.

బల్కంపేట ఎల్లమ్మకు నీతా అంబానీ పూజలు



ఎల్లమ్మ సన్నిధిలో నీతా అంబానీ

అమీర్‌పేట: ప్రముఖ పారిశ్రామిక వేత్త ముఖేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆమెను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరిగిన హైదరాబాద్–ముంబై ఐపీఎల్ మ్యాచ్‌ను తిలకించేందుకు వచ్చిన నీతా అంబానీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం స్టేడియానికి వెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కుంట నాగరాజు, చైర్మన్ సాయిబాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌తో విడదీయరాని అనుబంధం

మాజీ క్రికెటర్ కపిల్ దేవ్



ఆర్ట్‌షోను తిలకిస్తున్న కపిల్ దేవ్

బంజారాహిల్స్: తనకు హైదరాబాద్ నగరంతో ఎంతో అనుబంధం ఉందని, ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయని టీం ఇండియా మాజీ సారథి, లెజెండరీ క్రికెటర్ కపిల్ దేవ్ అన్నారు. బుధవారం ఆయన బంజారాహిల్స్‌లోని పార్క్‌హయాత్ హోటల్‌లో ఖుషి (కిన్‌షిప్ ఫర్ హ్యూమానిటేరియన్ సోషల్ అండ్ హోలిస్టిక్ ఇంటర్వెన్షన్ ఆన్ ఇండియా) స్వచ్ఛంద సంస్థ, ఎస్ఏఆర్ ఇన్‌ఫ్రా సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇండియా ఆన్ కాన్వాస్ అనే ఆర్ట్ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా కపిల్ దేవ్ మాట్లాడుతూ... మనం ఆనందంగా ఉండటంతో పాటు తోటి వారిని కూడా ఆనందంలో ఉంచినప్పుడు మరింత ఆనందంగా ఉండగలుగుతామన్నారు. తమ ఖుషి సంస్థ ద్వారా 20 ఏళ్లలో 2 లక్షల మందికిపైగా విద్యార్థులకు విద్య, వైద్య రంగాల్లో సహాయం అందించగలిగామన్నారు. ఆర్ట్ ఎగ్జిబిషన్ ద్వారా సేకరించిన నిధులను చిన్నారుల ఆరోగ్యం, విద్య కోసం వినియోగిస్తామన్నారు. 1970–80 ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న పార్క్‌హయాత్ ప్రాంతంలో రాత్రి పూట హైనాలు తిరుగుతుండేవని కానీ ఇప్పుడు నగరం మొత్తం మారిపోయిందని ఎక్కడ చూసినా ఎత్తైన భవంతులు కనిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఇన్‌ఫ్రా డైరెక్టర్ పార్వతిరెడ్డి, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, కంట్రీక్లబ్ డైరెక్టర్లు వరుణ్‌రెడ్డి, సిద్దార్థ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరుకున్న బైక్ చోరీ!

- కష్టమర్లకు నచ్చిన సీసీ, కలర్ పల్సర్ బైక్‌ల దొంగతనం
- ఆన్‌లైన్‌లో విక్రయాలు
- ఐదు రోజులకొకటి చొప్పున 18 బైక్‌ల అపహరణ
- స్థానికంగా విక్రయిస్తే దొరికిపోతామని పక్క రాష్ట్రాల్లో విక్రయం
- ఎల్బీనగర్ పోలీసులకు చిక్కిన పల్సర్ స్పెషలిస్ట్ భరత్



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

సాక్షి, సిటీబ్యూరో/నాగోలు: షోరూమ్‌లో మనకు నచ్చిన కలర్, సీసీ బైక్‌ను ఎలాగైతే కొనుగోలు చేస్తామో.. అచ్చం అదే తరహాలో కష్టమర్లు కోరుకున్న పల్సర్ బైక్‌ను చోరీ చేయడం భరత్ కుమార్ స్పెషాలిటీ. ఈ అంతర్రాష్ట్ర ఆటో మొబైల్ చోరుడితో పాటు కొట్టేసిన బైక్‌లను విక్రయిస్తున్న మరో నిందితుడి ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.18 లక్షలు విలువ చేసే 18 పల్సర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ) సుధాకర్ బుధవారం కేసు వివరాలు వెల్లడించారు..

◆ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మల్లె భరత్ కుమార్ కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. మద్యానికి బానిసైన అతను ఇళ్లల్లో చోరీలు, ఆటో మొబైల్ దొంగతనాలకు పాల్పడేవాడు. ఇప్పటివరకు ఇతనిపై ప్రొద్దుటూరు పీఎస్‌లో పోక్సో కేసు, ఖాజీపేట పీఎస్‌లో 9 హెచ్‌బీ నైట్ చోరీ కేసులు, బద్వేల్ ఠాణాలో 4 మోటార్ సైకిల్ దొంగతనాల కేసులున్నాయి. ఇటీవల బద్వేల్ సబ్ జైలు నుంచి విడుదలయ్యాక హైదరాబాద్‌లోని మలక్‌పేటకు మకాం మార్చాడు.

◆ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన భరత్ అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఫేస్‌బుక్‌లో సంగారెడ్డి జిల్లాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వలిమోని చిన్నయ్య అలియాస్ కిట్టుతో పరిచయం అతడికి ఏర్పడింది. అతను సెకండ్ హ్యాండ్ బైక్‌లు విక్రయిస్తుంటాడు. దీంతో ఇరువురు కలిసి బైక్ చోరీ, విక్రయాలను ప్రారంభించారు. హ్యాండిల్ లాక్ వేసి ఉన్న బైక్‌ను కూడా సునాయసంగా తీయడంలో భరత్ దిట్ట. ఇళ్ల ముందు, కాలనీలు, సందులలో పార్కింగ్ చేసిన వాహనాలను చోరీ చేసే భరత్ వాటిని కొన్నాళ్లపాటు మలక్‌పేటలోని తన ఇంటికి సమీపంలో దాచిపెట్టేవాడు.

నగరంలో విక్రయిస్తే దొరికిపోతామని..


చోరీ చేసిన బైక్‌లను రూ.20 వేలు కమీషన్‌తో పార్టనర్ వలిమోని చిన్నయ్యకు విక్రయించేవాడు. ఇతను ఓఎల్ఎక్స్ తదితర ఆన్‌లైన్ మాధ్యమాలలో వీటిని పెడతాడు. అయితే హైదరాబాద్‌లో విక్రయిస్తే పోలీసులకు దొరికిపోతామని భావించిన చిన్నయ్య.. తెలివిగా వీటిని సంగారెడ్డి, నారాయణపేట వంటి ఇతర జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర వంటి సరిహద్దు రాష్ట్రాల్లో మరో రూ.20 వేలు కమీషన్‌తో విక్రయించేవాడు. బహిరంగ మార్కెట్‌లో రూ.లక్ష విలువైన పల్సర్ బైక్‌ను రూ.40–50 వేలకు విక్రయిస్తుండటంతో విద్యార్థులు, ఉద్యోగులు వీరి నుంచి ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

ఐదు రోజులకొక బైక్ చోరీ..

ఇప్పటివరకు ఈ ముఠాపై సైబరాబాద్‌లో ఒకటి, హైదరాబాద్‌లో 7, రాచకొండలో 10 కేసులున్నాయి. ఐదు రోజులకొకటి చొప్పున ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 18 పల్సర్ బైక్‌లను చోరీ చేశారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని డీవీఎం కాలేజీ సమీపంలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 18 పల్సర్ బైక్‌లతో పాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలోని రూ.22 వేల నగదును ఫ్రీజ్ చేశారు.

బ్లేడ్‌తో పబ్లిక్‌లో న్యూసెన్స్ చేసిన వ్యక్తికి జైలు

మేడ్చల్: చేతిలో బ్లేడు పట్టుకుని ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తికి మేడ్చల్ న్యాయస్థానం 21 నెలల జైలు శిక్ష విధించింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మార్కండేయ నగర్ లో మొగులప్ప అనే వ్యక్తి గత సంవత్సరం మార్చి 1 న చేతిలో బ్లేడ్ పట్టుకుని తన శరీరంపై గాటు వేసుకుంటూ డబ్బులు ఇవ్వాలని లేని పక్షంలో దాడి చేస్తానని ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి రమేష్ మొగులప్పకు 21 నెలల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు.



కుమార్తెపై లైంగిక దాడికి తండ్రి యత్నం

నిందితుడి అరెస్ట్

ఫిలింనగర్: కన్నకూతురిపై తండ్రి లైంగికదాడికి యత్నించిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బస్తీలో నివసించే దినసరి కూలీ(38) మద్యానికి బానిసయ్యాడు. భార్య సంపాదనపై ఆధారపడిన అతను ఇంటి వద్దనే ఉంటూ ఆవారాగా తిరుగుతున్నాడు. బుధవారం స్కూల్ నుంచి వచ్చిన తన కుమార్తెను(07) దగ్గరకు రమ్మని పిలిచి మద్యం మత్తులో లైంగికదాడికి యత్నించాడు. దీంతో భయాందోళనకు గురైన చిన్నారి తండ్రి నుంచి తప్పించుకుని రోడ్డు పైకి పరుగులు తీసింది. అప్పుడే పని ముగించుకుని ఇంటికి వస్తున్న తల్లి ఏమి జరిగిందని ఆరా తీయగా అసలు విషయం చెప్పింది. దీంతో ఆమె ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మియాపూర్ : మియాపూర్ ప్రశాంత్ నగర్‌లోని శ్రీ సీతారామాంజనేయ దేవాలయంలో శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచి సుప్రభాత సేవ, ద్వారతోరణ, కుంభారాధన, చతుష్టార్చన, వేదవిన్నపాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి యంత్ర విగ్రహ విమాన శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరిసర కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

జంటపై దౌర్జన్యం.. సుమోటోగా కేసు నమోదు

చార్మినార్: రంజాన్ మార్కెట్ సందర్శనకు వచ్చిన ఓ గుర్తుతెలియని కుటుంబంపై మక్కా మసీదు గ్రానైట్ రోడ్డులో అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించిన సంఘటనపై సుమోటో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ తెలిపారు. రెండు రోజుల క్రితం ఓ మహిళ తన భర్తతో పాటు చిన్నారిని ఎత్తుకుని రంజాన్ మార్కెట్‌ను సందర్శించింది. మక్కా మసీదు రోడ్డులోని ఫుట్‌పాత్ వద్ద కొంత మంది ఆకతాయిలు వీరిని అడ్డుకుని అన్యమతస్తురాలిని ఎందుకు వివాహం చేసుకున్నావని దూషించి దౌర్జన్యానికి దిగారు. తన భర్తను కొట్టవద్దని వెంట ఉన్న భార్య బతిమిలాడినా పోకిరీలు వదిలి పెట్టలేదు. అందరూ చూస్తుండగా ఈ దౌర్జన్యం కొనసాగింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వెంటనే స్పందించిన దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు చార్మినార్ పోలీసులు సుమోటో కేసు నమోదు చేసుకుని సాంకేతిక ఆధారాలతో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఎలాంటి ఫిర్యాదు లేనప్పటికీ..4 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు నిందితులను గుర్తించినట్లు సమాచారం.

ఫొటో జర్నలిస్టులపై దాడులు అమానుషం



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఫొటో జర్నలిస్టులు

హిమాయత్‌నగర్: విధి నిర్వహణలో ఉన్న ఫొటో జర్నలిస్టులపై దాడి పత్రికా స్వేచ్ఛపై దాడి అని రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.హరి అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా ఢిల్లీ వీధుల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యకర్తలు చేస్తున్న నిరసనలను కవర్ చేసేందుకు వెళ్లిన ఫొటో జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసులు అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరచడం అమానుషమన్నారు. దీనిని తెలంగాణ రాష్ట్ర ఫొటోజర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం దేశోద్ధారక భవన్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి కె.అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నక్క శ్రీనివాస్, ఎం.డి.అలీముద్దీన్ నేతలు జి.బాలస్వామి, సయీద్ మజార్, ఇ.జనార్దన్‌రెడ్డి, రామకష్ణ, పిప్పళ్ల వెంకటేష్, సురేష్ రెడ్డి, ఇ.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

భార్యను కొట్టి చంపిన భర్త



అస్మా ఫాతిమా మృతదేహం

జియాగూడ: మద్యం తాగేందుకు డబ్బులు కావాలంటూ భార్యతో గొడవ పడి విచక్షణ రహితంగా కొట్టడంతో ఆమె మృతిచెందిన సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామస్వామి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పన్నీపురా గుల్షన్ రసూల్ కాలనీలో అస్మా ఫాతిమా, సయ్యద్ అబ్దుల్ సలీమ్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి నలుగురు సంతానం. సయ్యద్ అబ్దుల్ సలీమ్ సెంట్రింగ్ పని చేసేవాడు. మద్యానికి బానిసైన అతను డబ్బుల కోసం తరచూ భార్యపై దాడి చేసేవాడు. మంగళవారం రాత్రి సలీమ్ మద్యం తాగేందుకు డబ్బులు కావాలని భార్యతో గొడవకు దిగాడు. అస్మా ఫాతిమా డబ్బులు ఇవ్వకపోవడంతో ఆగ్రహానికి లోనైన అతను ఆమెను తీవ్రంగా కొట్టడమేగాక గోడకు తోసివేయడంతో అస్మా ఫాతిమా అపస్మారక స్థితికి చేరుకుంది. పక్క ఇంట్లో ఉంటున్న ఆమె సోదరి రిజ్వానా ఫాతిమాను ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. బుధవారం మధ్యాహ్నం అస్మా ఫాతిమా సోదరుడు సయ్యద్ అంజాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

‘ఫెడెక్స్’ ఎలాంటి వివరాలూ అడగదు

సైబర్ నేరగాళ్లకు వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దు

సాక్షి, సిటీబ్యూరో: ‘ఫెడెక్స్’ సంస్థ నుంచి వచ్చిన కొరియర్‌లో నిషేధిత ఉత్పత్తులు, మాదకద్రవ్యాలు ఉన్నాయంటూ జరుగుతున్న సైబర్ మోసాలపై ఆ సంస్థ స్పందించింది. కొరియర్‌లో నిలిచిపోయిన వస్తువులపై ఫోన్ కాల్, ఈ–మెయిల్‌లో కస్టమర్ల నుంచి ఎలాంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వాలని కోరదని ఫెడెక్స్ కంపెనీ బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించకూడదని, ఎలాంటి సమాచారాన్ని అందించకూడదని సూచించింది. ఒకవేళ ఎవరైనా ఫెడెక్స్ పేరుతో అనుమానాస్పద కాల్స్ చేస్తే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో లేదా సైబర్ క్రైమ్ విభాగం అధికారులను సంప్రదించాలని కోరింది.

వృద్ధురాలి కిడ్నాప్..

బంగారు ఆభరణాలు లాక్కుని పరార్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాములు

కుత్బుల్లాపూర్: ఓ వృద్ధురాలిని కిడ్నాప్ చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను లాక్కుని పరారైన దంపతులను పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో ఏసీపీ రాములు, సీఐ విజయవర్ధన్, డీఐ నరసింహరాజు వివరాలు వెల్లడించారు. బొడ్డుప్పల్‌కు చెందిన దండుగల మల్లేష్, లక్ష్మి దంపతులు కూరగాయల వ్యాపారం చేసేవారు. తాగుడుకు బానిసలైన వీరు సులభంగా డబ్బులు సంపాదించాలని పథకం వేశారు. ఈ నెల 22న ఒమినీ వ్యాన్‌లో జయరామ్‌నగర్‌లోని కల్లు కాంపౌండ్‌కు వచ్చిన వారు కల్లు సేవిస్తున్న వృద్ధురాలు భూదేవిని వ్యాన్‌లో ఎక్కించుకుని జవహర్‌నగర్‌లోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లారు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు చెవి దిద్దులు, ముక్కు పుడక, కాళ్ల కడియాలు లాక్కుని అక్కడినుంచి పరారయ్యారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పేట్‌బషీరాబాద్ పోలీసులు జయరామ్‌నగర్ కల్లు కాంపౌండ్ సమీపంలో సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఒమిని వ్యాన్‌లో వృద్ధురాలిని ఎక్కించుకుని వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. వ్యాన్ నెంబరు ఆధారంగా మల్లేష్, లక్ష్మిలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలతో పాటు వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ రాములు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ విజయవర్ధన్, డీఐ నరసింహరాజు, సిబ్బంది రాజేందర్, గణపతి, కిషోర్‌రెడ్డి, విజయలక్ష్మిలను ఏసీపీ అభినందించారు.

సీఎం రేవంత్ నివాసం వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మధురానగర్ పోలీసులు వేధిస్తున్నారని ఆరోపణలు

బంజారాహిల్స్: మధురానగర్ పోలీసులు అకారణంగా తనను వేధిస్తున్నారంటూ ఓ వ్యక్తి జూబ్లీహిల్స్ లోని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 24 ఓ వ్యక్తి ముఖ్యమంత్రి నివాసం వద్దకు వచ్చి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ బ్లేడ్‌తో ఎడమ చేతిని కోసుకున్నాడు. సీఎం భద్రతను పర్యవేక్షించే పోలీసులు అతడి అడ్డుకునేందుకు యత్నించగా మెడ కోసుకుంటానని బెదిరించాడు. అతడికి నచ్చచెప్పిన పోలీసులు బ్లేడ్ లాక్కుని అతడిని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో అతను కార్మికనగర్‌కు చెందిన మోరెడ్డి నాగార్జునరెడ్డి అని తేలింది. మధురానగర్ ఎస్ఐ బాలరాజు, కానిస్టేబుల్ గోపి ఓ సెల్ ఫోన్ చోరీ కేసులో అతడిని విచారణ నిమిత్తం స్టేషన్‌కు పిలిపించారు. దీంతో పోలీసుల వేధింపులు ఆపాలని కోరుతూ నాగార్జునరెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తేలింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతాలకతీతంగా పార్టీ టికెట్‌ల కేటాయింపు

ఏఐఎంఈపీ తొలి జాబితా విడుదల



వివరాలు వెల్లడిస్తున్న నౌహీరా షేక్ తదితరులు

లక్డీకాపూల్ : పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని స్థానాల నుంచి పోటీ చేస్తున్నట్లు ఆల్ ఇండియా మహిళా ఎంపవర్మెంట్ (ఏఐఎంఈపీ) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు నౌహీరా షేక్ ప్రకటించారు. బుధవారం సోమాజిగూడలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకుడు జాన్ మస్క్ తో కలిసి తొలి జాబితాను విడుదల చేశారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి తాను బరిలోకి దిగనున్నట్లు తెలిపారు. చేవెళ్ల నుంచి ఇమామ్ హుస్సేన్, వరంగల్ నుంచి నవ్య, ఖమ్మం నుంచి శామ్యూల్, మెదక్ నుంచి రామ్‌చందర్ బరిలో ఉంటారన్నారు. మతాలకతీతంగా ఆధ్యాత్మిక చింతనలో కొనసాగుతున్న వ్యక్తులకు పార్టీ నుంచి టికెట్లు ఇస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఇతర పార్టీల తరహాలో ప్రజలను మభ్య పెట్టబోమన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన పరిమితిలోనే అభ్యర్థులు ఖర్చు చేస్తూ ప్రజల్లోకి వెళ్తారన్నారు. సంప్రదాయ రాజకీయాలకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పార్టీలకు అవకాశం ఇవ్వాలని ప్రజలను అభ్యర్థిస్తున్నట్లు నౌహీరా పేర్కొన్నారు.

ఏప్రిల్ 4న సర్ సీవీరామన్ యంగ్ జీనియస్ అవార్డుల ప్రదానం

బంజారాహిల్స్: సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులను ఏప్రిల్ 4న ప్రదానం చేయనున్నట్లు సుచరిండియా ఫౌండేషన్ నిర్వాహకుడు కిరణ్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రముఖ సామాజిక సేవా సంస్థ సుచిరిండియా ఫౌండేషన్ 31వ సర్ సీవీరామన్ టాలెంట్ సెర్చ్ పరీక్షను జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ పాఠశాలల్లో నిర్వహించిందన్నారు. 1500 పాఠశాలల నుంచి లక్ష మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఏప్రిల్ 4న శ్రీనగర్‌కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో నిర్వహించనున్న కార్యక్రమంలో 16 మందికి గోల్డ్ మెడల్స్, మరో 16 మందికి రాష్ట్ర స్థాయి, 396 మందికి జిల్లా స్థాయి, 8 మందికి ఛత్రలయా పురస్కార్ అవార్డ్స్, ఎనిమిది మందికి గురుబ్రహ్మ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

దానం విజయం కోసం కృషి



దానంను అభినందిస్తున్న భవానీశంకర్

ఫిలింనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపే లక్ష్యంగా ఈ ఎన్నికల్లో పనిచేస్తామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు భవానీశంకర్ అన్నారు. బుధవారం నాగేందర్‌ను ఆయన నివాసంలో పెద్ద సంఖ్యలో విచ్చేసిన యువకులతో కలిసి భవానీశంకర్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్ద ఎత్తున ఎంపీ సీట్లను గెలుచుకోబోతుందని, సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నాగేందర్‌తో కలిసి ప్రచారంలో ముమ్మరంగా పాల్గొంటామని పేర్కొన్నారు.

ఇందిరానగర్‌లో నీటి ఎద్దడిపై స్పందించిన కార్పొరేటర్



ఇందిరానగర్‌లో పర్యటిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని ఇందిరానగర్‌లో బస్తీవాసులు మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ బుధవారం జలమండలి మేనేజర్ రాంబాబుతో కలిసి పర్యటించారు. స్థానికంగా మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని బస్తీవాసులు తన దృష్టికి తీసుకురాగా, వెంటనే ఇక్కడ పర్యటిస్తున్నానని, జీఎం హరిశంకర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. రోజువిడిచి రోజు నీళ్లు ఇవ్వాల్సి ఉండగా జాప్యం జరుగుతున్నదని, నీళ్లు వదిలినప్పుడు ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య వచ్చేలా చూడాలని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అక్కడే ఉన్న జలమండలి అధికారులకు కార్పొరేటర్ సూచించారు. త్వరితగతినే ఈ సమస్యను పరిష్కరిస్తామని రాంబాబు హామీ ఇచ్చారు.

బోరబండలో గంజాయి విక్రేత అరెస్టు



ఫొటో: 27జెబిబి05: పోలీసుల అదుపులో గంజాయి విక్రేత

రహమత్‌నగర్: గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అమీర్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ సత్యనారాయణ సమాచారం మేరకు... బుధవారం బోరబండ బస్ స్టాప్ తమ సిబ్బంది రూట్ వాచ్ నిర్వ హిస్తుండగా మధ్య ప్రదేశ్‌కు చెందిన ప్రహ్లాద్‌గుప్తా అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో సోదా చేయగా అతని వద్ద 5 కేజీల ఎండు గంజాయి లభించింది. గంజాయితో పాటు మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రహ్లాద్‌గుప్తాను రిమాండ్‌కు తలరించామని ఎక్సైజ్ ఎస్‌ఐ పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ మాధవరెడ్డి, గోపాల్ తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



అదృశ్యమైన మహిళ

రహమత్‌నగర్: వైద్యం కోసం వచ్చిన ఓ మానసిక మహిళా రోగి అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్‌కు చెందిన లక్ష్మీ(36)కి కొంత కాలంగా మానసిక పరిస్థితి సరిగా లేదు. ఈ క్రమంలో చికిత్స నిమిత్తం సోదరుడు సాయికుమార్‌తో కలిసి మంగళవారం ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయానికి వచ్చింది. సాయికుమార్ మందులు తీసుకునే క్రమంలో జ్యోతి కనిపించకుండా పోయింది. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించనందున సాయికుమార్ బుధవారం బోరబండ పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇనగంటి భుజంగరావుకు నివాళి



భుజంగరావు (ఫైల్)

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రప్రథమ సెక్రటరీ ఇనగంటి భుజంగరావుకు సొసైటీ సభ్యులు అశ్రునయనాలతో శ్రద్ధాంజలి ఘటించారు. 1986 నుంచి 1997 వరకు సెక్రటరీగా విధులు నిర్వర్తించిన ఆయన జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ అభ్యున్నతికి చేసిన సేవలను వారు కొనియాడారు. మార్చి 23న అమెరికాలోని డల్లాస్ నగరంలో ఆయన స్వర్గస్తులైనట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. ఇనగంటి భుజంగరావు జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీకి కూడా సెక్రటరీగా పనిచేశారు.

సందడిగా ఫ్యాషన్ షో



హాజరైన రౌనక్ యార్ ఖాన్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-25లోని మై స్కూల్ ఇటలీ నేచర్స్ క్యాంప్‌లో జరిగిన ఫ్యాషన్ షో అసఫ్ జాహీ రాజవంశం ద్వారా అభిషిక్తుడైన రౌనక్ యార్ ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి, తల్లి, శిశు సంరక్షణ నిపుణురాలు దివ్యత పాల్గొన్నారు. తల్లులు, వారి పిల్లలు అత్యంత ఆకర్షణీయమైన వేషధారణతో ర్యాంప్ వాక్ చేస్తూ ప్రత్యేక ఫ్యాషన్ షోలో ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నారు. ట్రెండీ నుంచి హాలోవీన్ స్టైల్ స్పూకీ లాంటి వైవిధ్యమైన స్టైల్స్‌తో ఈ ఫ్యాషన్ షో అదరహో అనిపించింది. యువ భారత నాట్య నృత్యకారుల ప్రదర్శన మరింతగా ఆకట్టుకుంది. ఫ్యాషన్ షోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి, ప్రదర్శనను విజయవంతం చేయడంలో పాల్గొన్న మేకప్ కళాకారులకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులను ప్రోత్సహించేందుకే ఏర్పాటు చేసినట్లు రౌనక్ తెలిపారు.

ఓటర్లను చైతన్యవంతం చేయాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం
- అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలి
- అధికారులతోపాటు వివిధ సంఘాల వారు భాగస్వామ్యం కావాలి
- ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జెడ్‌సీ హేమంత్ బోర్కాడే

బంజారాహిల్స్: ఓటరు నమోదుకు ఇంకా అవకాశం ఉందని, వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతున్న నేపథ్యంలో అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించే క్రమంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే తెలిపారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గం రాజకీయ పార్టీల సమావేశం బుధవారం ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.
- ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ... కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నదని, రోజువారీ రిపోర్టులు తెప్పించుకుంటున్నామని, అందుకు సంబంధించిన దరఖాస్తుల వివరాలను పొలిటికల్ పార్టీల ప్రతినిధులకు అందజేశారు.
- మే 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియకు ముందువరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.
- అర్హులైన వారందరినీ చేర్పే క్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు బీఎల్‌ఓలు, మహిళా సంఘాలు, రాజకీయ పక్షాలు, యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాలు, బస్తీ సంఘాలు ముందుకురావాలన్నారు. వచ్చే నెల వరకు 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.
- ఇప్పటికే విడుదలైన తుది జాబితాకు వీరందరి పేర్లు అదనపు జాబితాలో నమోదవుతాయన్నారు. ఇంకోవైపు పార్టీల ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.
- కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారి వివరాలను ఆరా తీశారు. ఏ దరఖాస్తులు ఎన్ని వచ్చాయో అడిగి తెలుసుకున్నారు.
- ఎప్పటికప్పుడు పొలిటికల్ పార్టీల మీటింగ్‌లు నిబంధనల మేరకు నిర్వహిస్తుంటామని వారికి తెలిపారు.

ఇఫ్తార్‌లతో మతసామరస్యం



ఇఫ్తార్ విందులో సీఎన్ రెడ్డి తదితరులు

రహమత్‌నగర్: కుల, మతాలను అతీతంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం సమైక్యతాభావాన్ని చాటుతాయని రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి అన్నారు. తన కార్యాలయంలో ముస్లింలకు బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి చిహ్నమన్నారు.



ఎల్లారెడ్డిగూడలో ఎంఐఎం జూబ్లీహిల్స్ ఇంచార్జ్ అన్వర్ సదాత్

ఎల్లారెడ్డిగూడలో...

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడలో ఎంఐఎం బ్రాంచ్ ప్రెసిడెంట్ షేక్ జాఫర్ ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎంఐఎం జూబ్లీహిల్స్ ఇంచార్జ్ అన్వర్ సదాత్, నేతలు అజహర్, షేక్ అహ్మద్, నదీమ్, సలీమ్, అంజద్, మహబూబ్, ఖలీమ్, నగేష్

ఎన్నికల కోడ్ నోటీసులు

రహమత్‌నగర్: ఎన్నికల కోడ్ ఉన్నందుకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయకూడదని రహమత్‌నగర్ బంగారు మైసమ్మ ఆలయంలో బుధవారం ఉదయం దేవాదాయ శాఖ సిబ్బంది నోటీసులు అతికించారు. దేవాదాయ శాఖ సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది నోటీసులు అంటించారు.

దుర్గాభవానీనగర్ బస్తీ అధ్యక్షుడిగా గౌడ్‌నాయక్



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-5లోని దుర్గాభవానీ బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికలు బుధవారం కోలాహలంగా జరిగాయి. పార్టీలకతీతంగా జరిగిన ఈ ఎన్నికల్లో బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నాయకుణ్ణి ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వి.గౌడ్‌నాయక్ ఘన విజయం సాధించారు. ఆయనపై కృష్ణ, వి.జానీ పోటీ చేసి ఓడిపోయారు. బస్తీ సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలపై స్పందిస్తానని ఈ సందర్భంగా నాయక్ తెలిపారు.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలి
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్



కమిషనర్‌కు చెక్కును అందజేస్తున్న ఐడీపీఎల్ కంపెనీ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: వన్ టైమ్ సర్వీస్ (ఓటీఎస్) ద్వారా కూకట్‌పల్లి ఐడీపీఎల్ కంపెనీ బకాయి ఉన్న రూ. 16 కోట్లకు సంబంధించిన చెక్కును జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు కంపెనీ ప్రతినిధులు బుధవారం అందజేశారు. ఓటీఎస్ ద్వారా ఐడీపీఎల్ సంస్థ బకాయిలు చెల్లించినందుకు కమిషనర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. మిగతా ప్రభుత్వ కంపెనీలు, కార్యాలయాలు, ఆస్తి పన్ను బకాయిదారులు ఓటీఎస్ ద్వారా బకాయిలు మార్చి 31 వరకు చెల్లించి వడ్డీపై 90 శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ బకాయిలను వెంటనే చెల్లించాలని 2023-24 సంవత్సరంలో ఇంటి పన్ను బకాయిలను కూడా చెల్లించవచ్చునని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ఐడీపీఎల్ కంపెనీ ప్రతినిధులు, అడిషనల్ కమిషనర్లు జయరాజ్ కెన్నెడీ, గీతరాధిక, వాల్యుయే

నిర్మాణ పనుల నిలిపివేత

రహమత్‌నగర్: 'సాక్షి' కథనానికి స్పందించిన అధికారులు అక్రమంగా చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని నిలిపివేశారు. వివరాలివీ... 'గుట్టను తొలిచి ఇంటి నిర్మాణాలు' అనే శీర్షికన మంగళవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. బ్రహ్మశంకర్‌నగర్ ఫేజ్-2 (గుంత)కు బుధవారం అధికారులు చేరుకుని శ్రీను అనే వ్యక్తి చేపట్టిన ఇంటి నిర్మాణ పనులను నిలిపివేయించారు. అంతేగాక ఎలాంటి అనుమతి లేకుండా రాక్ గ్యాస్ కట్టర్ యంత్రంతో గుట్టను తొలిచిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

లిబర్టీ: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి శృతి ఓజాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ఇంటర్ బోర్డు నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ముందస్తు అడ్మిషన్లు, వేసవి తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఇంటర్ బోర్డు అధికారులు వెంటనే ప్రైవేటు కార్పొరేట్ జూనియర్ కళాశాలల ఆగడాలను అరికట్టాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రైవేటు కార్పొరేట్ జూనియర్ కళాశాలల ముందు ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని తెలిపారు. కార్యక్రమంలో గ్యార నరేష్, చైతన్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో అడ్మిషన్ల గడువు పొడిగింపు

బంజారాహిల్స్: కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్ణయించిన దరఖాస్తు గడువును మార్చి 29 వరకు పొడిగించారని ఆ యూనివర్శిటీ ప్రతినిధులు తెలిపారు. 2024 అకడమిక్ సెషన్‌లో భాగంగా కేఎల్‌ఈఈఈ, కేఎల్‌శాట్, కేఎల్‌ఈసెట్, కేఎల్ హ్యాట్, కేఎల్‌మ్యాట్ కోర్సుల్లో ప్రవేశాలకై దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు మార్చి 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆయా కోర్సుల ప్రవేశ పరీక్షలు ఈ నెల 30, 31 తేదీల్లో జరుగుతాయని వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు

హిమాయత్‌నగర్: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నగర సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని గౌడ కమ్యూనిటీ హాస్టల్‌లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటీపీ మోసాలు, పెట్టుబడి, ఉద్యోగ మోసాలు, ఫెడెక్స్, సోషల్ మీడియా మోసాలు, ఇతర సైబర్ నేరాలపై ప్రజలు, యువతకు అవగాహన కల్పించారు. ఓటీపీ, డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులకు వెల్లడించవద్దని స్పష్టం చేశారు.

కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ కుట్రలు

లిబర్టీ: ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి మళ్లీ అధికారంలోకి రావాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. మూడోసారి అధికారంలోకి రావాలన్న యోచనతో కేంద్ర ప్రభుత్వం అనేక అడ్డదారులు తొక్కుతుందన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర ఎన్నికల సంఘం సహకారంతో మళ్లీ ఎలాగైనా గద్దెనెక్కాలని బీజేపీ సర్కారు ప్రయత్నిస్తుందన్నారు. అన్ని రాజ్యాంగ స్వాతంత్ర సంస్థలను కేంద్ర ప్రభుత్వం కలుషితం చేసిందన్నారు. ఎన్నికల కమీషన్ తన గుప్పిట్ల పెట్టుకోని ఎలాగైనా 400 సీట్లు లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలని అన్ని ప్రయత్నాలను ప్రారంభించిందని అన్నారు. ఎన్నికలను బ్యాలెట్ ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చర్యలను ప్రజాస్వామిక ఎన్నికల సంస్థలు పెద్ద ఎత్తున గళం వినిపిస్తున్న కేంద్ర ప్రభుత్వంలో మాత్రం మార్పు రాలేదన్నారు. నేతలు ఇటికాల గణేష్, బి.సతీష్, కుమర్, చెంబురెడ్డి పాల్గొన్నారు.

మూడు నెలలుగా పెండింగ్‌లో డ్రైనేజీ పనులు

సత్వరమే పూర్తి చేయాలి: బీఆర్ఎస్ నేత రామన్‌గౌడ్



కింగ్ కోఠి ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న రామన్‌గౌడ్ తదితరులు

హిమాయత్‌నగర్: కింగ్ కోఠి ఆస్పత్రి ఎదురుగా ఉన్న డ్రైనేజీ నుంచి మురుగు నీరు పొంగిపొర్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మూడు నెలలుగా ఈ సమస్యతో అటు ఆస్పత్రికి వచ్చే రోగులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై బీఆర్ఎస్ నాయకుడు రామన్‌గౌడ్ అధికారులను నిలదీశారు. పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జలమండలి అధికారులు ట్రాఫిక్ పోలీసుల అనుమతి పేరుతో పనులు నిలిపివేశారని అన్నారు. దీంతో రామన్‌గౌడ్ బుధవారం జలమండలి, ట్రాఫిక్ పోలీసులతో కలిసి సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పనులు చేసుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ చెప్పడంతో రేపటి నుంచి పనులు ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలియజేసినట్లు రామన్‌గౌడ్ తెలిపారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నూతన డ్రైనేజీ పైప్‌లైన్ కోసం నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నూతన డ్రైనేజీ పైప్ లైన్ పనులను

ఆకట్టుకున్న 'ఎవ్వరిదీ పాపం' నాటకం

ఖైరతాబాద్: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఏజీ ఆఫీసులో తెలుగు నాటక సమితి ఆధ్వర్యంలో ఎవ్వరిదీ పాపం అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఒక ఫ్లాట్‌లో నివశిస్తూ హత్యకు గురైన ఒక ఒంటరి మహిళ చుట్టూ అల్లబడిన కథ ఇది. ఓ ఫిర్యాదు ఆదారంగా పోలీసులు రంగంలోకి దిగి అనుమానితులందర్ని విచారించి కేసును ఛేదించి అసలు నేరస్థుడిని అరెస్ట్ చేయడంతో నాటక ముగుస్తుంది. ఈ నాటకాన్ని పద్మలతా జయరాం రచించగా, మంజునాథ దర్శకత్వం వహించారు.

అనంతరం నటీ నటులకు జ్ఞాపికలను అందజేశారు. తెలుగు నాటక సమితి నేతలు, సభ్యులు బి.వి.వరలక్ష్మి, రాణి, అచ్యుతరావు,



ఎవ్వరిదీ పాపం నాటకంలోని ఓ సన్నివేశం

ఏప్రిల్ 23న వీర హనుమాన్ విజయ యాత్ర



యాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరించిన బజరంగ్ దళ్ నేతలు

- 'హిందూ శక్తి ప్రదర్శన' యాత్రలో లక్షలాదిగా పాల్గొనాలి
- బజరంగ్ దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో హిందువులపై దాడులు పెరిగిపోయాయని.. దాడులు, దౌర్జన్యాలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని బజరంగ్ దళ్ రాష్ట్ర శాఖ హెచ్చరించింది. బుధవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు మాట్లాడారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే వీర హనుమాన్ విజయ యాత్ర వాల్ పోస్టర్, కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఏప్రిల్ 23న భాగ్యనగర్‌లో భారీ ఎత్తున హనుమాన్ జయంతిని నిర్వహిస్తామన్నారు. వీర హనుమాన్ విజయ యాత్ర ర్యాలీలో దాదాపు మూడు లక్షల మంది బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొని హిందూ శక్తి ప్రదర్శన నిర్వహిస్తారని చెప్పారు. భాగ్యనగర్‌తోపాటు, రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో హిందువులపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులను అడ్డుకొని తగిన రీతిలో జవాబు చెప్పేందుకు బజరంగ్ దళ్ సిద్ధంగా ఉందన్నారు. భాగ్యనగరం శివారు ప్రాంతంలోని చెంగిచెర్ల పిట్టల బస్తీలో గిరిజనులపై అల్లరిమూకల దాడిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. సంఘటితమైతేనే హిందూ వ్యతిరేక శక్తులు తోక ముడుస్తాయని, లేదంటే వారి ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతాయని పేర్కొన్నారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగదీశ్వర్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి వీరేశలింగం, బజరంగ్దళ్ నాయకులు పాల్గొన్నారు.

సాహితీ సౌరభాలు వెదజల్లే పుస్తకాలు రావాలి



యక్షగాన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అలేఖ్య పుంజాల తదితరులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్-8లోని సప్తపర్ణి సాంస్కృతిక కళాకేంద్రంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పప్పు వేణుగోపాలరావు రచించిన యక్షగాన గ్రంథాన్ని బుధవారం తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ అలేఖ్య పుంజాల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కూచిపూడి, యక్షగాన ప్రావీణ్యులు పసుమర్తి శేషుబాబు గౌరవ అతిథిగా విచ్చేయగా హైదరాబాద్ యునివర్సిటీ కూచిపూడి నృత్య విభాగం హెడ్ ఆచార్య అనురాధ జొన్నలగడ్డ పుస్తక సమీక్ష నిర్వహించారు. సాహిత్య సౌరభాలు వెదజల్లే ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాల్సిన ఆవశ్యకత ఉందని ఈ సందర్భంగా అలేఖ్య ఆకాంక్షించారు. ఈ పుస్తకం చదువుతుంటే సాహితీ వనంలో ఓలలాడుతున్నట్లు ఉందని అభి

బంజారానగర్‌లో చోరీ

రహమత్‌నగర్: బోరబండ డివిజన్ బంజారానగర్‌లోని ఓ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఈ ఘటనలో రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 9 వేలను దుండగులు ఎత్తుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు... బంజారానగర్‌లో అక్బర్ తన తల్లి దండ్రులతో నివాసముంటున్నాడు. తాను పై గదిలో, తల్లిదండ్రులు కింద పోర్షన్ ఉంటున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం అర్ధరాత్రి తన తల్లింద్రులు నివాసముండే గదిలో ఉంచిన బంగారం, నగదు దొంగతనం జరిగినట్లు అక్బర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీ చేసింది దొంగలా... లేక తెలిసిన వారా అనే కోణంలో విచారణ ప్రారంభించారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో రూ. 17 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: పార్ట్ టైమ్ జాబ్ పేరుతో వివిధ టాస్కులు పూర్తిచేయాలని ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం నగరానికి చెందిన ఓ బాధితుడికి తన టెలిగ్రామ్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో సైబర్ కేటుగాళ్లు బాధితుడిని వాను చెప్పిన వాటికి రేటింగ్ ఇచ్చి, వాటి టాస్క్ పూర్తయిన తర్వాత బాధితుడు కమీషన్ పొందడానికి స్క్రీన్‌షాట్‌ను షేర్ చేయాలన్నారు. వారు చెప్పిన విధంగా చేస్తే ఇంటి వద్దనే ఉంటూ డబ్బు సంపాదించవచ్చని నమ్మించారు. మొదటగా బాధితుడికి రూ. 9810 చెల్లించారు. తర్వాత బాధితుడిని పెట్టుబడి పెట్టమని ఒత్తిడి చేసి, పెట్టుబడి పెట్టిన అనంతరం వివిధ చార్జీల పేరుతో రూ. 17,90,880 కాజేశారు. ఆ డబ్బు విత్ డ్రా చేసుకోవడం వీలుకాకపోవడంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివ మారుతి తెలిపారు.

కరడుగట్టిన దోపిడీ దొంగ అరెస్టు

మరో ఇద్దరు కూడా..

పంజగుట్ట: కరడుగట్టిన దోపిడీ దొంగను పంజగుట్ట పోలీసుల సహకారంతో వెస్ట్‌జోన్ టాస్క్ ఫోర్స్ టీమ్ పట్టుకుంది. నిందితుడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ రాజు కాలనీకి చెందిన దుదాని సాగర్‌సింగ్ (24) గతంలో 16 కేసుల్లో నిందితుడు. మరో మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో దోపిడీకి పాల్పడి తప్పించుకు తిరుగుతున్నాడు. అతనిపై గతంలో పీడీ యాక్ట్ కేసు ఉంది. ఈ క్రమంలో దుదాని సాగర్ సింగ్ తన స్నేహితులైన చెరబండరాజు నగర్‌కు చెందిన సలాంఖాన్, రాజుకాలనీకి చెందిన కొయ్యడ నవీన్‌కుమార్‌లతో కలిసి ఈ నెల 24న అర్ధరాత్రి యాక్టివా బైక్‌పై పంజగుట్ట ప్రాంతానికి వచ్చాడు. పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడ శిశిర ఆస్పత్రి సమీపంలోకి రాగానే బైక్‌పై వెళ్తున్న ఓ మహిళ చేతిలోని బ్యాగ్‌ను లాక్కొని పరారయ్యారు. దీంతో బాధితురాలు పంజగుట్ట పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం సాగర్‌సింగ్ ఓ ఫైనాన్స్ కంపెనీలో బైక్ సీజర్‌గా పని చేస్తున్నాడు. పంజగుట్ట పోలీసుల సహకారంతో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్ నిఘా పెట్టి సాగర్‌సింగ్‌తో పాటు సలాంఖాన్, నవీన్‌కుమార్‌లను అరెస్టు చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: వాకింగ్‌కు వెళ్లి వచ్చేలోగా ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... కార్మికనగర్‌కు చెందిన బి.అశోక్‌కుమార్ ఆఫీస్‌బాయ్‌గా పని చేస్తాడు. ఈ నెల 17న సాయంత్రం యూసుఫ్‌గూడ కృష్ణకాంత్‌పార్క్ వద్ద ద్విచక్ర వాహనం పార్క్ చేసి తిరిగి 8 గంటలకు పార్కు నుంచి బయటకు వచ్చాడు. బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా, తెలిసిన వారిని అడిగినా బండి ఆచూకీ లభించలేదు. మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

వెంగళరావునగర్‌లోని సత్యం ఫుడ్స్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. ఈ సమాచారంతో అక్కడికి వెళ్లిన పోలీసులకు అతను యాచకుడిగా తెలిసింది. అనారోగ్య కారణాల వల్ల మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. అతని ఎత్తు 5.2 అడుగులు, బ్లూ లుంగీ, తెల్ల టీ-షర్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.


ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద సీఎం జగన్. చిత్రంలో వైఎస్ విజయమ్మ తదితరులు


కుమారునిపల్లి వద్ద బస్సులో వెళుతున్న సీఎం జగన్‌కు మోకరిల్లి నమస్కరిస్తున్న అభిమాని

మోసాలు, నేరాలే వారి చరిత్ర

ప్రొద్దుటూరు బహిరంగ సభలో నిప్పులు చెరిగిన సీఎం జగన్

విప్లవాత్మక మార్పులకు మారుపేరుగా ఎక్కడా లంచాలు, వివక్షకు తావు లేకుండా ప్రజల ఎజెండానే జెండాగా వైఎస్సార్‌సీపీ ముందుకెళుతోంది. ఈ జెండా మరో జెండాతో జత కట్టలేదు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మాకు మద్దతుగా సిద్ధం అని ఈ జెండా తలెత్తుకుంది. ప్రజల ఎజెండాగా రెపరెపలాడుతోంది.

పేద ప్రజల అభివృద్ధి కోసం 130 సార్లు బటన్ నొక్కాను. మీరు మే 13వ తేదిన ఫ్యాన్ గుర్తుపై రెండు మార్లు బటన్ నొక్కడంతోపాటు మరో వంద మందికి మన ప్రభుత్వం చేసిన మంచిని వివరించి ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలి. 48 రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో అబద్ధాలు చెప్పేవాళ్లు, మోసం చేసేవాళ్లు మనకు ప్రత్యర్థులు. పేదల వ్యతిరేకులని ఓడించేందుకు మీరంతా సిద్ధమా.. (సిద్ధం అని జనం నినాదాలు) అబద్ధాలు, మోసాలు, కుట్రల కూటమిపై గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. ప్రజలకు మంచి చేయని చంద్రబాబు బృందాన్ని నమ్మితే నట్టేట ముంచడం ఖాయం.

ప్రభుత్వ ప్రయోజనాలు అందుకున్న ప్రతి కుటుంబం స్టార్ క్యాంపెయినర్‌గా బయటికి రావాలి. వారంతా మరో వంద మందికి చెప్పి మీ బిడ్డకు తోడుగా నిలవాలి. 2024 ఎన్నికల్లో 'మన కోసం మనం' ప్రతి ఒక్కరూ రెండుసార్లు ఫ్యాన్ గుర్తుపై నొక్కాలి. అలా నొక్కితేనే చంద్రముఖి బెడద ఉండదు. పొరపాటు జరిగితే చంద్రముఖి లక లక లక అంటూ సైకిల్‌పై వచ్చి టీ గ్లాస్ పట్టుకుని మీ ఇంటిలో రక్తం తాగుతుంది. చంద్రబాబుకు ఓటు వేయడమంటే మన పథకాలు మనమే రద్దు చేసుకోవడం. ఆయన్ను నమ్మడం అంటే మోసం, అబద్ధం, వెన్నుపోటును నమ్మడమే.

- సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప: మోసాలు చేయడం, అబద్ధాలు చెప్పడం, వెన్నుపోటు పొడవడం, కుట్రలు చేయడంలో చంద్రబాబుకు 45 సంవత్సరాల అనుభవం ఉందని.. చేయాల్సిన నేరాలన్నీ చేసేసి నెపం వైఎస్సార్‌సీపీపైకి తోయడంలో ఆయనకు ఎవరూ సాటిలేరని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. తన చిన్నాన్న వివేకానందరెడ్డిని ఎవరు చంపారో, ఎందుకు చంపించారో.. వారితో ఇప్పుడెవరు చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారో అందరికీ తెలుసని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలో పట్టుబడిన డ్రగ్స్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, చంద్రబాబు బంధువులవని తేలినా, ఎల్లో మీడియా సహకారంతో ఆ నెపాన్ని మనపై నెట్టేందుకు క్షణాల్లో రెడీ అయ్యారని మండిపడ్డారు. మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేయడంలో, గోబెల్స్ ప్రచారంలో, కుటుంబాలను చీల్చడంలోనూ చంద్రబాబు అనుభవాన్ని చూస్తున్నామని ధ్వజమెత్తారు. బుధవారం ఇడుపులపాయలో 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్రకు శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్.. ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో అశేష ప్రజానీకాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. 'వివేకానందరెడ్డిని అత్యంత దారుణంగా చంపానని హేయంగా చెప్పుకుని తిరుగుతున్నా ఆ హంతకుడికి మద్దతు ఇస్తూ నేరుగా నెత్తిన పెట్టుకుంటున్నారు చంద్రబాబు, ఎల్లో మీడియా. ఈ హంతకుడికి రాజకీయ కాంక్షతో ఒకరిద్దరు నా వాళ్లు కూడా మద్దతిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిన్నాన్నను ఓడించిన వారితో చెట్టా పట్టాలేసుకుని తిరుగుతున్నారు. వివేకం చిన్నాన్న బతికున్నంత వరకు చంద్రబాబును శత్రువుగా భావించారు. చనిపోయిన తర్వాత శవ రాజకీయాలతో కుట్రలు చేస్తున్నారు. ఎన్టీఆర్ బతికున్నప్పుడు వెన్నుపోటు పొడిచి, చనిపోయిన తర్వాత శవాన్ని లాక్కొని ఊరూరా విగ్రహాలు పెడుతూ దండలు వేస్తున్నారు. నైతిక విలువలు ఎంత దయనీయంగా ఉన్నాయో ప్రజలు ఆలోచించాలి. నన్ను దెబ్బ తీసేందుకే కుట్రలు చేస్తున్నారు. ఇది కలియుగం కాక మరేమిటి? ఎవరెన్ని కుట్రలు పన్నినా నేను మాత్రం ప్రజల పక్షమే. ఆ దేవుడు, ప్రజల్నే నమ్ముకున్నా. ధర్మం, న్యాయాన్ని నమ్ముకున్నా. ప్రజలకు మంచి చేసిన చరిత్ర మనది. వారిలా వంచించిన చరిత్ర మనకు లేదు. మేనిఫెస్టోలో పది శాతం వాగ్దానాలు కూడా చంద్రబాబు నెరవేర్చలేదు. ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతలుగా భావించి, త్రికరణ శుద్ధిగా 99 శాతం వాగ్దానాలను అమలు చేసి నిలబెట్టుకున్న చరిత్ర మన ప్రభుత్వానిది. ఈ తేడాను ప్రజలందరూ గమనించాలి' అని చెప్పారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

వారు చంద్రబాబు వదినమ్మ బంధువులు

- బ్రెజిల్ నుంచి చంద్రబాబు వదిన గారి చుట్టం డ్రై ఈస్ట్ పేరుతో డ్రగ్స్‌ను దిగుమతి చేసుకుంటూ విశాఖపట్నంలో సీబీఐ దాడుల్లో అడ్డంగా దొరికిపోయారు. ఈ ఘటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, చంద్రబాబు బంధువులు దొరికితే చివరికి ఎల్లో మీడియా సహకారంతో ఆ నెపాన్ని మనపైన నెట్టేందుకు శక్తివంచన లేకుండా కష్టపడుతున్నారు. చంద్రబాబు వదినమ్మ, ఆమె కొడుకు, వియ్యంకుడు తదితరులు డైరెక్టర్లుగా వ్యవహరించిన కంపెనీకి సంబంధించిన ఈ వ్యవహారంలో బుకాయిస్తూ మనపై బురదజల్లుతున్నారు.
- 45 సంవత్సరాలుగా క్షుద్ర రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు బంధువులు అడ్డంగా దొరికితే.. వైఎస్సార్‌సీపీ వాళ్లని నీచ రాజకీయాలు చేస్తున్న వాళ్లకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 ఎల్లో మీడియా వంత పాడుతోంది. ఈనాడు పత్రికను చదువుంటే ఛీ ఇదొక పేపరా అనిపిస్తోంది. కేంద్రం నుంచి ఒక పార్టీని పరోక్షంగా, మరొక పార్టీని ప్రత్యక్షంగా తెచ్చుకుని అందరూ కలిసి ఒక్క జగన్‌తో యుద్ధం చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్, జనసేన, టీడీపీ, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, నా ఇద్దరు చెల్లెళ్లు కలిసి నాపై యుద్ధానికి సిద్ధమయ్యారు.
- ఒకే ఒక్కడి మీదకు ఒంటరిగా వచ్చే ధైర్యం ఎవరికీ లేకపోవడానికి కారణం దేవుడి దయ, కోట్లాది మంది ప్రజల గుండెల్లో చోటు ఉండడమే. 75 సంవత్సరాల చంద్రబాబు అధికారం దక్కిన వెంటనే మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేస్తారు. మళ్లీ ఎన్నికల సమయానికి కొత్త మేనిఫెస్టో, కొత్త వాగ్దానాలతో రొటీన్‌గా వంచన చేస్తారు. ఎన్నికల్లో తిట్టిన పార్టీలతోనే ఏమాత్రం సిగ్గు లేకుండా జత కడతారు. ఢిల్లీ దాక వెళ్లి కాళ్లయినా పట్టుకుంటారు. విశ్వసనీయత, విలువలు లేని వీళ్ల రాజకీయాలు ఎవరికి స్ఫూర్తినిస్తాయి?

మంచి చేసి చూపించారు మీ బిడ్డ

- రాష్ట్రంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా సంక్షేమం, అభివృద్ధిని 58 నెలల కాలంలో మీ బిడ్డ చేసి చూపించాడు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామంలో నాలుగు అడుగులు వేసినా సచివాలయ వ్యవస్థ కనిపిస్తోంది. అందులో మన పిల్లలు పది మంది ఉద్యోగం చేస్తుండడం కనిపిస్తోంది. 1వ తేదీ ఇంటి వద్దకు చిక్కటి చిరునవ్వుతో అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు వారి మనవళ్లు విచ్చేసి సెలవు దినమైనప్పటికీ పింఛన్ అందజేస్తుండటమూ కనిపిస్తోంది.
- రూ.3 వేలు పింఛన్ ఇస్తున్న రాష్ట్రం దేశంలోనే ఎక్కడా లేదు. సంవత్సరానికి రూ.24 వేల కోట్లు పింఛన్లకు ఖర్చు చేస్తున్నాం. మన తర్వాతి స్థానంలో తెలంగాణ రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. మిగతా రాష్ట్రాలు రూ.8, 6, 4 కోట్లు ఖర్చు చేస్తున్నాయి. లంచాలు, వివక్షకు ప్రతిరూపాలైన జన్మభూమి కమిటీలు లేనటువంటి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఓటు వేయని వారికి కూడా పథకాలు అందిస్తున్నది మీ బిడ్డ పాలనలోనే సాధ్యమైంది.
- మీ బిడ్డ డీబీటీ ద్వారా బటన్ నొక్కడంతో అక్కాచెల్లెమ్మల ఖాతాల్లో నేరుగా డబ్బు జమ అవుతోంది. రూ.2.70 లక్షల కోట్లు ఖాతాల్లో నేరుగా జమ అయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ, ఐబీ వంటి అంతర్జాతీయ స్థాయి బోధన, ట్యాబ్‌లు, ఐఎఫ్‌బీ, డిజిటల్ బోధన వంటివి ఒక్కసారి పాఠశాలలో కూర్చొని చూస్తే గుర్తుకు వచ్చేది వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. రైతన్నకు తోడుగా నిలిచింది, రైతన్నకు సాయంగా రైతు భరోసా సొమ్మును అందించడం, రైతన్నకు తోడుగా అసైన్డ్ భూములు, 22ఏ భూములపై శాశ్వత భూ హక్కులు అందించడంలో అడుగులు వేగంగా పడ్డాయి.
- ప్రొద్దుటూరు గడ్డపై లక్షల సంఖ్యలో ఉన్న సింహాల గర్జన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఇంతటి గొప్ప సభ గతంలో ఇక్కడ ఎప్పుడూ లేదు. జనసంద్రం కన్పిస్తోంది. దుష్ట చతుష్టయాన్ని నిలువరించడమే లక్ష్యంగా ఎన్నికల సమరంలో పోరాడేందుకు గాండీవంతో అర్జునుడిగా నేను సిద్ధం.. శ్రీకృష్ణులుగా మీరు పాంచజన్యం పూరించేందుకు సిద్ధమా? (ముక్తకంఠంతో మేమంతా సిద్ధమేనని జనం బదులిచ్చారు).

సామాజిక న్యాయానికి పెద్దపీట

- నిరుపేదలకు తోడుగా సామాజిక న్యాయాన్ని చేతల్లో అమలు చేసి చూపిస్తున్న ప్రభుత్వం మనదే. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదలందరికీ కులం, మతం, రాజకీయం చూడకుండా సామాజిక న్యాయం అమలు చేసి చూపెట్టాం. ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి ఎస్సీలను తూలనాడితే వారు ఎలా బతుకుతారు? మైనార్టీల నాలుగు శాతం రిజర్వేషన్లపై చెలగాటమాడితే వారంతా ఎక్కడికి వెళ్లాలి?
- స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో నాలుగు లక్షల ఉద్యోగాలు భర్తీ కాగా, మన ప్రభుత్వం వచ్చిన వెంటనే 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ఈ ఉద్యోగాల్లో 80 శాతం నా.. నా.. నా.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలే ఉద్యోగాలు పొందడం సామాజిక న్యాయం కాదా? రాష్ట్రంలో 31 లక్షల ఇళ్లను అక్కాచెల్లెమ్మల పేరుమీద ఇచ్చాం. ఇందులో 22 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఒక్క ప్రొద్దుటూరులోనే 24 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చింది మీ బిడ్డ వైఎస్ జగనే. ప్రతి అక్క, చెల్లెమ్మకు రూ.5-20 లక్షల వరకు ఆస్తిని ఇంటి రూపంలో ఇస్తోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే.
- అక్కచెల్లెమ్మలకు 50 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చట్టం చేసి సామాజిక న్యాయం అమలు చేశాం. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం తదితర పథకాలన్నీ మహిళా సాధికారతను తీసుకు వచ్చాయి. అక్కాచెల్లెమ్మలు ధైర్యంగా బయటికి వస్తే దిశ యాప్ ఉంది. రక్షణ కోసం గ్రామాల్లో మహిళా పోలీసులను ఏర్పాటు చేశాం.
- గ్రామాల్లో నాలుగు అడుగులు వేయగానే విలేజ్ క్లినిక్ కనిపిస్తుంది. ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష కార్యక్రమాలతో అందరికీ ఉచితంగా పరీక్షలు, మందుల పంపిణీ సాధ్యమైంది. 104, 108 కొత్త అంబులెన్స్‌లు కుయ్... కుయ్ మంటూ సేవలు అందిస్తున్నాయి. దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ పేద ప్రజల కోసం ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంటు పథకాలు తీసుకు రాగా, ఆయన తనయుడిగా మీ బిడ్డ ఆరోగ్యశ్రీని మరింత ఉన్నతీకరించి రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యం అందేలా చేశారు. రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలల ఏర్పాటు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్నాం. 10 షిప్పింగ్ హార్బర్లు నిర్మాణంలో ఉన్నాయి. ఎయిర్‌పోర్టుల విస్తరణపై దృష్టి సారించాం. పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా పక్కనే ఉన్న బద్వేలులో సెంచురీ ప్లై బోర్డ్ పరిశ్రమను ప్రారంభించాం. రాష్ట్రంలో పెద్ద పెద్ద పారిశ్రామిక సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. కోవిడ్ ఉన్నా ఎక్కడా తగ్గకుండా, సాకులు చెప్పకుండా మీ అవసరం రాష్ట్ర అవసరంగా భావించి 58 నెలల కాలంలో 130 సార్లు బటన్ నొక్కాను.

మన మంచిని ప్రతి ఇంటా చెప్పాలి

- మన ప్రభుత్వం పరిపాలనలో కొత్త ఒరవడిని తీసుకొచ్చిందని, మనం చేసిన మంచిని ప్రతి ఇంటికి వెళ్లి చెప్పండి. అమ్మ ఒడి, చేయూత, సున్నా వడ్డీ పథకం, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, రైతు భరోసా, వాహనమిత్ర మొదలు నేతన్న నేస్తం వరకు మనం అందించే పథకాల ద్వారా లబ్ధి పొందిన విషయాలను ఇంటింటికి తీసుకువెళ్లండి.
- ఈ పథకాలన్నీ అమలు కావాలన్నా, అవ్వాతాతలకు పెన్షన్లు సకాలంలో రావాలన్నా, మెరుగైన రేషన్ ఇంటికి రావాలన్నా, నాణ్యమైన విద్య, విదేశీ విద్య, వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదవాడికి మెరుగైన వైద్యం, ఆర్బీకేలు, రైతు భరోసా, తొమ్మిది గంటల ఉచిత విద్యుత్, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలన్నీ కొనసాగాలంటే 'జగన్ రావాలి...వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలి' అని తెలియజేయాలి.


తల్లి విజయమ్మను ఆత్మీయ ఆలింగనం చేసుకున్న సీఎం జగన్

విలువలకు అండగా నిలవాలి

- 2014లో మోదీ, దత్తపుత్రుడితో కలిసి చంద్రబాబు ఎన్నికలకు వెళ్లారు. ఎన్నికల సమయంలో వారు రూపొందించిన అబద్ధాల పాంప్లెట్ ప్రతి ఇంటికి పంపారు. టీవీలు, పేపర్లలో యాడ్స్ వేశారు. రైతులకు రుణమాఫీ, పొదుపు సంఘాలకు రుణమాఫీ, ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు, ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి, రూ.10 వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్, సింగపూర్‌ను మించిన రాజధాని, ప్రతి జిల్లాకు హైటెక్ నగరం, మూడు సెంట్ల భూమి వంటి హామీలు ఇచ్చారు. వీటిలో ఒక్కటైనా అమలయ్యాయా? ప్రత్యేక హోదా ఇచ్చారా? (లేదు.. లేదని ప్రజల నినాదాలు)
- మళ్లీ ఇదే బ్యాచ్ ఎన్నికల్లో ఇప్పుడు ప్రజల ముందుకు వస్తోంది. వీరు కొత్త మేనిఫెస్టోలో కిలో బంగారం, బెంజ్ కారు, సూపర్ సిక్స్, సెవెన్ అంటూ మరోసారి మోసం చేసేందుకు రెడీ అయ్యారు. దేశ ఇలాంటి రాజకీయాలు ఎక్కడా లేవు. విశ్వసనీయత, విలువలకు ప్రతీకగా నిలుస్తున్న మీ బిడ్డ నోటిలో నుంచి ఒక్కమాట వస్తే దానిని అమలు చేసిన తర్వాతే ఓటు అడుగుతున్నాం. విలువల రాజకీయానికి, పొత్తుల రాజకీయానికి మధ్య జరుగుతున్న పోరులో విలువలకు అండగా నిలవాలి.
- ఫ్యాన్ ఇంట్లో ఉండాలి.. సైకిల్ ఇంటి బయట ఉండాలి.. తాగిన టీ గ్లాస్ సింక్‌లో ఉండాలి. జరుగుతున్న ఎన్నికలు పేదల భవిష్యత్తు నిర్ణయించే ఎన్నికలు. పొరపాటు జరిగితే పేదల బతుకులు అంధకారమవుతాయి. ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తూ పేదవాడి భవిష్యత్తును కాపాడేందుకు మీరు సిద్ధమా? (సిద్ధమే అని సెల్‌లో టార్చ్ ఆన్ చేసి చేతులు పైకెత్తారు.)
- 175 ఎమ్మెల్యే స్థానాలు, 25 ఎంపీ స్థానాలు సాధించడమే మనందరి లక్ష్యం. పేదవాడికి మంచి చేయడంలో ఎక్కడా తగ్గలేదు. ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానం కూడా తగ్గడానికి వీలు లేదు.

ఆత్మీయంగా అభ్యర్థుల పరిచయం

'కడప పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న నా తమ్ముడు వైఎస్ అవినాష్‌రెడ్డి, ప్రొద్దుటూరు నుంచి పోటీ చేస్తున్న సోదరుడు ప్రసాద్‌రెడ్డి, కమలాపురం నుంచి మామ పి.రవీంద్రనాథ్‌రెడ్డి, బద్వేలు నుంచి పోటీ చేస్తున్న సోదరి డాక్టర్ సుధమ్మ, జమ్మలమడుగు నుంచి పోటీ చేస్తున్న సోదరుడు సుధీర్‌రెడ్డి, కడప నుంచి పోటీ చేస్తున్న నవాబ్ సాబ్ అంజద్‌బాష, మైదుకూరు నుంచి పోటీ చేస్తున్న పితృ సమానులైన ఎస్.రఘురామిరెడ్డి, పులివెందుల నుంచి పోటీ చేస్తున్న నాపై మీ అందరి చల్లని ఆశీస్సులు ఉంచాలి' అని సీఎం జగన్ కోరారు. అనంతరం వేదికపై ఉన్న నాయకులను పలకరిస్తూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

హైకోర్టు సాక్షిగా తేలిపోయిన

ఈనాడు అసత్య ఆరోపణలు

- ఏపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తోందన్న ఈనాడు
- ఏబీసీ నుంచి గణాంకాలు తెప్పించిన ఢిల్లీ హైకోర్టు
- వెనక్కి తగ్గిన ఈనాడు... అనుబంధ పిటిషన్ ఉపసంహరణ
- 'సాక్షి' సర్క్యులేషన్ గణాంకాల ప్రచురణకు ధర్మాసనం అనుమతి

సాక్షి, అమరావతి: 'సాక్షి' దినపత్రిక తన సర్క్యులేషన్ పెంచుకునేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందంటూ 'ఈనాడు' అడ్డగోలుగా చేస్తూ వచ్చిన ఆరోపణలు అసత్యమని ఢిల్లీ హైకోర్టు సాక్షిగా తేలిపోయాయి. వలంటీర్లు విస్తృత సర్క్యులేషన్ కలిగిన ఏ దినపత్రికనైనా కొనుగోలు చేయవచ్చంటూ ప్రభుత్వం జీవో జారీ చేయగా దీనివల్ల సాక్షి సర్క్యులేషన్ అమాంతం పెరిగిపోయిందంటూ ఈనాడు ప్రమాణపూర్వకంగా చెప్పిన మాటలు, శుద్ధ అబద్ధమని ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ (ఏబీసీ) ఢిల్లీ హైకోర్టుకు సమర్పించిన గణాంకాలు వెల్లడించాయి. ప్రభుత్వ జీవో వల్ల సాక్షి నిజంగానే లబ్ధి పొంది ఉంటే ఆ పత్రిక సర్క్యులేషన్ మిమ్మల్ని దాటిపోయి ఉండాలి కదా? మరి ఏబీసీ గణాంకాలు మరో రకంగా ఉన్నాయి కదా? అంటూ హైకోర్టు ధర్మాసనం సూటిగా సంధించిన ప్రశ్నలకు ఈనాడు వద్ద సమాధానమే లేకుండా పోయింది. సాక్షి సర్క్యులేషన్ విషయంలో తన ఆరోపణల్లో నిజం లేదని తేలడంతో చేసేదేమీ లేక ఈనాడు వెనక్కి తగ్గింది. హైకోర్టు సైతం సాక్షి సర్క్యులేషన్ గణాంకాలను ప్రచురించేందుకు అనుమతినిచ్చింది. దీంతో చేసేదేమీ లేక సాక్షి సర్క్యులేషన్ గణాంకాలను ప్రచురించకుండా ఏబీసీని నిరోధించాలంటూ దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాన్ని ఈనాడు ఉపసంహరించుకుంది. విస్తృత సర్క్యులేషన్ ఉన్న ఏ దినపత్రికనైనా కొనుక్కునేందుకు వలంటీర్లకు అనుమతినిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాలు చేస్తూ ఈనాడు దాఖలు చేసిన ప్రధాన వ్యాజ్యంలో తదుపరి విచారణను ఏప్రిల్ 25కి వాయిదా వేసింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ మన్మోహన్, న్యాయమూర్తి జస్టిస్ మన్మీత్ ప్రతీమ్ సింగ్ ఆరోరా ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

జైత్రయాత్ర ఆరంభం

ఇడుపులపాయ నుంచి బస్సుయాత్రతో ఎన్నికల ప్రచార భేరి మోగించిన సీఎం జగన్

- వైఎస్సార్ ఘాట్ వద్ద తల్లి విజయమ్మతో కలిసి నివాళులు అర్పించి ఆశీర్వాదం తీసుకున్న సీఎం
- సర్వమత ప్రార్థనల అనంతరం బస్సు యాత్రకు శ్రీకారం
- భారీగా కదలివచ్చిన నేతలు, కార్యకర్తలు, అభిమానుల హర్షధ్వానాల మధ్య ఆరంభమైన యాత్ర
- ప్రొద్దుటూరు వరకూ రహదారిపై కి.మీ. కొద్దీ బారులు తీరిన జనం
- అడుగడుగునా అపూర్వ ఆదరణతో ఆలస్యంగా సాగిన బస్సు యాత్ర
- వేంపల్లి, వీరపునాయునిపల్లి, ఎర్రగుంట్ల రోడ్ షోలలో నీరాజనం పలికిన జనం
- వైఎస్సార్ కడప జిల్లా చరిత్రలో అతి పెద్ద ప్రజాసభగా నిలిచిన ప్రొద్దుటూరు సభ
- ఆళ్లగడ్డ క్రాస్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో రాత్రి బస

మరిన్ని ఫొటోలు వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అది ప్యాంట్రీ కార్.. బే'కార్'

రాతలేల రామోజీ

- బస్సు యాత్ర కోసం వంట సామాన్లను తీసుకెళ్లిన ప్యాంట్రీ వాహనం
- సీఎం క్యాంప్ కార్యాలయానికి కంటైనర్ ఎందుకొచ్చిందంటూ ఈనాడు తప్పుడు రాతలు
- నిషేధిత ప్రాంతంలో ఫొటోలు, వీడియోలు తీసి మరీ అడ్డగోలు కూతలు
- అనుమతి లేకుండా చిత్రీకరించడమే కాకుండా వక్ర రాతలు రాసిన ఈనాడు, ఈటీవీపై చట్టపరమైన చర్యలకు అధికారులు సిద్ధం



ఆ నౌక ప్రయాణం ఎలా సాగింది?

- బ్రెజిల్ నుంచి ట్రావెలింగ్ మ్యాప్‌పై ఆరా తీస్తున్న సీబీఐ
- రెండు రోజులు ఆలస్యంగా ఎందుకొచ్చింది?
- కొలంబో మార్గంలో ఏమైనా సీల్ టాంపరింగ్ జరిగిందా?
- సంధ్య ఆక్వా ప్రతినిధుల కాల్ డేటా క్షుణ్ణంగా పరిశీలన
- సంస్థ దిగుమతి చేసుకున్న ఫీడ్ ఫైల్స్ వివరాలు సేకరణ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ డ్రగ్స్ రాకెట్ చిక్కుముడిని విప్పేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ విచారణను వేగవంతం చేసింది. బ్రెజిల్ శాంటోస్ పోర్టు నుంచి బయలుదేరిన నౌక ట్రావెలింగ్ మ్యాప్ వివరాలను పిన్ టు పిన్ సేకరించే పనిలో సీబీఐ నిమగ్నమైంది. రావాల్సిన సమయం కంటే రెండు రోజులు ఆలస్యంగా ఎందుకు వచ్చిందనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. సంధ్య ఆక్వా సంస్థ గతంలో చేసుకున్న దిగుమతుల వివరాలను కూడా నిశితంగా పరిశీలిస్తోంది. బ్రెజిల్ నుంచి డ్రైఈస్ట్ కొనుగోలు చేసినట్లు చెబుతుండటంతో అక్కడి నుంచే పరిశోధించేందుకు దర్యాప్తు బృందాలు వెళ్లినట్లు తెలుస్తోంది.

పది రోజుల ప్రయాణం..

అసలు ప్యాకేజింగ్‌లోనే డ్రగ్స్ కలిశాయా? లేదా మార్గమధ్యంలో చేరాయా? అనే కోణంలోనూ దర్యాప్తు మొదలైంది. బ్రెజిల్ నుంచి బయలుదేరిన నౌక విశాఖకు రెండు రోజులు ఆలస్యంగా వచ్చిందని సంధ్య ఆక్వా సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. సాధారణంగా బ్రెజిల్ నుంచి విశాఖ పోర్టుకు కంటైనర్ షిప్ వచ్చేందుకు 7 నుంచి 8 రోజుల సమయం పడుతుంది. కానీ ఈ షిప్ 10 రోజులకు విశాఖ చేరుకుంది. అందుకు గల కారణాలేమిటనే అంశాలను అన్వేషిస్తున్నారు.

కొలంబో నుంచి నిర్ణీత సమయంలోనే..

కొలంబో నుంచి విశాఖ వచ్చేందుకు నౌకలకు 3 రోజుల సమయం పడుతుంది. అంటే ఆ నౌక నిర్ణీత సమయంలోనే చేరుకుంది. మరి బ్రెజిల్ నుంచి కొలంబో వచ్చే మార్గంలో సీల్ టాంపరింగ్ ఏమైనా జరిగిందా? అనే కోణంలోనూ సీబీఐ దర్యాప్తు చేస్తోంది. రెండు పోర్టులకు వెళ్లకుండా నౌకను ఎందుకు దారి మళ్లించారనే విషయంపైనా ఆరా తీస్తున్నారు. రెండు పోర్టులకు వెళ్లకుండా నేరుగా వచ్చినప్పుడు రెండు రోజులు ఎందుకు ఆలస్యమైందనే అంశంపై సమాచారాన్ని సేకరిస్తున్నారు.

బ్రెజిల్‌కు బృందాలు..

సంధ్యా ఆక్వా సంస్థ ప్రతినిధుల కాల్‌డేటాని విశ్లేషిస్తున్న సీబీఐ బృందం ఎవరెవరికి కాల్స్ వెళ్లాయి? ఏ ప్రాంతాలకు వెళ్లాయి? అనే సమాచారాన్ని ఇప్పటికే సేకరించి ఫోన్ నంబర్ల ఆధారంగా వివరాలు సేకరించేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేసింది. బ్రెజిల్‌లో డ్రైఈస్ట్ ఆర్డర్ చేసిన సంస్థ దగ్గర నుంచి శాంటోస్, బెల్జియం, డాట్లాంటిక్, కొలంబో పోర్టులకు వెళ్లి షిప్ బెర్తింగ్ సమయంలో నిక్షిప్తమైన సీసీ టీవీ ఫుటేజీని సేకరించాలని భావిస్తున్నారు. ఇందుకోసం మరో బృందాన్ని పంపనున్నట్లు సమాచారం. గతంలో సంధ్య ఆక్వా సంస్థ దిగుమతి చేసుకున్న కార్గో వివరాలు, సరుకు ఆర్డర్లు తదితర రికార్డులను స్వాధీనం చేసుకుని విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా డ్రగ్స్ అవశేషాలతో వచ్చిన కంటైనర్‌ని విశాఖ కంటైనర్ టెర్మినల్‌లోనే భద్రపరిచారు.

ఆ రెండు పోర్టులకు ఎందుకు వెళ్లలేదు?

ఓషన్ నెట్‌వర్క్ ఎక్స్‌ప్రెస్ ఆధ్వర్యంలో డ్రైఈస్ట్‌తో కూడిన కంటైనర్ కార్గో జీస్ లియాన్ యంగ్ గ్యాంగ్ కార్గో షిప్ హెచ్‌హెచ్‌ఎల్‌ఏ కంటైనర్ టెర్మినల్ నుంచి మార్చి 6వ తేదీ మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరింది. అక్కడి నుంచి షెడ్యూలింగ్ ప్రకారం ఈజిప్టులోని డామిట్టా కంటైనర్ టెర్మినల్‌కు, ఆ తర్వాత సూయజ్ కెనాల్‌లో బెర్తింగ్ కావాల్సి ఉంది. అయితే ఆ రెండు పోర్టులకు వెళ్లకుండా 'స్కిప్ కాలింగ్' చేశారు. నౌక నేరుగా మార్చి 9వతేదీ సాయంత్రం 4 గంటలకు బెల్జియంలోని ఆంట్‌వెర్ప్ గేట్‌వేకు చేరుకోగా అర్ధరాత్రి 1.03 గంటలకు బెర్తింగ్ ఇచ్చారు. 10వతేదీ రాత్రి 9.43 గంటలకు నౌక తిరిగి అక్కడి నుంచి బయల్దేరింది. డాట్లాంటిక్‌లోని సీఎస్‌ఎం టెర్మినల్‌కు 11వ తేదీ వేకువ జామున 4 గంటలకు చేరుకుని 12వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు బయల్దేరింది. అక్కడి నుంచి కొలంబో పోర్టుకు 13వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకోగా రాత్రి 10.27 గంటలకు తిరిగి బయల్దేరింది. విశాఖ కంటైనర్ టెర్మినల్‌లోని టెర్మినల్-2కి 16వతేదీ సాయంత్రం 5.30 గంటలకు వచ్చింది. అదే రోజు రాత్రి 8.55 గంటలకు నౌకకు బెర్తింగ్ ఇచ్చారు.

సీనియర్లకు సీటు లేదు!

పొత్తులో బీజేపీ పోటీచేసే పది అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఖరారు

సాక్షి, అమరావతి/న్యూఢిల్లీ : పొత్తులో భాగంగా రాష్ట్రంలో పది అసెంబ్లీ స్థానాలకు పోటీచేయనున్న బీజేపీ తన అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. ఈ మేరకు ఏపీ లోక్‌సభ ఎన్నికల ఇంచార్జ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక మాజీ ఎంపీ, ఇద్దరు మాజీమంత్రులు, ఒక జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యేలకు ఈ జాబితాలో చోటుదక్కింది. కానీ, రెండు మూడు దశాబ్దాలకు పైగా పార్టీనే నమ్ముకున్న కొందరు ముఖ్యమైన సీనియర్లకు మాత్రం అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికలోనూ తీవ్ర నిరాశే మిగిలింది. మొన్న పార్లమెంట్ అభ్యర్థుల జాబితాలోనూ టికెట్ దక్కని పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సోము వీర్రాజుతో పాటు ప్రస్తుత రాష్ట్ర కమిటీలో ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పరిపూర్ణానంద స్వామికి కూడా ఈ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో రిక్తహస్తమే మిగిలింది. బీజేపీలో చంద్రబాబుకు అనుకూలమన్న వ్యక్తులుగా పేరున్న నాయకులకు మాత్రం సీట్లు దక్కాయని అసలైన బీజేపీ నేతలు మండిపడుతున్నారు.

అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థులు వీరే..

ఎన్. ఈశ్వర్‌రావు: ఎచ్చెర్ల, పి.విష్ణుకుమార్‌రాజు: విశాఖపట్నం నార్త్, పంగి రాజారావు: అరకు, ఎం.శివకృష్ణంరాజు: అనపర్తి, కామినేని శ్రీనివాసరావు: కైకలూరు, వై. సుజనాచౌదరి: విజయవాడ వెస్ట్, బొజ్జా రోశన్న: బద్వేల్, సి. ఆదినారాయణరెడ్డి: జమ్మలమడుగు, పీవీ పార్థసారథి: ఆదోని, వై. సత్యకుమార్: ధర్మవరం.



'ప్రతి మనిషిలోనూ ఓ డాక్టర్ ఉంటారు. ప్రతి ఒక్కరిలో వైద్యం గురించి ప్రాథమిక అవగాహన ఉంటుంది' అనే మౌలిక సూత్రాన్ని పట్టుకున్నారు డాక్టర్ సరళ. వైద్యరంగాన్ని అత్యంత సరళంగా వివరించి చెబుతున్నారు. ఆసక్తి ఉన్న వాళ్లను, ముఖ్యంగా గృహిణులను హెల్త్ అడ్వయిజర్‌లుగా తీర్చిదిద్దుతున్నారు. ఆహ్వానం పలికిన కాలనీలకు వెళ్లి హెల్త్ అవేర్‌నెస్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. "ఇంటింటా ఓ డాక్టర్' ఉండాలి. ఆ డాక్టర్ మహిళ అయితే ఇంట్లో అందరి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. తన బంధువులు స్నేహితులకు నిస్వార్థమైన వైద్యసేవలందిస్తుంది. గ్రామాల్లో వైద్య సహాయం అందని పరిస్థితులు ఇప్పటికీ ఉన్నాయి. నేను తయారు చేస్తున్న హెల్త్ అడ్వయిజర్ వ్యవస్థ ద్వారా ఆ లోటును భర్తీ చేయాలనేది నా ఆకాంక్ష" అన్నారు డాక్టర్ సరళ. ఆమె సాక్షితో మాట్లాడుతూ "నేను డాక్టర్ కావాలనే ఆలోచన నాది కాదు, మా అమ్మ కోరిక. నిఫ్ట్‌లో కోర్సు చేసి ఫ్యాషన్ డిజైనర్ కావాలనే నా ఆకాంక్ష నెరవేరలేదు. కానీ వైద్యరంగాన్ని సమాజానికి అవసరమైనట్లు రీ డిజైన్ చేస్తున్నా"నని చెప్పారు.

• సరళ వైద్యం

ఇంటింటా డాక్టర్

''మాది కాకినాడ. నాన్న బిజినెస్ చేస్తారు. అమ్మ గవర్నమెంట్ ఉద్యోగంలో హెడ్ ఆఫ్ ది ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌గా రిటైరయ్యారు. ఆడవాళ్లను చదువులో ప్రోత్సహించడం మా ఇంట్లోనే ఉంది. అమ్మకి పదవ తరగతి పూర్తయిన వెంటనే పెళ్లి చేశారు. మా నాన్నే అమ్మను చదివించారు. ఇక ముగ్గురు పిల్లల్లో నేను పెద్దదాన్ని కావడంతో అమ్మ కల నెరవేర్చే బాధ్యత నాదయింది. సాధారణంగా మెడిసిన్‌లో ఎంబీబీఎస్‌లో సీట్ రాని వాళ్లు హోమియో, ఆయుర్వేదం వంటి ఆల్టర్నేటివ్ మెడిసిన్ వైపు వెళ్తారనే అభిప్రాయం సమాజంలో స్థిరంగా ఉంది. కానీ హోమియో మీద ఇష్టంతో బీహెచ్ఎమ్ఎస్‌లో చేరాను. ఖాళీ సమయాల్లో కూడా మా ప్రొఫెసర్‌లకు సహాయం చేస్తూ సబ్జెక్టు లోతుగా తెలుసుకున్నాను. పెళ్లి అయి వైజాగ్ వెళ్లిన తర్వాత సీనియర్ దగ్గర ఏడాది పని చేయడం నన్ను పరిపూర్ణం చేసింది. ఈ రంగంలో సాధించే అనుభవం అంతా పేషెంట్‌తో ఎక్కువసేపు మాట్లాడి, వ్యాధి లక్షణాలను, వారి జీవనశైలిని, మానసిక స్థితి గురించి వివరంగా అడిగి తెలుసుకోవడంతోపాటు ఎక్కువమందికి వైద్యం అందించడమే. అప్పుడే సొంతంగా ప్రాక్టీస్ పెట్టగలిగిన ధైర్యం వస్తుంది. హైదరాబాద్‌లో సొంతంగా క్లినిక్ తెరవడం... నన్ను సమాజం కోసం పని చేయాలనే ఆలోచనకు బీజం వేసింది.

పేషెంట్‌ల వల్లనే తెలిసింది!

నేనిప్పుడు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో ప్యానల్ డాక్టర్‌గా సేవలందిస్తున్నాను. నెలకు కనీసం పదికి తక్కువ కాకుండా హెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ చేస్తున్నాను. హెల్త్ కేర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ల అవసరం ఉందని గుర్తించడానికి కారణం నా దగ్గరకు వచ్చే పేషెంట్‌లే. డయాబెటిస్, హైపర్ టెన్షన్, స్ట్రోక్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స కోసం నా దగ్గరకు వచ్చే చాలామందిలో అప్పటికే వ్యాధి తీవ్రత పెరిగిపోయి చికిత్సకు స్పందించని స్థితికి చేరి ఉండేది. అల్లోపతిలో వైద్యం చేయించుకుని ఆరోగ్యం మెరుగైన వాళ్లు సంతోషంగా జీవితాన్ని కొనసాగిస్తుంటారు. అక్కడ సాంత్వన లభించని వాళ్లు ఓ ప్రయత్నం అన్నట్లుగా హోమియో వంటి వైద్య ప్రక్రియల వైపు వస్తుంటారు. ఆల్టర్‌నేటివ్ మెడిసిన్ పట్ల అవగాహన లేకపోవడమే ఇందుకు కారణం.



• కాలేజీలో హెల్త్ కేర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ (ఫైల్ ఫొటో)

మూడు నెలల్లో పూర్తి స్థాయిలో చికిత్స చేయగలిగిన మందులు ఉండి కూడా చివరి దశ వరకు ఈ చికిత్సకు అందుబాటులోకి రాకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్న వాళ్లు ఎందరో. అలాంటి గ్యాప్‌కు 2015 నుంచి నేను బ్రిడ్జినవుతున్నాను. గతంలో కాలనీలకు వెళ్లి సమావేశాలు ఏర్పాటు చేయాల్సి వచ్చేది. సమావేశం ఉందనే సమాచారం కాలనీలో అందరికీ చేర్చడం కూడా ప్రయాసతో కూడి ఉండేది. ఇప్పుడు ఒక గేటెడ్ కమ్యూనిటీలో వందకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆ కమ్యూనిటీ వాట్సాప్ గ్రూప్‌లో ఒక్క మెసేజ్ పెడితే సమాచారం అందరికీ చేరుతుంది. ఆసక్తి ఉన్నవాళ్లు హాజరవుతున్నారు. స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లి మెన్‌స్ట్రువల్ హెల్త్, పీసీఓడీ వంటి సమస్యల మీద అవగాహన కల్పిస్తున్నాను. దీనికి తోడుగా హెల్త్ అడ్వైజర్ అనే కాన్సెప్ట్‌కు కూడా శ్రీకారం చుట్టాను.

వారం రోజుల శిక్షణ

అనారోగ్యాల పట్ల జాగ్రత్తగా ఉండాలి, కానీ ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకీ బెంబేలు పడిపోయి హాస్పిటళ్లకు పరుగులు తీయాల్సిన పని ఉండదు. సాధారణ జలుబు, దగ్గు వంటి వాటికి ఇంట్లోనే వైద్యం చేసుకోవచ్చు. మూడు రోజులు దాటినా తగ్గకపోతే డాక్టర్ దగ్గరకు వెళ్లమని చెబుతాం. మొదటి మూడు రోజుల వైద్యం అందించగలిగేటట్లు హెల్త్ అడ్వైజర్‌లను తయారు చేస్తున్నాను. రోజుకో గంటసేపు వారం రోజులపాటు ఉంటుంది ఈ కోర్సు. మందులు కూడా హెల్త్ అడ్వైజర్‌లు పేషెంట్ లక్షణాలను బట్టి సులువుగా ఇవ్వగలిగేటట్లు తయారు చేశాను. మనకు స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లయినప్పటికీ దేశంలో ఇంకా డాక్టర్– పేషెంట్‌ల నిష్పత్తి సమతుల్యతలో పెద్ద అగాధమే ఉంది. వెయ్యి మంది పేషెంట్‌లకు ఒక డాక్టర్ అందుబాటులో ఉండాలనే సదుద్దేశం నెరవేరడం లేదు. పట్టణాల్లో అవసరానికి మించినంత మంది వైద్యులున్నారు, గ్రామాల్లో వైద్యం కరువవుతోంది. గృహిణులకు హెల్త్ అడ్వైజర్‌లుగా శిక్షణ ఇవ్వడం వల్ల ఆ లోటు కొంత భర్తీ అవుతోంది. వైద్యం అంటే... సామాన్యులకు అర్థం కాని చదువు కాదు, అత్యంత సులువుగా అర్థం చేసుకోగలిగిన శాస్త్రం అని నిరూపించడం, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే నా లక్ష్యం. కోర్సులో భాగంగా నేర్చుకున్న వైద్యాన్ని నా వంతుగా కొంత విస్తరించి 76 అనారోగ్యాలకు మందులు కనుక్కున్నాను. వాటికి ఆయుష్ నుంచి నిర్ధారిత గుర్తింపు కూడా వచ్చింది'' అని వైద్య రంగాన్ని సరళతరం చేయడంలో తన వంతు భాగస్వామ్యాన్ని వివరించారు డాక్టర్ సరళ.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: అనిల్ కుమార్ మోర్ల

భిన్న జీవనం

జెలజ కుటుంబం ఇంట్లో కంటే రోడ్డు మీదే ఎక్కువగా ఉంటుంది. జెలజ ట్రక్ డ్రైవర్. భర్తకు ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం ఉంది. తొలత గృహిణిగా ఉన్న జెలజ మెల్లగా డ్రైవింగ్ నేర్చుకుంది. లోడు దించేందుకు కుటుంబంతో బయలుదేరి కొత్త ప్రాంతాల వీడియో చేస్తుంది. ఆమె కేరళ నుంచి కశ్మీర్ వరకూ ట్రక్ తోలింది. కూతురు తల్లితోపాటు డ్రైవింగ్ నేర్చుకుంది. 'పుతట్టు ట్రావెల్ వ్లోగ్' పేరుతో ఈ కుటుంబ యానం లక్షల మంది ఫాలోయెర్స్‌ను సంపాదించింది.



• భర్త, కుమార్తెతో జెలజ

12 చక్రాల బండి సాగిపోతోంది

ఉదాహరణకు జెలజ జీవితం ఇలా ఉంటుంది. ఆమె కేరళలోని కొట్టాయం నుంచి ప్లైవుడ్ లోడ్ తీసుకుని పూణెలో డెలివరీ చేస్తుంది. కాని ఖాళీ ట్రక్కు వెనక్కు తెస్తే నష్టం. 'ఉల్లిపాయల లోడు కశ్మీర్‌లో దింపుతారా' అని పూణెలో అడుగుతారు. 'దింపుతాను' అని బయలుదేరుతుంది. కశ్మీర్ చేరుకుంటుంది. అక్కడ లోడ్ దొరకదు ఒక్కోసారి. ఢిల్లీ, హర్యాణ దాకా వచ్చే లోడ్ దొరుకుతుంది. ఏదో ఒక సరుకు కేరళకు దింపే బుకింగ్ వస్తుంది. ఆ లోడు తీసుకుని కేరళ చేరుకుంటుంది.

'కేరళలో ప్రతి సంవత్సరం జారీ అవుతున్న డ్రైవింగ్ లైసెన్స్‌లలో 40 శాతం స్త్రీలవి. టూ వీలర్లు కార్లు సరే... బస్సులు కూడా కేరళలో నడుపుతున్నారు స్త్రీలు. కాని ట్రక్కు నడిపే స్త్రీలు చాలా అరుదు. అందుకే జెలజను చూసి అందరూ గౌరవిస్తారు' అంటాడు రతీష్. అతడు జెలజ భర్త. ఆమె లాంగ్ డ్రైవ్‌కి బయలుదేరితే చాలాసార్లు తోడు ఉంటాడు. ఒక్కోసారి పెద్ద కూతురు, భార్య డ్రైవ్ చేస్తుంటే వారికి తోడు వస్తాడు. అతను స్వయంగా డ్రైవరు. కాని తన కుటుంబ స్త్రీలు హైవేలను జయిస్తూ ఉంటే సంతోషపడతాడు.

గృహిణి నుంచి డ్రైవర్‌గా

రతీష్ 2003 వరకూ ఒక సాధారణ ట్రక్ డ్రైవర్. ఆ సంవత్సరం ఆరు లక్షలు లోన్ తీసుకుని ఒక భారత్ బెంజ్ ట్రక్ కొన్నాడు. కలిసొచ్చింది. తన సోదరుడితో కలిసి ఇప్పుడు 27 నేషనల్ పర్మిట్ ట్రక్కులతో ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్ చేస్తున్నాడు. తరచూ లాంగ్ డ్రైవ్‌కి వెళ్లే రతీష్‌ని జెలజ 'నేనూ నీతో రానా కొత్త ప్రాంతాలు చూడాలని ఉంది' అనడిగింది. 'రావచ్చు. కాని నువ్వు ట్రక్కు నడపడం నేర్చుకుంటే' అన్నాడు రతీష్. అప్పటికి జెలజ కేవలం గృహిణి. టూ వీలర్ నడపడం కూడా రాదు. ఆమె మొదట టూ వీలర్.. ఆ తర్వాత కారు నడిపి ట్రక్ డ్రైవింగ్ నేర్చుకుంది. భర్తను తోడు తీసుకుని స్వయంగా ట్రక్ నడుపుతూ లోడ్ డెలివరీ చేయడం ప్రారంభించింది.



• లాంగ్ ట్రిప్‌లో అత్తగారితో...

వీడియోలు చేస్తూ

'మాది ఉమ్మడి కుటుంబం. నా మరిది, తోటికోడలు, అత్తగారు.. అందరం కలిసి ఉంటాం. అందుకే నా ఇద్దరు పిల్లలను వదిలి ట్రక్ తీసుకుని బయలుదేరుతాను' అంటుంది జెలజ. ఆమె పెద్ద కూతురు కూడా ట్రక్ డ్రైవింగ్ నేర్చుకుంది. లోడ్‌లు దింపే పనిలో భాగంగా పర్యటనలు కూడా ఈ కుటుంబం ట్రక్కు ద్వారా ముగిస్తారు. 'మేఘాలయా, కోల్‌కటా, పోర్‌బందర్... ఇలా ఎన్నో కొత్త ప్రాంతాలు చూశాను' అంటుంది జెలజ. ఎక్కడకు వెళ్లినా అక్కడి విశేషాలు వీడియోలు చేస్తూ అక్కడి సంస్కృతి, అలవాట్లు తెలియచేస్తూ ఉంటుంది. రోడ్డు పక్కన ట్రక్కు ఆపి వంట చేసుకుని తోటి డ్రైవర్‌లతో కలిసి తినడం ఆ వీడియోలు కనపడుతుంది. ఒకసారి అత్తగారిని తీసుకుని ఆమె ట్రక్కులోనే లాంగ్ జర్నీ చేసింది. కేరళ నుంచి కశ్మీర్ వరకూ ట్రక్ నడిపి వార్తల్లోకి ఎక్కింది జెలజ.

'వాష్‌రూమ్‌లు ఒక్కటే ఇబ్బంది. పెట్రోల్ బంకుల్లో ఉన్నవాటిని ఉపయోగిస్తాను. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రల్లో పోలీసులు పీక్కు తింటారు మామూళ్ల కోసం. మిగిలిన రాష్ట్రాలు పర్లేదు. ఇక దొంగల భయం ఉంటుంది. కాని హైవేల మీద తిరగ్గా తిరగ్గా ఆ భయం పోయింది' అంటుంది జెలజ.

దృశ్యం



• దీప్తి అస్థాన

చిత్తంతో చిత్రప్రయాణం



• మారుమూల ప్రాంతాల వ్యక్తుల జీవన దృశ్యం

ఉరుకులు పరుగుల జీవితంలో ఉద్యోగికి ఆఫీస్‌కు అవతలి ప్రపంచంపై దృష్టి మళ్లదు. పనే ప్రపంచం అవుతుంది. దీప్తి అస్థాన మాత్రం ఆఫీస్ క్యూబికల్‌కు ఆవలి ప్రపంచాన్ని చూడాలనుకుంది. కెమెరా తన నేస్తం అయింది. దేశమంతా తిరుగుతూ స్త్రీల జీవితంలోని ఎన్నో కోణాలను కెమెరా కంటితో ఆవిష్కరిస్తోంది...

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం నుంచి సెల్ఫ్ లెర్నింగ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రయాణం దీప్తి అస్థాన జీవన దృక్పథాన్ని పూర్తిగా మార్చివేసింది. ఆఫీసు క్యూబికల్ అవతల తనకు తెలియని ప్రపంచం గురించి తెలుసుకోవాలనుకుంది. ఎక్కడికి ప్రయాణం చేసినా కెమెరా తనతోపాటు వచ్చేది. సంభాషించేది. కెమెరా ద్వారా ప్రయాణాలలో లోతైన అర్థాన్ని, సామాజిక ప్రయోజనాన్ని కనుగొంది దీప్తి.

మనసులోని భావాలను వ్యక్తీకరించడానికి, తాను కలుసుకున్న వ్యక్తుల జీవిత కథలను ప్రపంచంతో పంచుకోవడానికి ఫొటోగ్రఫీ దీప్తికి బలమైన మాధ్యమంలా ఉపయోగపడింది.

సాధారణంగా దూర ప్రయాణాలు అనగానే ప్రముఖ, ప్రసిద్ధ స్థలాలు మాత్రమే గుర్తుకు వస్తాయి. కానీ దీప్తి మాత్రం అనామక, అంతగా ఎవరూ పట్టించుకోని ప్రాంతాలకు వెళ్లేది. ఆ ప్రాంతాల గురించి ఎవరూ పనిగట్టుకొని ఫొటోలు తీసి ఉండరు. నాలుగు ముక్కలు రాసి ఉండరు. ఆ పని దీప్తి చేసింది.

ఆ తరువాత...'ఉమెన్ ఇండియా' ప్రాజెక్ట్‌తో తన ప్రయాణాన్ని మరింత విస్తృతం చేసుకుంది. ఇది ఒకటి రెండు నెలల పరిమిత కాల ప్రయాణం కాదు. సంవత్సరాలుగా సాగిన ప్రయాణం. పట్టణాల్లోని మార్పుల సంగతి ఎలా ఉన్నా, పల్లెప్రజలు మాత్రం గతంలోనే ఉన్నారని గ్రహించింది దీప్తి.

బాల్య వివాహాల నుంచి ఆడపిల్లలు చదువుకు దూరం కావడం వరకు కెమెరా కంటితో ఎన్నో సమస్యలను లోకం దృష్టికి తీసుకువచ్చి మహిళలు తమ గళం విప్పడానికి ఒక వేదికను నిర్మించింది. సోషల్ మీడియా దృష్టిలో పడని మహిళల సమస్యలను అదే మీడియా ద్వారా నలుగురి దృష్టికి తీసుకు వచ్చింది.

సమస్యల గురించి మాత్రమే కాకుండా వివిధ ప్రాంతాలలోని సాంస్కృతిక వైభవాన్ని కళ్లకు కట్టింది.

'నా ప్రాజెక్ట్‌లో అన్ని కథలు మనుగడ కోసం చేసే పోరాటానికి సంబంధించినవి మాత్రమే కాదు. జీవితాన్ని, సంస్కృతిని సెలబ్రెట్ చేసుకునేవి కూడా' అంటుంది దీప్తి.

స్ఫూర్తిదాయకమైన కథలు మార్పు తీసుకురాగలవా?' అని అడిగితే 'అందుకు నేనే ఉదాహరణ. ఆ మార్పు ముందు నాలోనే వచ్చింది' అంటుంది దీప్తి. తాను షూట్ చేయడానికి ఎంచుకునే ప్రదేశాలతో ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది. గుజరాత్‌లోని మిదాపూర్‌లో పన్నెండేళ్ల భారతితో మాట్లాడింది దీప్తి. ఆ అమ్మాయి ఎప్పుడూ బడి ముఖం చూడలేదు. కొంత కాలం ఇంటిపట్టునే ఉన్న భారతి ఇప్పుడు తల్లిదండ్రులతోపాటు కూలిపనికి వెళుతుంది. ఈ చిన్నారి పెద్ద పెద్ద తట్టలను మోస్తున్న దృశ్యం చూసి దీప్తికి కళ్లలో నీళ్లు తిరిగాయి.

'భారతి అందమైన, చురుకైన అమ్మాయి. ఆమె భవిష్యత్ కూలిపనులకు పరిమితం కావాల్సిందేనా? అనే బాధ కలిగింది. కెమెరా గురించి భారతి ఆసక్తిగా తెలుసుకుంది. కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఉత్సాహం ఉన్న ఇలాంటి పిల్లలకు కొత్త దారి చూపితే పురోగమించగలరు' అంటుంది దీప్తి.

భారతి లాంటి ఎంతోమంది పిల్లల కథలను లోకం దృష్టికి తీసుకువచ్చింది. పట్టణ ప్రాంతాలలో పెరిగిన దీప్తి దేశ విదేశాల్లో ఎన్నో మెట్రోపాలిటన్ నగరాలలో పనిచేసింది. 'సమాజ నిర్మాణంలో మహిళలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి సమాన అవకాశాలు లేవు' అనే ఎరుక ఆమెను ఎప్పటికప్పుడు కొత్త ప్రాంతాలకు తీసుకు వెళుతుంది. కొత్త జీవితాలను ఆవిష్కరించేలా చేస్తున్న దీప్తి ప్రస్తుతం గోవాలో ఉంటోంది.

వారి జీవితంలో భాగం అవుతాను

కెమెరా ఉన్నా సరే, ఎదుటి వ్యక్తి జీవితపు లోతు అప్పటికప్పుడు ఆవిష్కారం కాదు. వారితో సరిగ్గా కనెక్ట్ కాగలగాలి. మనం వారిని అర్థం చేసుకున్నట్లే వారూ మనల్ని అర్థం చేసుకోవాలి. తమ గురించి తెలుసుకోవడంలో, కెమెరా ఉపయోగించడంలో ఎలాంటి వాణిజ్య ప్రయోజనం లేదనే భావన వారికి కలగాలి. ఇదేమంత సులభం కాదు. అలా అని జటిలం కాదు. మన ఓపిక, ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది.

ఫోటోలు తీసుకున్నప్పుడు వారి జీవితంలో భాగం అవుతాను. వారు నాలో భాగం అవుతారు. కలిసి భోజనం చేస్తాం. సరదా కబుర్లు చెప్పుకొని నవ్వుకుంటాం. ఇప్పటి వరకు ఈ దేశంలో ఏ మూలకు వెళ్లినా తమలో భాగంగా చూసుకున్నారు. ఆత్మీయత పంచారు. ఇది నా అదృష్టం.

– దీప్తి అస్థాన

• సమస్యలకే కాదు... జీవన సౌందర్యానికి 'ఉమెన్ ఇండియా ప్రాజెక్ట్' అద్దం పడుతుంది



లక్ష్యంతో కూడిన ప్రయాణం

భావాలను వ్యక్తీకరించడానికి పుస్తకం రాయడం, ఉపన్యాసం చేయడం లాగే ఫొటోగ్రఫీ కూడా ఒక సాధనం. నేను తీసిన చిత్రాలు నా భావాలకు అద్దం పట్టేలా ఉంటాయి. ఒక మహిళగా ఇతర మహిళలు, పిల్లలతో మాట్లాడడం నాకు సులువు అయింది. సోలోగా ట్రావెల్ చేయడంలో లైఫ్ స్కిల్స్ క్రమక్రమంగా నేర్చుకునే అవకాశం దొరుకుతుంది. ప్రయాణానికి ఒక లక్ష్యంతోడైతే అది అద్భుతంగా ఉంటుంది.

– దీప్తి అస్థాన

విశ్రాంతి



నిద్ర మంచం వదలడం లేదా?!

మనలో చాలా మంది పొద్దున్నే నిద్ర లేవడానికి ఫోన్‌లో రెండు మూడు అలారాలను సెట్ చేస్తారు. కానీ, వాటిని కట్ చేసి మళ్లీ పడుకుంటారు. ప్రతిరోజూ ఇలాగే జరుగుతుంటుంది. ఆ తర్వాత తమని తాము తిట్టుకుంటూ ఉంటారు. శరీరానికి తగినంత విశ్రాంతి లభించక ఇలా అవుతోందా? లేక నిజంగానే బద్ధకంగా ఉంటుందా? బద్ధకానికి, విశ్రాంతికి విభజనరేఖ ఏమిటి? ఉత్సాహకరమైన ఉదయాన్ని ప్రారంభించడానికి నిద్ర మంచం మీద నుండి లేవడం అనే కష్టం నుంచి బయటపడటానికి సులువైన టెక్నిక్స్ కొన్నిటిని తెలుసుకుందాం...

రాత్రి పడుకునే ముందు అలారం సెట్ చేసి పెట్టుకుంటారు. ఉదయాన్నే ఆ అలారం మోగగానే మెలకువ వచ్చినా, లేవకుండా అలారం ఆఫ్ చేసి మళ్లీ పడుకుంటారు. నిద్ర రాకపోయినా అలాగే పడక నుంచి బయటకు రాకుండా ఉంటారు. దీంతో నిద్ర పోకపోయినా అలాగే పడుకోవడం వల్ల సమయం వృథా అవుతుందని నమ్ముతారు. అయితే విశ్రాంతి కోసం కొంత సమయాన్ని బద్ధకంగా గడిపినా ఫర్వాలేదు. కానీ, విశ్రాంతి కోసం పనిని పక్కన పెట్టడం వల్ల ఇబ్బందుల్లో పడవచ్చు.

స్క్రీన్.. కలిగించే ఒత్తిడి

చాలా మంది బెడ్ మీద ఉన్నప్పుడు ఫోన్‌లో మాట్లాడటం, మెయిల్స్ లేదా సోషల్ మీడియా వార్తలు చూడటం చేస్తుంటారు. దీనివల్ల కొంత సమయం బాగానే గడిచిపోతుందని అనిపించవచ్చు. విశ్రాంతి పొందుతున్నాం అనే భావన కూడా కలగవచ్చు. కానీ ఎక్కువసేపు పడుకుని స్క్రీన్‌ని, అందులోని సమాచారాన్ని చూడటం వల్ల బ్రెయిన్ ఒక విధమైన అసౌకర్యానికి, ఒత్తిడికి లోనవుతుంది. ఉదయం లేస్తూనే ఫోన్ తీసుకొని వచ్చిన నోటిఫికేషన్లు, మెసేజ్‌లు చూసే అలవాటును వదులుకోవాలి.

మీతో మీరు...

రోజువారీ దినచర్యను ఎలా ప్రారంభించాలో తెలుసుకోవడం మనందరికీ చాలా ముఖ్యం. మంచం మీద నుంచి లేచి, బయటకు వచ్చిన వెంటనే ఒత్తిడిని పెంచే పనులను ప్రారంభించవద్దు. ఉదయం నిద్రలేచిన వెంటనే మీకోసం మీరు కొంత సమయం కేటాయించుకోవాలి. ఈ సమయంలో ప్రశాంతతను కలిగించే సంగీతాన్ని వింటూ సులభంగా చేయదగిన పనులను ఎంచుకోవాలి. ఈ విధానం వల్ల ఆ రోజు మొత్తంలో చేయదగిన పనులను చక్కగా ప్లాన్ చేసుకోవచ్చు.

అరగంట లోపు ఓకే!

ఉదయం నిద్రలేచిన తర్వాత కాసేపు అలాగే పడుకోవడం దినచర్యలో భాగమైతే ప్రతిరోజూ చేయవచ్చు. నిద్రలేచిన తర్వాత ఎంతసేపు మంచం మీద పడుకోవాలో నిర్ణీత నియమాలు లేవు. అయితే, 15 నుంచి 30 నిమిషాల తర్వాత బెడ్‌ను వదిలేయడం మంచిది.

శరీరం మాట వినాలి

విశ్రాంతి నిద్రకు ప్రత్యామ్నాయం కాదు. కానీ, కొంత విశ్రాంతి తీసుకున్న తర్వాత మంచిగా అనిపిస్తే అది నిద్రతో సమానంగా లేకపోయినా కచ్చితమైన ప్రయోజనాలను పొందవచ్చు. విశ్రాంతి అవసరమైతే శరీరం మాట వినిపించుకోవాలి. విశ్రాంతి తీసుకోవాలి అనిపించినప్పుడు దానిని పాటించడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. మానసిక ఆరోగ్యమూ మెరుగుపడుతుంది. చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జ్ఞాపకశక్తి బాగుంటుంది. కొంతమంది వారాంతాల్లో రోజంతా మంచం పైనే బద్ధకంగా దొర్లుతూ ఉంటారు. ఇలా చేయడం వల్ల ఏ పనీ చేయలేకపోయాం అనే అపరాధ భావనకు లోనవుతారు. దీనివల్ల కొన్ని ముఖ్యమైన పనులు పూర్తికాక కొత్త చిక్కులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల నిద్రపోవాలి అని అనిపించినప్పుడు నిద్ర పోవడమే మంచిది.

మంచి నిద్ర కోసం...


- రోజూ ఒకే సమయానికి నిద్రపోయేలా, తిరిగి ఉదయం నిద్రలేచేలా స్థిరమైన షెడ్యూల్‌ని పాటించాలి. వారాంతాల్లో కూడా ఇదే నియమాన్ని పాటించాలి
- నిద్రపోయే ముందు వేడినీటి స్నానం, ధ్యానం, పుస్తకం చదవడం, సంగీతం వినడం ప్రయోజనకరం
- నిద్రపోయే ముందు మొబైల్‌ను దూరంగా ఉంచాలి. సోషల్ మీడియాను చూడటం పూర్తిగా మానుకోవాలి
- త్వరగా జీర్ణం కాని ఆహారం, కెఫిన్, ఆల్కహాల్ వంటివి తీసుకోకూడదు.

సునామీ బ్యాటింగ్... విధ్వంస ప్రదర్శన... వీర విజృంభణ... అద్భుతం... అసాధారణం... అనమానం... ఎలాంటి విశేషణాలు ఉపయోగించుకుంటారో మీ ఇష్టం ... ఎన్నాళ్లుగానో ఇలాంటి ఇన్నింగ్స్ ఎదురు చూస్తున్న సన్‌రైజర్స్ ఆట సగటు అభిమానికి ఫుల్ జోష్‌ను పంచింది... సంపూర్ణ ఆనందాన్ని అందించింది... బౌండరీల వర్షంతో ఉప్పల్ స్టేడియంలో పరుగుల వరద పారింది... 19 ఫోర్లు, 18 సిక్సర్లు... ముంబై బౌలింగ్‌పై హైదరాబాద్ ఊచకోత మామూలుగా సాగలేదు... ముగ్గురు బ్యాటర్లు ఒకరితో మరొకరు పోటీ పడి పరుగులు సాధించడంతో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక టీమ్ స్కోరు నమోదైంది. ముందుగా హెడ్ 18 బంతుల్లో హాఫ్ సెంచరీ చేస్తే... కొద్ది క్షణాల్లోనే 16 బంతుల్లో అర్ధ సెంచరీ చేసి అభిషేక్ శర్మ తానూ తక్కువ కాదని చూపించాడు. నన్ను ఎలా మరచిపోతారన్నట్లుగా ఆ తర్వాత క్లాసెన్ తనదైన శైలిలో చెలరేగిపోయాడు... భారీ ఛేదనలో ముంబై కొంత వరకు ప్రయత్నించినా లక్ష్యం మరీ పెద్దదైపోయింది... చివరకు సొంతగడ్డపై సన్‌రైజర్స్ విజయగర్జన చేసింది. ఓవరాల్‌గా టి20ల్లోనే అత్యధిక పరుగులు, అత్యధిక సిక్స్‌లు నమోదైన మ్యాచ్‌గా సన్‌రైజర్స్, ముంబై ఇండియన్స్ మ్యాచ్ చరిత్ర పుటల్లోకి ఎక్కింది.

సన్‌రైజర్స్ 'రన్'రంగం

ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక స్కోరు (277) సాధించిన సన్‌రైజర్స్ హైదరాబాద్


ముంబై ఇండియన్స్‌పై 31 పరుగులతో ఘన విజయం ● చెలరేగిన క్లాసెన్, అభిషేక్ శర్మ, హెడ్


అభిషేక్ శర్మ

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ సత్తా చాటింది. ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ 17వ సీజన్ తొలి మ్యాచ్‌లో కమిన్స్ బృందం ఘన విజయాన్ని అందుకుంది. బుధవారం జరిగిన పోరులో రైజర్స్ 31 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (34 బంతుల్లో 80 నాటౌట్; 4 ఫోర్లు, 7 సిక్స్‌లు)... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అభిషేక్ శర్మ (23 బంతుల్లో 63; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు)... ట్రవిస్ హెడ్ (24 బంతుల్లో 62; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగారు. అనంతరం ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 246 పరుగులు సాధించింది. 'లోకల్ బాయ్' తిలక్ వర్మ (34 బంతుల్లో 64; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (22 బంతుల్లో 42 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు.

వీర విధ్వంసం...

7, 11, 22, 5, 13, 23, 21, 15, 11, 20 (తొలి 10 ఓవర్లలో 148)... 13, 12, 7, 11, 11, 12, 18, 11, 13, 21 (తర్వాతి 10 ఓవర్లలో 129)... సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ సాగిన తీరిది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (11) విఫలం కాగా... మిగిలిన నలుగురు బ్యాటర్లు ముంబై బౌలర్లపై విరుచుకు పడ్డారు. అండర్-19 వరల్డ్ కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచి తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్న 18 ఏళ్ల క్వెనా మఫాకా వీరిలో ముందుగా బలయ్యాడు. అతని తొలి ఓవర్లో వరుసగా 6, 6, 4, 4 బాదిన హెడ్... హార్దిక్ ఓవర్లో వరుసగా 3 ఫోర్లు కొట్టాడు. కొయెట్జీ ఓవర్లోనూ వరుసగా 4, 4, 6 బాదిన హెడ్ 18 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. చావ్లా వేసిన తర్వాతి ఓవర్లో అభిషేక్ 3 భారీ సిక్సర్లతో స్వాగతం పలికాడు. హెడ్ వెనుదిరిగిన తర్వాత అభిషేక్ మరింత చెలరేగిపోయాడు. మఫాకా ఓవర్లో వరుసగా 4, 6, 6, 4 కొట్టిన అతను 16 బంతులకే హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. 11వ ఓవర్ చివరి బంతికి అభిషేక్ అవుట్ కాగా... తర్వాతి 9 ఓవర్ల బాధ్యతను క్లాసెన్ తీసుకున్నాడు. మిత్రుడు మార్క్‌రమ్ (28 బంతుల్లో 42 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) సహకారంతో అతను సిక్సర్లతోనే పరుగులు రాబడుతూ దూసుకుపోయాడు. మఫాకా ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన అతను 23 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 14.4 ఓవర్లలోనే జట్టు స్కోరు 200 పరుగులు దాటింది. తన తొలి 3 ఓవర్లలో 23 పరుగులు ఇచ్చి ఒకింత మెరుగైన ప్రదర్శన ఇచ్చిన బుమ్రా కూడా తన చివరి ఓవర్లో క్లాసెన్ జోరుకు 13 పరుగులు ఇచ్చుకున్నాడు. ములానీ వేసిన ఆఖరి ఓవర్లోనూ వరుసగా 4, 6, 6 బాదిన క్లాసెన్ ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్కోరును తన జట్టును అందించాడు. సన్‌రైజర్స్ హెడ్ స్థానంలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉమ్రాన్ మలిక్‌ను బరిలోకి దించింది.


హెడ్

తిలక్ వర్మ పోరాటం...

ఓవర్‌కు 13.9 పరుగులు... భారీ లక్ష్య ఛేదనలో ఈ రన్‌రేట్‌తో పరుగులు చేయాల్సిన స్థితిలో ముంబై బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనింగ్, ఆ తర్వాత మూడో వికెట్ భాగస్వామ్యాలు దూకుడుగానే సాగినా... ఇది సరిపోలేదు. రోహిత్ శర్మ (12 బంతుల్లో 26; 1 ఫోర్, 3 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (13 బంతుల్లో 34; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధాటిగా ఆరంభించి తొలి వికెట్‌కు 20 బంతుల్లోనే 56 పరుగులు జోడించారు. ఉనాద్కట్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టిన కిషన్... భువీ వేసిన తర్వాతి ఓవర్లో 3 సిక్స్‌లు, ఫోర్ బాదాడు. అయితే వీరిద్దరిని 10 పరుగుల వ్యవధిలో అవుట్ చేసి రైజర్స్ పైచేయి సాధించింది. ఆ తర్వాత తిలక్, నమన్ ధీర్ (14 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరింత దూకుడు ప్రదర్శించారు. వీరిద్దరు 37 బంతుల్లోనే 84 పరుగులు జత చేశారు. నమన్ వెనుదిరిగాక, షహబాజ్ ఓవర్లో 3 భారీ సిక్సర్లు కొట్టిన తిలక్ 24 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. చివర్లో డేవిడ్, హార్దిక్ పాండ్యా (24) పోరాటం ఫలితమివ్వలేదు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: మయాంక్ (సి) డేవిడ్ (బి) పాండ్యా 11; హెడ్ (సి) నమన్ (బి) కొయెట్జీ 62; అభిషేక్ శర్మ (సి) నమన్ (బి) చావ్లా 63; మార్క్‌రమ్ (నాటౌట్) 42; క్లాసెన్ (నాటౌట్) 80; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 277.** **వికెట్ల పతనం:** 1-45, 2-113, 3-161. **బౌలింగ్:** మఫాకా 4-0-66-0, పాండ్యా 4-0-46-1, బుమ్రా 4-0-36-0, కొయెట్జీ 4-0-57-1, చావ్లా 2-0-34-1, షమ్స్ ములానీ 2-0-33-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 26; ఇషాన్ కిషన్ (సి) మార్క్‌రమ్ (బి) షహబాజ్ 34; నమన్ ధీర్ (సి) కమిన్స్ (బి) ఉనాద్కట్ 30; తిలక్ వర్మ (సి) మయాంక్ (బి) కమిన్స్ 64; పాండ్యా (సి) క్లాసెన్ (బి) ఉనాద్కట్ 24; టిమ్ డేవిడ్ (నాటౌట్) 42; షెఫర్డ్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 246.** **వికెట్ల పతనం:** 1-56, 2-66, 3-150, 4-182, 5-224. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-53-0, ఉనాద్కట్ 4-0-47-2, షహబాజ్ 3-0-39-1, కమిన్స్ 4-0-35-2, ఉమ్రాన్ 1-0-15-0, మర్కండే 4-0-52-0.


క్లాసెన్

ఐపీఎల్‌లో టాప్-5 అత్యధిక స్కోర్లు

జట్టు	స్కోరు	ప్రత్యర్థి	వేదిక	ఎప్పుడు
హైదరాబాద్	277/3	ముంబై	హైదరాబాద్	27-3-2024
బెంగళూరు	263/5	పుణే	బెంగళూరు	23-4-2013
లక్నో	257/5	పంజాబ్	మొహాలి	28-4-2023
బెంగళూరు	248/3	లయన్స్	బెంగళూరు	14-5-2016
చెన్నై	246/5	రాజస్తాన్	చెన్నై	3-4-2010

ఓవరాల్ టి20ల్లో టాప్-5 అత్యధిక స్కోర్లు

జట్టు	స్కోరు	ప్రత్యర్థి	వేదిక	ఎప్పుడు
నేపాల్	314/3	మంగోలియా	హాంగ్జౌ	27-9-2023
అఫ్గానిస్తాన్	278/3	ఐర్లాండ్	డెహ్రాడూన్	23-2-2019
చెక్ రిపబ్లిక్	278/4	టర్కీ	ఇల్ఫోవ్‌కౌంటీ	30-8-2019
సన్‌రైజర్స్	277/3	ముంబై	హైదరాబాద్	27-3-2024
పంజాబ్	275/6	ఆంధ్ర	రాంచీ	17-10-2023

523 ఓవరాల్ టి20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు నమోదైన మ్యాచ్‌గా హైదరాబాద్, ముంబై ఇండియన్స్ మ్యాచ్ నిలిచింది. గత ఏడాది మార్చి 26న సెంచూరియన్ పార్క్‌లో దక్షిణాఫ్రికా (18.5 ఓవర్లలో 259/4), వెస్టిండీస్ (20 ఓవర్లలో 258/5) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 517 పరుగులు నమోదయ్యాయి. ఇక ఐపీఎల్ మ్యాచ్‌ల విషయానికొస్తే 2010లో చెన్నై సూపర్ కింగ్స్ (246/5), రాజస్తాన్ రాయల్స్ (223/5) మ్యాచ్‌లో మొత్తం 469 పరుగులు వచ్చాయి.

38 హైదరాబాద్, ముంబై ఇండియన్స్ మ్యాచ్‌లో నమోదైన సిక్స్‌లు. ఒక టి20 మ్యాచ్‌లో ఇవే అత్యధికం. 2018లో అఫ్గానిస్తాన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా లెజెండ్స్, కాబుల్ జ్వానన్ మ్యాచ్‌లో మొత్తం 37 సిక్స్‌లు వచ్చాయి.

148 ముంబైతో మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి 10 ఓవర్లలో చేసిన పరుగులు. ఒక ఐపీఎల్ మ్యాచ్‌లో ఇవే అత్యధికం.

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ × ఢిల్లీ
వేదిక: జైపూర్
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా

కొత్త పాయింట్‌తో...


గోపీచంద్

గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో ఓ సినిమా షురూ అయిన విషయం తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ టీజీ విశ్వప్రసాద్‌తో కలిసి చిత్రాలయం స్టూడియోస్‌పై డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ వేణు దోనేపూడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కొత్త షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వేణు దోనేపూడి మాట్లాడుతూ – ''ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశాం. దాంతో టాకీ పార్ట్ మొత్తం పూర్తవుతుంది. శ్రీను వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఒక కొత్త పాయింట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో గోపీచంద్ ఒక కొత్త అవతారంలో కనిపిస్తారు. శ్రీను వైట్ల తీసిన బ్లాక్‌బస్టర్స్ చిత్రాలకు రచయితగా చేసిన గోపీ మోహన్ ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు'' అన్నారు. హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలను త్వరలో ప్రకటిస్తామని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: కేవీ గుహన్.


ప్రభాస్

పారడైసు పావడేసుకొచ్చెనండి...

'జరగండి జరగండి... జాబిలమ్మ జాకెట్టేసుకొచ్చెనండి... జరగండి జరగండి... పారడైసు పావడేసుకొచ్చెనండి...' అంటూ పాట అందుకున్నారు రామ్‌చరణ్. ఈ జాబిలమ్మ ఎవరూ అంటే కియారా అద్వానీ. రామ్‌చరణ్, కియారా అద్వానీ జంటగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'గేమ్ ఛేంజర్' చిత్రంలోని పాట ఇది. రామ్‌చరణ్ పుట్టినరోజు ప్రత్యేకంగా బుధవారం 'జరగండి..' లిరికల్ సాంగ్‌ను 150కు పైగా థియేటర్లలో విడుదల చేశారు. ఎస్ఎస్ తమన్ స్వరపరచిన ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా దలేర్ మెహందీ, సునిధీ చౌహాన్ పాడారు. అనిత సమర్పణలో జీ స్టూడియోస్ అసోసియేషన్‌తో 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె. సూర్య, సునీల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తిరుణ్ణావుకరసు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.


కియారా అద్వానీ, రామ్‌చరణ్

లండన్‌లో కొత్త ఇల్లు?

లండన్‌లో ప్రభాస్ ఓ ఇంటిని కొనుగోలు చేశారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. వెకేషన్ లేదా సినిమా షూటింగ్‌ల కోసం లండన్ వెళ్లినప్పుడు అక్కడ నివాసం ఉండేలా ప్రభాస్ ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారట. ఇప్పుడు అదే ఇంటిని ప్రభాస్ సొంతం చేసుకున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. లండన్‌లోని ప్రభాస్ ఇల్లు లావిష్‌గా ఉంటుందని, తన అభిరుచికి తగ్గట్టుగా గ్రాండ్‌గా ఇంటీరియర్ డిజైన్ చేయించుకున్నారని ఫిల్మ్‌నగర్ టాక్.

ఇక సినిమాల విషయానికి వస్తే... ప్రస్తుతం 'కల్కి 2898 ఏడీ', 'రాజాసాబ్' చిత్రీకరణలతో ప్రభాస్ బిజీగా ఉన్నారు. అలాగే వేసవి తర్వాత 'సలార్' మలి భాగం 'సలార్: శౌర్యంగా పర్వం' చిత్రీకరణలో పాల్గొననున్నారు ప్రభాస్. ఇంకా మంచు విష్ణు టైటిల్ రోల్ చేస్తున్న 'కన్నప్ప' చిత్రంలో ప్రభాస్ ఓ గెస్ట్ రోల్ చేస్తారని తెలిసిందే. ఈ పాత్ర చిత్రీకరణ ఎప్పుడన్నది తెలియాల్సి ఉంది.


రాశీ ఖన్నా

సీక్రెట్ పెళ్లి

వనపర్తి జిల్లా రంగనాయకస్వామి సన్నిధిలో ఒక్కటైన సిద్ధార్థ్, అదితీరావు

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావు బుధవారం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని రంగనాయకస్వామి ఆలయంలో హిందు సంప్రదాయం ప్రకారం ఒక్కటయ్యారు. కుటుంబ సభ్యులు, మిత్రులు కేవలం 30-40 మంది సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. మంగళవారం రాత్రి నుంచే రంగనాయకస్వామి ఆలయాన్ని పూర్తిగా వారి ఆధీనంలోకి తీసుకుని ఇతరులు ఎవరూ (ఆలయ పూజారులు, పనిచేసే వారిని సైతం) లోపలికి అనుమతించకుండా ఏర్పాట్లు చేసి ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు పెళ్లి తంతు ముగించినట్లు సమాచారం. ఓ కార్‌వ్యాన్‌తో పాటు హైదరాబాద్ పాసింగ్ హై ఎండ్ కార్లు బుధవారం శ్రీరంగాపూర్‌లో సందడి చేయడంతో మొదట షూటింగ్ పెళ్లి అని ప్రచారం జరిగింది. కానీ, కొద్దిసేపటికి వనపర్తి సంస్థానాధీశుల వారసులు సైతం పెళ్లికి రావడంతో నిజమైన పెళ్లిగా బయటి వారికి తెలిసింది.

రాజారామేశ్వర్‌రావు మనుమరాలు అదితీరావు

వనపర్తి సంస్థానాధీశుల చివరి రాజైన రాజారామేశ్వర్‌రావు పెద్ద కూతురు విద్యారావు ఏకైక కూతురు అదితీరావు హీరోయిన్‌గా పలు సినిమాల్లో నటించారు. సిద్ధార్థ్, అదితీరావు కలిసి 'మహాసముద్రం' చిత్రంలో నటించారు. అప్పటి నుంచి సన్నిహితంగా ఉన్నారు. పెద్దల అంగీకారంతో అదితీ తాతలు కట్టించిన పురాతన ఆలయంలో పెళ్లి చేసుకోవడం విశేషం. పెళ్లికి సంస్థానాధీశుల వారసులు రాజా కృష్ణదేవరావు, ఆయన కుటుంబ సభ్యులు, అదితీరావు తల్లి, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు హాజరైనట్లు తెలిసింది. శ్రీరగాపురం లో పెళ్లి తర్వాత వనపర్తిలోని రాజావారి తోటలో పెళ్లి భోజనాలు ఏర్పాట్లు చేశారు. కాగా.. స్థానికులు, మీడియా ట్రస్టు నిర్వాహకులు, పని వాళ్లను సైతం అనుమతించకపోవడం, అక్కడికి వెళ్లిన వారి సెల్ ఫోన్లను సెక్యూరిటీ ముందుగానే డిపాజిట్ చేసుకోవడంతో పెళ్లికి సంబంధించిన ఫొటోలు బయటకు రాలేదు.

– సాక్షి ప్రతినిధి, వనపర్తి.


అదితీరావు హైదరీ, సిద్ధార్థ్

హారర్... హ్యూమర్

కోలీవుడ్ హారర్ ఫ్రాంచైజీ 'అరణ్మణై' నాలుగో భాగం 'అరణ్మణై 4' విడుదలకు సిద్ధమైంది. నటుడు, దర్శక-నిర్మాత సుందర్. సి నటించి, స్వీయ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తమన్నా, రాశీ ఖన్నా, సంతోష్ ప్రతాప్ లీడ్ రోల్స్‌లో నటించారు. ఖుష్బూ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్‌లో విడుదల కానుంది. ''చిల్... థ్రిల్... హారర్... హ్యూమర్... 'ఇలా అన్ని అంశాల మేళవింపుతో మా చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రాన్ని తెలుగులోనూ విడుదల చేయాలనుకుంటున్నారు. అలాగే ఏప్రిల్ 11న రిలీజ్ డేట్ ఉండొచ్చని సమాచారం. నిజానికి ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతి సమయంలోనే విడుదల చేయాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేశారు. ఇప్పుడు వేసవి రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్.

బ్యాడ్ బాయ్స్ రెడీ


మార్టిన్, విల్ స్మిత్

హాలీవుడ్ బ్యాడ్ బాయ్స్ మళ్లీ వస్తున్నారు. హాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీలో ఒకటైన 'బ్యాడ్ బాయ్స్' నుంచి రానున్న తాజా చిత్రం 'బ్యాడ్ బాయ్స్: రైడ్ ఆర్ డై'. 'బ్యాడ్ బాయ్స్' ఫ్రాంచైజీలో వస్తోన్న నాలుగో చిత్రం ఇది. విల్ స్మిత్, మార్టిన్ లారెన్స్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. మూడో భాగానికి దర్శకత్వం వహించిన అదిల్-శ్రీశ్రీబిలాల్ దర్శకత్వ ద్వయమే 'బ్యాడ్ బాయ్స్ 4'ను డైరెక్ట్ చేశారు. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమాను జూన్ 7న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. సిటీలో జరుగుతున్న డ్రగ్ మాఫియా ఆగడాలను ఇద్దరు డిటెక్టివ్‌లు ఏ విధంగా అడ్డుకున్నారు? అనే ఇతివృత్తంతో ఈ సినిమా కథనం ఉంటుందని హాలీవుడ్ సమాచారం.

ఎవరితో పయనం...


'లవ్ మాక్‌టైల్ 2' పోస్టర్

కన్నడ సూపర్ హిట్ 'లవ్ మాక్‌టైల్ 2' అదే టైటిల్‌తో తెలుగులో విడుదల కానుంది డార్లింగ్ కృష్ణ హీరోగా నటించి, దర్శకత్వం వహించి, నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగులో ఎంవీఆర్ కృష్ణ విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'ఎవరితో పయనం...' అంటూ సాగే పాటను విడుదల చేశారు. నకుల్ అభయాన్కర్ స్వరపరచిన ఈ పాటకు గురుచరణ్ సాహిత్యం అందించగా యోగి సురేష్ పాడారు. ఈ సందర్భంగా ఎంవీఆర్ కృష్ణ మాట్లాడుతూ – ''డార్లింగ్ కృష్ణ తనే నిర్మాతగా, దర్శకుడుగా వ్యవహరిస్తూ హీరోగా నటించిన 'లవ్ మాక్‌టైల్, లవ్ మాక్‌టైల్ 2' బ్లాక్ బస్టర్ హిట్ సినిమాలుగా నిలిచాయి. 'లవ్ మాక్‌టైల్ 2'ని తెలుగులో ఈ వేసవిలోనే విడుదల చేస్తాం'' అన్నారు. మిలినా నాగరాజ్, అమృతా అయ్యంగార్, రచల్ డేవిడ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

సాక్షి బిజినెస్
గురువారం
28-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
526	119
72,996	22,124

విదేశీ సూచీలు (బుధ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,330	▲ 14
డోజోన్స్	39,541	▲ 254
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,932	▲ 1
డాక్స్	18,477	▲ 93
షాంఘై	2,993	▽ 38
నికాయ్	40,763	▲ 365

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	66,834	▲ 118
బంగారం (99.5 స్వచ్ఛత)	66,566	▲ 117
వెండి (కేజీ)	73,997	▽ 282

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.95	83.97
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.23	106.78
€	యూరో	ఒకటి	89.30	91.68
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.64	55.75
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.64	55.56
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.64	64.35
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.30	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.78	23.57
¥	చైనా యువాన్	ఒకటి	10.42	12.49

హైస్పీడులో గేమింగ్ మార్కెట్..

ఐదేళ్లలో రెట్టింపు • 2028 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేరిక • 24 కోట్లకు చేరనున్న పెయిడ్ యూజర్ల సంఖ్య • విన్‌జో నివేదిక



న్యూఢిల్లీ: భారతీయ గేమింగ్ పరిశ్రమ వార్షికాదాయం ఐదేళ్లలో దాదాపు రెట్టింపు కానుంది. 2028 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేరనుంది. 2023లో ఇది 3.1 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఆన్‌లైన్ గేమింగ్ సంస్థ విన్‌జో సంయుక్తంగా రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 'ఇండియా గేమింగ్ రిపోర్ట్ 2024' ప్రకారం 2028 నాటికి పెయిడ్ యూజర్ల సంఖ్య 24 కోట్లకు చేరనుంది. 2023లో ఇది 14.4 కోట్లుగా ఉంది. 'భారతీయ గేమింగ్ రంగంలో 1,400 గేమింగ్ కంపెనీలు ఉన్నాయి. వీటిలో 500 గేమింగ్ స్టూడియోలు ఉన్నాయి. 2028 నాటికి గేమింగ్‌కి సంబంధించి వార్షికాదాయం 6 బిలియన్ డాలర్లకు చేరగలదని అంచనాలు ఉన్నాయి' అని నివేదిక తెలిపింది. రిపోర్టు ప్రకారం ప్రొఫెషనల్ ప్లేయర్ల సంఖ్య 2023లో 500గా ఉండగా వచ్చే అయిదేళ్లలో 2.5 రెట్లు పెరగనుంది. ఈ-స్పోర్ట్స్‌కి ప్రభుత్వ గుర్తింపు లభించడంతో పాటు ఈ-స్పోర్ట్స్ టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు కొన్ని రాష్ట్రాలు తగు చర్యలు తీసుకుంటున్నాయి.

నాలుగేళ్లలో భారీగా డౌన్‌లోడ్స్..

'2019 నుంచి 2023 మధ్య కేవలం నాలుగేళ్ల వ్యవధిలో భారత్‌లో గేమ్ డౌన్‌లోడ్లు 565 కోట్ల నుంచి 950 కోట్లకు చేరాయి. దీంతో అంతర్జాతీయంగా గేమ్ డౌన్‌లోడ్స్‌లో భారత వాటా గతేడాది ఏకంగా 16 శాతానికి చేరింది. 450 కోట్లు (7.6 శాతం మార్కెట్ వాటా), 440 కోట్లు (7.4 శాతం మార్కెట్ వాటా) డౌన్‌లోడ్స్‌తో బ్రెజిల్, అమెరికా తర్వాత స్థానాల్లో ఉన్నాయి' అని రిపోర్టు తెలిపింది. దీని ప్రకారం దేశీయంగా 56.8 కోట్ల మంది గేమర్స్, 15,000 మంది పైచిలుకు గేమ్ డెవలపర్లు, ప్రోగ్రామర్లు ఉన్నారు. మూడేళ్ల క్రితం ప్రతి అయిదుగురు గేమర్లలో ఒక్క మహిళ మాత్రమే ఉండేవారు. కానీ ప్రస్తుతం గేమర్లలో 40 శాతం మంది మహిళలు ఉంటున్నారు. 'భారత గేమింగ్ మార్కెట్లో మొబైల్ గేమింగ్ వాటా 90 శాతంగా ఉంది. అదే అమెరికాలో ఇది 37 శాతంగా, చైనాలో 62 శాతంగా ఉంది. 50 శాతం మంది గేమర్లు 18–30 ఏళ్ల మధ్య వయస్సువారే' అని నివేదిక వివరించింది. ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమలో వచ్చే 10 ఏళ్లలో మరో 2.5 లక్షల ఉద్యోగాల కల్పన జరగనుంది. ప్రస్తుతం 1 లక్ష మంది నిపుణులు ప్రత్యక్షంగా, పరోక్షంగా గేమింగ్‌తో ఉపాధి పొందుతున్నారు.

హైదరాబాద్‌లో జీవోసీఎల్ స్థలం మానిటైజేషన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో 264.50 ఎకరాల స్థలాన్ని మానిటైజ్ (విక్రయించడం లేదా లీజుకివ్వడం) చేసేందుకు స్క్వేర్‌స్పేస్ బిల్డర్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు జీవోసీఎల్ కార్పొరేషన్ వెల్లడించింది. దీనితో రూ. 3,402 కోట్లు లభించనున్నట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించి తొలి దశలో రూ.520 కోట్లు అందనున్నట్లు వివరించింది. అగ్రిమెంటులో భాగంగా 32 ఎకరాల స్థలాన్ని హిందుజా హెల్త్‌కేర్‌తో సంయుక్తంగా అభివృద్ధి చేసే అంశం కూడా ఉన్నట్లు పేర్కొంది.

డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో సైయంట్ జట్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్, టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ సైయంట్ జర్మనీకి చెందిన డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. దీని కింద 40 సీటర్ డీ328ఎకో రీజనల్ టర్బోప్రాప్ విమానాలకు వెనుకవైపు భాగం (ఫ్యుసిలేజ్) తయారీ డిజైన్‌పై ఇరు సంస్థలు కలిసి పని చేయనున్నట్లు సైయంట్ వెల్లడించింది. ఇంధనాన్ని గణనీయంగా ఆదా చేసే డీ328ఎకో విమానాలు డోర్నియర్ 328 సిరీస్ ఎయిర్‌క్రాఫ్ట్‌లకు అప్‌గ్రేడెడ్ వెర్షన్.

సనోఫీ వ్యాక్సిన్లు పంపిణీ చేయనున్న రెడ్డీస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సనోఫీ హెల్త్‌కేర్ ఇండియాతో ప్రత్యేక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ బుధవారం తెలిపింది. ఇందులో భాగంగా సనోఫీ తయారీ వ్యాక్సిన్లకు ప్రచారం కల్పించడంతో పాటు పంపిణీ బాధ్యతలను రెడ్డీస్ చేపడుతుంది. 'సనోఫీ పోర్ట్‌ఫోలియో కంపెనీకి వ్యాక్సిన్ విభాగంలో బలమైన ఉనికిని అందిస్తుంది. భారత్‌లో వ్యాక్సిన్ కంపెనీల్లో రెండవ స్థానానికి మమ్మల్ని ముందుకు తీసుకువెళుతుంది' అని రెడ్డీస్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-3-2024	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	72.00
27-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.35

జీడీపీలో 2 శాతం ప్రత్యక్ష పెట్టుబడితో భారీ ఉపాధి

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ నివేదిక

న్యూఢిల్లీ: భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 2 శాతం ప్రత్యక్ష ప్రభుత్వ పెట్టుబడితో 11 మిలియన్ల ఉద్యోగాలను సృష్టించవచ్చని ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఎల్‌ఓ) తాజా నివేదిక పేర్కొంది. మొత్తం ఉపాధి సృష్టిలో దాదాపు 70 శాతం మహిళలకు ప్రయోజనం కలుగుతుందని కూడా విశ్లేషించింది. భారత్ పురోగతికి తీసుకోవాల్సిన అంశాలపై ఎఫ్‌ఎల్‌ఓ ఒక రోడ్‌మ్యాప్‌ను కూడా ఆవిష్కరించింది. వీటిలో అంశాలు– లీవ్ పాలసీలు, కేర్ సర్వీస్ సబ్సిడీలు, కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెట్టుబడి, కేర్ వర్కర్లకు నైపుణ్య శిక్షణ, నాణ్యత హామీ కీలకమైనవని నివేదిక పేర్కొంది.

బుల్ బ్యాక్ ర్యాలీ



ముంబై: ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాల నమోదుతో బ్యాంకింగ్, ఆటో, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 526 పాయింట్లు పెరిగి 72,996 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 119 పాయింట్లు బలపడి 22,100 స్థాయిపైన 22,124 వద్ద నిలిచింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(1%), రిలయన్స్ ఇండస్ట్రీస్(4%), మారుతీ సుజుకీ(2%) షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందడంతో సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి.



- నష్టాలు ఒకరోజుకే పరిమితం
- సూచీలకు రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్ల దన్ను
- రాణించిన బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు

మారుతీ సుజుకీ రూ.12,256 జీవిత కాల గరిష్టాన్ని తాకింది. దీనితో ఇంట్రాడేలో మార్కెట్ క్యాప్ రూ.4 లక్షల కోట్లను అందుకుంది.

రోజంతా లాభాలే..

ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ఆసక్తి చూపడంతో రోజంతా లాభాల్లో కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 668 పాయింట్లు బలపడి 73,139 వద్ద, నిఫ్టీ 188 పాయింట్లు ఎగసి 22,193 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి.

మళ్లీ రూ.20 లక్షల కోట్లపైకి రిలయన్స్ మార్కెట్ క్యాప్

రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ షేరు 3.60% లాభపడి రూ.2988 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ రేటింగ్ సంస్థ గోల్డ్‌మెన్ శాక్స్ రిలయన్స్ కంపెనీ షేరు టార్గెట్ ధరను పెంచడంతో పాటు క్రూడాయిల్ ధరలు దిగిరావడం ఈ షేరుకు డిమాండ్ లభించింది. ట్రేడింగ్‌లో 4% లాభపడి రూ.3000 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. ఈ క్రమంలో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.70,039 కోట్లు పెరిగి రూ.20.21 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. ఈ ఫిబ్రవరి 13న కంపెనీ రిలయన్స్ క్యాప్ రూ.20 లక్షల కోట్ల స్థాయిని అందుకుంది. దేశంలో టాప్-5 మార్కెట్ క్యాప్ కలిగిన సంస్థల్లో రిలయన్స్ అగ్రస్థానంలో నిలవగా.., టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

- జ్యువెలరీ రిటైల్ కంపెనీ పీఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది.
- బజాజ్ ఫైనాన్స్‌కు చెందిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. తద్వారా కంపెనీ 10 బిలియన్ డాలర్ల(రూ. 83,000 కోట్లు) సమీకరించే యోచనలో ఉన్నట్లు సమాచారం.

25 షేర్లలో నేటి నుంచి కొత్త సెటిల్‌మెంట్.. టీప్లస్‌జీరో

స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ నేటి(గురువారం) నుంచి టీప్లస్ జీరో సెటిల్‌మెంట్‌కు తెరతీస్తున్నాయి. తొలుత 25 షేర్లలో ఆప్షనల్ పద్ధతిన అమలు చేయనున్నాయి. ఈక్విటీ నగదు మార్కెట్లో ప్రస్తుతం అమలవుతున్న టీప్లస్1 సెటిల్‌మెంట్‌కు జతగా పరిశీలన పద్ధతిలో టీప్లస్0కు శ్రీకారం చుడుతున్నాయి. కొద్దిమంది బ్రోకర్ల ద్వారా మాత్రమే ఇందుకు వీలు కల్పిస్తున్నాయి. వెరసి ఈ నెల 28 నుంచి లావాదేవీ చేపట్టిన రోజునే సెటిల్‌మెంట్ పూర్తికానుంది. ఈ జాబితాలో బజాజ్ ఆటో, వేదాంతా, హిండాల్కో, ఎస్‌బీఐ, ట్రెంట్, టాటా కమ్యూనికేషన్స్, నెస్లే, సిప్లా, ఎంఆర్‌ఎఫ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బీపీసీఎల్, ఓఎన్‌జీసీ, ఎన్ఎండీసీ, అంబుజా సిమెంట్స్ తదితరాలున్నాయి. తాజా సెటిల్‌మెంట్‌తో సమయం, వ్యయాలు ఆదా అవుతాయని అంచనా. మార్కెట్ లావాదేవీల్లో ఈ వ్యవస్థ మరింత పారదర్శకత తీసుకువస్తుందని భావిస్తున్నారు.

టాటా మోటార్స్, హెచ్‌పీసీఎల్ జోడీ

న్యూఢిల్లీ: టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ తాజాగా హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్‌తో (హెచ్‌పీసీఎల్) భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా హెచ్‌పీసీఎల్‌కు చెందిన 5,000 ఫ్యూయల్ స్టేషన్స్‌లో ఈ ఏడాది డిసెంబర్‌కల్లా ఎలక్ట్రిక్ వాహనాలకు అవసరమైన చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. అలాగే చెల్లింపులను సులభతరం చేసేందుకు ఇరు సంస్థలు కలిసి ఆర్‌ఎఫ్‌ఐడీ కార్డులను జారీ చేయనున్నాయి. హెచ్‌పీసీఎల్‌కు దేశవ్యాప్తంగా 21,500ల పైచిలుకు ఫ్యూయల్ స్టేషన్స్ ఉన్నాయి. భారతీయ రోడ్లపై 1.2 లక్షలకుపైగా యూనిట్ల టాటా ఎలక్ట్రిక్ వాహనాలు పరుగెడుతున్నాయి.

జీలాబ్ ఫార్మసీలో రణదీప్ హుడా



హైదరాబాద్: ప్రముఖ నటుడు రణదీప్ హుడా జీలాబ్ ఫార్మసీతో చేతులు కలిపారు. ఇప్పటికే భారీ తగ్గింపు ధరతో ఔషధాలను అందిస్తున్న జీలాబ్ ఫార్మసీ ఈ ధరలను 90 శాతం తగ్గించేందుకు హుడా తన సహకారాన్ని అందించనున్నారని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన పేర్కొంది. మెడిసిన్ ధరల భారీ తగ్గింపుద్వారా భారత ఫార్మా ఇండస్ట్రీలో విప్లవాత్మక మార్పు తీసుకునిరావాలన్నది తమ లక్ష్యమని సంస్థ వ్యవస్థాపకులు రోహిత్ ముఖల్ పేర్కొన్నారు.

వొడా–ఐడియా ఎంటర్‌టైన్‌మెంట్ యాప్

ముంబై: వొడాఫోన్ ఐడియా (వీఐ) వీఐ మూవీస్ అండ్ టీవీ యాప్‌ను ఆవిష్కరించింది. దీనితో 13 పైగా ఓటీటీ యాప్‌లు, 400 పైచిలుకు లైవ్‌టీవీ చానెళ్లతో పాటు షెమారూ, హంగామా మొదలైన సంస్థల కంటెంట్ లైబ్రరీలు కూడా అందుబాటులో ఉంటాయి. ప్రీపెయిడ్, పోస్ట్‌పెయి చార్జీలు దాదాపు రూ. 200.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీలో 147 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీ ఎస్సీ) దేశవ్యాప్తంగా కేంద్ర శాఖలు/విభాగాల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 147
» **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్‌బి(మెకానికల్)-01, ఆంత్రోపాలజిస్ట్(ఫిజికల్ ఆంత్రోపాలజీ)- 01, స్పెషలిస్ట్ గ్రేడ్-3, అసిస్టెంట్ ప్రొఫెసర్ (అనెస్తీషియాలజీ)-48, స్పెషలిస్ట్ గ్రేడ్-3, అసిస్టెంట్ ప్రొఫెసర్(కార్డియో వాస్కులర్, థొరాసిక్ సర్జరీ)-05, స్పెషలిస్ట్ గ్రేడ్3, అసిస్టెంట్ ప్రొఫెసర్(నియోనాటాలజీ)-19, స్పెషలిస్ట్ గ్రేడ్3, అసిస్టెంట్ ప్రొఫెసర్ (న్యూరాలజీ)-26, స్పెషలిస్ట్ గ్రేడ్3, అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఆబ్‌స్టేట్రిక్స్-గైనకాలజీ)-20, స్పెషలిస్ట్ గ్రేడ్ 3, అసిస్టెంట్ ప్రొఫెసర్(ఫిజికల్ మెడిసిన్, రిహాబిలిటేషన్)-05, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(వాటర్ రిసోర్సెస్)-04, సైంటిస్ట్-బి (సివిల్ ఇంజనీరింగ్)-08, సైంటిస్ట్-బి (ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్)-03, అసిస్టెంట్ డైరెక్టర్(సేఫ్టీ)-07.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.04.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి వివరాల నమోదుకు చివరితేది:** 12.04.2024.
» **వెబ్‌సైట్:** upsc.gov.in.

నావల్ డాక్‌యార్డ్, ముంబైలో 301 అప్రెంటిస్‌లు

ముంబైలోని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(నేవీ), నేవల్ డాక్‌యార్డ్ అప్రెంటిస్ స్కూల్‌లో వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 301
» **ఖాళీల వివరాలు:** ఏడాది అప్రెంటిస్‌షిప్ ట్రెనింగ్-288, రెండేళ్ల అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్-13.
» **ట్రేడులు:** ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రోప్లేటర్, ఫిట్టర్, ఫౌండ్రీ మ్యాన్, మెకానిక్(డీజిల్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, ఎంఎంటీఎం, పెయింటర్(జి), ప్యాటర్న్ మేకర్, పైప్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, షీట్ మెటల్ వర్కర్, షిప్ రైట్ (ఉడ్), టైలర్(జి), వెల్డర్(జి అండ్ ఇ), మేసన్ (బీసీ),ఐ అండ్ సీటీఎస్ఎం, షిప్ రైట్(స్టీల్), రిగ్గర్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్.
» **అర్హత:** ఎనిమిది, పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: కనిష్ఠ వయసు 14 ఏళ్లు, గరిష్ఠ వయోపరిమితి లేదు.
» **స్టైపెండ్:** నెలకు రూ.6000 నుంచి రూ.7000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ/స్కిల్ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.04.2024.
» **వెబ్‌సైట్:** https://dasapprenticembi.recttindia.in/

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో 733 అప్రెంటిస్‌లు

బిలాస్‌పూర్ డివిజన్‌లోని సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే లో ఒప్పంద ప్రాతిప దికన అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 733
» **ట్రేడులు:** కార్పెంటర్, సీవోపీఏ, డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రికల్(మెకానికల్), ఫిట్టర్, మెషినిస్ట్, పెయింటర్, ప్లంబర్, మెకానికల్(ఆర్ఏసీ), ఎస్ఎండబ్ల్యూ, స్టెనో(ఇంగ్లిష్), స్టెనో(హిందీ), డీజిల్ మెకానిక్, టర్నర్, వెల్డర్, వైర్‌మెన్, కెమికల్ ల్యాబొరేటరీ అసిస్టెంట్, డిజిటల్ ఫోటోగ్రఫీ.
» **అర్హత:** పదో తరగతి, పన్నెండో తరగతి కన్నా తక్కువ లేదా సమానమైన విద్యార్హత తదితర ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 12.04.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతి, ఇంటర్ మార్కుల మెరిట్ లిస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.04.2024.
» **వెబ్‌సైట్:** secr.indianrailways.gov.in/

టెట్.. సక్సెస్ రూట్!

- టీఎస్ టెట్-2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
- మే 20 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు
- టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌కు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి
- నిర్దిష్ట వ్యూహాలతో విజయం సాధించే అవకాశం

తెలంగాణ విద్యాశాఖ కొద్దిరోజుల క్రితం మొత్తం 11,602 టీచర్ పోస్ట్‌ల భర్తీకి టీఆర్‌టీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్ట్‌లకు తాజా అభ్యర్థులకు కూడా అవకాశం కల్పించేందుకు టీఎస్ టెట్-2024 ప్రక్రియ ప్రారంభించింది. డీఎస్సీ కంటే ముందుగానే టెట్‌ను నిర్వహించి.. కొత్త వారికి సైతం టీఆర్‌టీకి దరఖాస్తు చేసుకునే విధంగా గడువు తేదీని పొడిగించింది. ఈ నేపథ్యంలో.. టీఎస్ టెట్‌తో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం–టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ)కు హాజరు కావాలంటే.. బీఈడీ, డీఈడీలతోపాటు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో ఉత్తీర్ణత తప్పనిసరి. అప్పుడే టీఆర్‌టీకి దరఖాస్తుకు అవకాశం లభిస్తుంది. తాజాగా టీఆర్‌టీకి దరఖాస్తు చేసుకునేందుకు మార్గంగా టెట్‌ను నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

20 శాతం వెయిటేజీ

టీచర్ పోస్ట్‌ల భర్తీలో టెట్ స్కోర్‌కు వెయిటేజీ కూడా కల్పిస్తారు. టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌కు 80 శాతం; టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. డీఈడీ, బీఈడీ అర్హతతో నిర్వహించనున్న టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో రెండు పేపర్లు ఉంటాయి. అవి.. పేపర్-1, పేపర్-2.

పేపర్-1 అర్హతలు

- పేపర్-1ను ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించే ఎస్‌జీటీ పోస్ట్‌ల అభ్యర్థులకు నిర్వహిస్తున్నారు.
- ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్/నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్/రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్) ఉత్తీర్ణులవ్వాలి.

ఎస్ఏ..పేపర్-2

- ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల అభ్యర్థులకు టెట్ పేపర్-2ను నిర్వహిస్తారు.
- బీఏ/బీఎస్సీ/బీకాంలలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్) తదితర అర్హతలు ఉండాలి. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా టెట్ పేపర్లకు హాజరు కావచ్చు.

150 మార్కులకు టెట్ పేపర్-1

టెట్ పేపర్-1ను అయిదు విభాగాల్లో 150 ప్రశ్నలు-150 మార్కులకు నిర్వహిస్తారు. అవి.. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి (30 ప్రశ్నలు- 30 మార్కులు), లాంగ్వేజ్-1(30 ప్రశ్నలు-30 మార్కులు), లాంగ్వేజ్-2(30 ప్రశ్నలు-30 మార్కులు); మ్యాథమెటిక్స్(30 ప్రశ్నలు-30 మార్కులు); ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్(30 ప్రశ్నలు-30 మార్కు లు) ఉంటాయి. ఈ పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. లాంగ్వేజ్-1 సబ్జెక్ట్ కింద తెలుగు, ఉర్దూ, హిందీ, బెంగాలీ, కన్నడ, మరాఠీ, తమిళం, గుజరాతీ లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు. లాంగ్వేజ్-2 విభాగంలో ఇంగ్లిష్ సబ్జెక్ట్ ఉంటుంది.

పేపర్-2 స్వరూపం

టెట్ పేపర్-2 కూడా 150 ప్రశ్నలు-150 మార్కులకు నిర్వహిస్తారు. ఈ పేపర్ పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా జరుగుతుంది. ఇందులో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు-30 మార్కులకు, లాంగ్వేజ్ 1, 30 ప్రశ్నలు-30 మార్కులకు, లాంగ్వేజ్ 2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు-30 మార్కులకు, సంబంధిత సబ్జెక్ట్ (మ్యాథ్స్ అండ్ సైన్స్/ సోషల్ స్టడీస్) 60 ప్రశ్నలు-60 మార్కులకు ఉంటాయి.

కనీస అర్హత నిబంధన

టెట్ పేపర్-1, పేపర్-2లలో అభ్యర్థులు తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు పొందాలనే నిబంధన విధించారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులు, బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2024, మార్చి 27 – ఏప్రిల్ 10
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** మే 15 నుంచి
- **టెట్ తేదీలు:** మే 20–జూన్ 3 (పేపర్ 1 ఉదయం 9 నుంచి 11:30 వరకు; పేపర్-2 మధ్యాహ్నం 2 నుంచి 4:30 వరకు)
- **ఫలితాల వెల్లడి:** 2024, జూన్ 12
- **వెబ్‌సైట్:** tstet2024.aptonline.in/tstet/

ఉత్తమ స్కోర్ సాధించేలా

పేపర్-1 ప్రిపరేషన్ ఇలా

పేపర్-1కు సంబంధించి ముఖ్యంగా.. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీలో బోధన, లెర్నింగ్‌కు సంబంధించి ఎడ్యుకేషనల్ సైకాలజీపై ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధా నంగా శిశువు సైకాలజీకి సంబంధించిన అంశాలపై ఎక్కువగా దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు-సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా చదవాలి. ఇక పెడగాజి అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం – నాయకత్వం-గైడెన్స్-కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. పెడగాజీలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేయాలి.

లాంగ్వేజ్-1,2

పేపర్ 1గా అభ్యర్థులు తెలుగు, ఉర్దూ, హిందీ, కన్నడ, మరాఠీ, తమిళం భాషలను ఎంచుకోవచ్చు. సదరు సబ్జెక్ట్‌ను పదో తరగతి వరకు ఫస్ట్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. లాంగ్వేజ్-2లో ఇంగ్లిష్ పేపర్ ఉంటుంది. ఈ రెండు పేపర్లు పూర్తిగా ఆయా భాషల్లో నైపుణ్యాలను పరీక్షించే విధంగా ఉంటాయి. భాషా విభాగాలకు సంబంధించిన సాధారణ వ్యాకరణ అంశాలు, బోధన పద్ధతులపై ప్రశ్నలు ఉంటాయి. స్కూల్ స్థాయిలో తెలుగు సబ్జెక్ట్ పుస్తకాలతోపాటు తెలుగు బోధన పద్ధతులను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్, ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

ఒకటి నుంచి అయిదో తరగతి స్థాయి వరకు ప్రశ్నలు ఉంటాయి. ఆయా సబ్జెక్టుకు సంబంధించి మొత్తం 30 ప్రశ్నల్లో.. 24 ప్రశ్నలు కంటెంట్, 6 ప్రశ్నలు పెడగాజీపై ఉంటాయి. ఎన్విరాన్‌మెంటల్ పేపర్‌లో సైన్స్, తెలంగాణ నుంచి ప్రశ్నలు తప్ప నిసరిగా ఉంటున్నాయి. ప్రస్తుతం టెట్‌కు హాజర య్యే అభ్యర్థులు తెలంగాణ ప్రాముఖ్యం ఉన్న అంశాలను ప్రత్యేక దృష్టితో చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.

పేపర్-2 ప్రిపరేషన్

- **సైన్స్:** ఈ విభాగంలో మార్కుల కోసం మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. గత టెట్‌లో ఈ విభాగంలో ప్రశ్నలు కాసింత క్లిష్టంగానే ఉన్నాయని చెప్పొచ్చు. కాబట్టి అభ్యర్థులు ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి.
- **సోషల్ స్టడీస్:** ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను చదవాలి. వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, నదులు.. వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన అంశాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.
- **మ్యాథమెటిక్స్:** ఈ సబ్జెక్ట్‌లోనూ ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ట్రిగ్నోమెట్రీ, జామెట్రీ, కో-ఆర్డినేట్ జామెట్రీ, అల్జీబ్రా, కాలిక్యులస్ వంటి కీలక సబ్జెక్ట్‌లను కాన్సెప్ట్‌ల ను అర్థం చేసుకుంటూ ప్రాక్టీస్ చేయాలి.




ఇది పిట్టల్లో 'మర్యాద రామన్న'

➤ మర్యాద అంటే.. మామూలుగా మనుషులకే పరిమితమైన ఓ అభివ్యక్తి. జంతువులు, పక్షులు, ఇతర ప్రాణులు వేటికీ 'మర్యాద' అనేదే ఉండదనుకుంటాం. అందుకే మొరటుగా వ్యవహరించడాన్ని జంతు ప్రవృత్తి అని కూడా అంటుంటాం. కానీ జపనీస్ టిట్ (పరస్ మైనర్)గా పిలిచే చిన్న పిట్ట మాత్రం మర్యాద చూపడంలో దిట్ట అని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. గూటి వద్దకు వచ్చినప్పుడు ఇవి పక్కకు తప్పుకుని తోటి పక్షిని ముందు వెళ్లాల్సిందిగా కోరుతాయని.. ఇందుకోసం రెక్కలను ఓ తరహాలో ఆడిస్తూ సంకేతం ఇస్తాయని వివరిస్తున్నారు.

సంకేతం ఇవ్వడమూ గ్రేటే..

➤ జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీ శాస్త్రవేత్త తొషిటక సుజుకి ఆధ్వర్యంలోని పరిశోధకుల బృందం సుమారు 17 ఏళ్లుగా ఈ పిట్టలపై పరిశోధన చేస్తోంది. సాధారణంగా మనుషులతోపాటు ప్రైమేట్స్‌గా పిలిచే కోతులు, చింపాంజీలు, గొరిల్లాల వంటి జీవులు మాత్రమే సైగలు, సంకేతాల ద్వారా మాట్లాడుకోగలవు. కానీ ఇలా ఒక పక్షి సంకేతం ఇవ్వడం చాలా అరుదని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అంతేకాదు.. మనుషులు కొన్ని పదాలు కలిపి వాక్యాలతో మాట్లాడుకున్నట్టుగా.. ఈ పిట్టలు కొన్ని రకాల ధ్వనులను క్రమపద్ధతిలో చేస్తూ.. పూర్తి వాక్యం తరహాలో సమాచారాన్ని చేరవేసుకోగలుగుతున్నాయని వివరిస్తున్నారు.

ప్రపంచంలోని వివిధ దేశాలపై టెర్రరిజం ప్రభావం



ఆధారం: గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్

➤ **163 దేశాలకు సంబంధించి గత ఐదేళ్లను పరిగణనలోకి తీసుకున్నారు. ఉగ్రవాద దాడి సంఘటనలు, మృతులు, క్షతగాత్రులు, బందీలుగా పట్టుకోవడం వంటి అంశాల ఆధారంగా ఈ సూచికను రూపొందించారు.**

- సాక్షి, సెంట్రల్ డెస్క్

ఏపీ, తెలంగాణ ఉపాధి వేతన రేటు రూ.300కు పెంపు

సాక్షి, హైదరాబాద్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ వేతన చట్టంలో భాగంగా కూలీల రోజువారీ వేతన రేట్లు పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు అనుగుణంగా ఏపీ, తెలంగాణలో రూ.300కు వేతన రేట్లు పెరిగాయి. 2023–24 నాటి వేతన రేటు రూ.272 కాగా, 2024–45 సంవత్సరానికి మరో రూ.28 పెంచారు.

ట్యాపింగ్ కేసులో టెలిగ్రాఫ్ యాక్ట్

- అభియోగాలు నమోదు చేయాలంటే తప్పనిసరి అన్న న్యాయ నిపుణులు
- ఈ చట్టాన్ని జోడించి కోర్టుకు సమాచారమిచ్చిన అధికారులు
- కీలక సాక్షిగా ఎస్‌ఐబీలో పనిచేసిన టీఎస్ఎస్‌పీ హెడ్ కానిస్టేబుల్

సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కార్యాలయం కేంద్రంగా సాగిన అక్రమఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. దీనికి ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ (ఐటీఏ)ను కూడా జత చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైనప్పుడు, ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్నల అరెస్టు సమయంలో ఈ చట్టంలోని సెక్షన్ల మేరకు ఆరోపణలు లేవు. తాజాగా ఈ చట్టాన్ని జోడించిన అధికారులు ఈ మేరకు నాంపల్లి కోర్టుకు మెమో ద్వారా సమాచారమిచ్చారు. మరోపక్క ఈ కేసులో నిందితులపై నేరం నిరూపించడానికి అవసరమైన చర్యలను సిట్ అధికారులు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఎస్ఐబీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేసిన టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌ను సాక్షిగా చేర్చారు.

ఐటీఏ ఉండాలన్న న్యాయ నిపుణులు

ట్యాపింగ్‌పై ఎస్ఐబీ అదనపు ఎస్పీ డి.రమేష్ ఫిర్యాదు మేరకు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ప్రణీత్ రావు, ఇతరులపై ఈ నెల 10న కేసు నమోదైంది. దీనికి సంబంధించిన ప్రాథమిక సమాచార నివేదికలో (ఎఫ్ఐఆర్) పోలీసులు మూడు చట్టాల్లోని తొమ్మిది సెక్షన్ల కింద ఆరోపణలు చేశారు. ఐపీసీ, పీడీపీపీ, ఐటీ చట్టాల్లోని సెక్షన్లు చేర్చారు. కాగా ఈ నెల 13న ప్రణీత్ అరెస్టు తర్వాత కోర్టులో రిమాండ్ కేసు డైరీని సమర్పించిన అధికారులు.. ఇందులో ఓ సెక్షన్ తగ్గించి ఎనిమిదింటి కిందే ఆరోపణలు చేశారు. తొలుత చేర్చిన ఐపీసీలోని 120 బీ (కుట్ర), 34 (ఒకే ఉద్దేశంతో చేసే ఉమ్మడి చర్య) రెండు సెక్షన్లలో.. 120 బీ సెక్షన్లను తొలగించారు. అయితే నిందితులపై ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల కింద అభియోగాలు దాఖలు చేయాలంటే కచ్చితంగా ఐటీఏను జోడించి, అందులోని సెక్షన్లు వర్తింపజేయాలని న్యాయ నిపుణులు సూచించారు. ఈ నేపథ్యంలో ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్నల కస్టడీ పిటిషన్లతో పాటు ఈ చట్టాన్ని జోడిస్తూ మెమోను కూడా అధికారులు కోర్టులో దాఖలు చేశారు.

కీలకం కానున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణ

హార్డ్‌డిస్క్‌ల విధ్వంసంలో ప్రణీత్‌రావుతో కలిసి పాల్గొన్న



హెడ్ కానిస్టేబుల్ కైతోజు కృష్ణను ఈ కేసులో సాక్షిగా చేర్చారు. నాటి ఎస్ఐబీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్‌రావు గత ఏడాది డిసెంబర్ 4న అర్ధరాత్రి కృష్ణతో కలిసే ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ తాను ఏర్పాటు చేసుకున్న వార్ రూమ్‌తో పాటు అధికారిక ట్యాపింగ్‌లు జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను కృష్ణ ద్వారా ఆఫ్ చేయించాడు. అతని సహాయంతో వార్ రూమ్‌లోని 17 కంప్యూటర్లలో ఉన్న వాటితో పాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్ డిస్క్‌లనీ ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ధ్వంసం చేశాడు. ఈ కారణంగానే సిట్ అధికారులు కృష్ణను సాక్షిగా చేర్చారు. త్వరలో ఇతడితో న్యాయస్థానంలో స్టేట్‌మెంట్ రికార్డు చేయించాలని నిర్ణయించారు. ఇప్పటికే సిట్ కృష్ణ వాంగ్మూలం నమోదు చేయగా.. భవిష్యత్తులో అతను సాక్ష్యం చెప్పకుండా ఎదురుతిరిగే అవకాశం లేకుండా ఈ చర్య తీసుకోనున్నారు.

ఆ అధికారులకు త్వరలో నోటీసులు?

➤ అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి సిట్ అధికారులు త్వరలో డీజీపీ, అదనపు డీజీపీ స్థాయి అధికారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రధాన కార్యాలయం లక్డీకాపూల్‌లో ఉన్నప్పటికీ... గ్రీన్‌ల్యాండ్స్‌లోని ఎస్ఐబీ కార్యాలయంలో కూడా ఆయనకు ఓ ఛాంబర్ ఉంది. గడిచిన కొన్నేళ్లుగా నిఘా విభాగాధిపతి అక్కడకు రాకపోవడంతో ప్రణీత్ రావు ఈ ఛాంబర్‌తో పాటు పక్కన ఉన్న రూమ్‌ను తన అక్రమ ట్యాపింగ్ వ్యవహారాల కోసం వార్‌రూమ్‌గా వినియోగించుకున్నట్లు తేలింది. ఆ చాంబర్ ఇతరులు వినియోగించాలంటే కచ్చితంగా నిఘా విభాగాధిపతి, డీజీపీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి అప్పట్లో ఏ కారణం చెప్పి ఈ అనుమతి తీసుకున్నారు? ట్యాపింగ్ వ్యవహారాలు తెలిసే అనుమతి ఇచ్చారా? లాంటి సందేహాలు నివృత్తి చేసుకోవడానికి గాను వీరికి నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం.

ఎస్ఐబీలో నడిచిన ఓఎస్డీల రాజ్యం..

ఎస్ఐబీని చాలాకాలం పాటు పదవీ విరమణ పొంది ఓఎస్డీలుగా పనిచేస్తున్న వాళ్లే నడిపినట్లు తెలిసింది. ఇలాంటి దాదాపు 15 మంది అధికారులను ఆధారంగా చేసుకుని కథ నడిపినట్లు సమాచారం. ఓ మాజీ డీఐజీ, ముగ్గురు మాజీ ఎస్పీలు, ఐదుగురు అదనపు ఎస్పీలు ఇందులో కీలకంగా పనిచేశారని తెలుస్తోంది. అయితే ప్రభుత్వం మారిన తరవాత ప్రభాకర్‌రావుతో పాటే వీళ్లు కూడా రాజీనామా చేసి వెళ్లిపోయారు. సాధారణంగా ఎస్ఐబీ లాంటి సున్నిత విభాగాల్లో మాజీ అధికారులను, ప్రైవేట్ వ్యక్తులను కీలక స్థానాల్లో ఉంచరని, అయితే ప్రభాకర్‌రావు స్వయంగా ఓఎస్డీ కావడంతో ఎస్ఐబీలో ఓఎస్డీలతో పాటు ప్రైవేట్ వ్యక్తుల రాజ్యం నడిచిందని ఓ అధికారి వ్యాఖ్యానించారు. మరోపక్క ప్రణీత్‌రావుకు ట్యాపింగ్ వ్యవహారంలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు సహకరించినట్లు సిట్ తేల్చింది.



శ్రీవారి సేవలో తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్

తిరుమల: తిరుమల శ్రీవారిని రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు

గొరిల్లాను పోలిన దుస్తుల్లో పంచాయతీ కార్మికుడు



గొరిల్లాగా ఉరిమి.. కోతులను తరిమి

కోతులను తరిమేందుకు గొరిల్లా వేషాలు

బూర్గంపాడు: కోతుల బెడద నివారణకు గొరిల్లా వేషం వేయాల్సి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర గ్రామంలో కోతుల బెడద నానాటికీ పెరిగిపోతోంది. గతంలో వీటి నివారణకు కొండముచ్చులను తీసుకొచ్చి తిప్పితే కోతులు పరారయ్యేవి. కొన్నిరోజులయ్యాక వాటికి కోతులు భయపడడం మానేశాయి. దీనికి తోడు కొండముచ్చుల కొనుగోలు, పోషణ భారంగా మారడంతో మోరంపల్లి బంజర జీపీ కార్యదర్శి భవాని వినూత్నంగా ఆలోచించారు. గొరిల్లాను పోలిన దుస్తులను తెప్పించి గ్రామ పంచాయతీ కార్మికులకు తొడిగించి వీధుల్లో తిప్పుతున్నారు. దీంతో గ్రామం నుంచి కోతులు పారిపోతున్నాయి. గొరిల్లా వేషాలతో కోతుల బెడద నుంచి కాస్తయినా ఇబ్బంది తప్పుతోందని గ్రామస్తులు చెబుతున్నారు.

రుణమాఫీపై సర్కారు కసరత్తు

- గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ఏర్పాట్లు
- బ్యాంకులతో ఇప్పటికే చర్చించిన సీఎం

సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే బ్యాంకులతో దీనిపై చర్చించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. గతంలో లక్ష రూపాయల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అధికారం చేపట్టిన బీఆర్ఎస్ రుణమాఫీ చేసేందుకు రకరకాల కొర్రీలు పెట్టిందని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పదేపదే ఆరోపణలు గుప్పించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 40.66 లక్షల మంది రైతులకు రూ. 25,916 కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా.. కుటుంబ సభ్యుల్లో ఒకరికి మాత్రమే వర్తిస్తుందని కొర్రీ పెట్టి లబ్ధిదారుల సంఖ్యను కుదించిందని ధ్వజమెత్తింది. మరోవైపు అయిదేళ్ల పాటు వంతుల వారీగా రుణమాఫీ నిధులు విడుదల చేసిన అప్పటి ప్రభుత్వం.. చివరకు



కేవలం 23 లక్షల మంది రైతులకే రుణ మాఫీ చేసినట్టుగా అధికారులు లెక్కలు తేల్చినట్టు సమాచారం. దాదాపు 14 లక్షల మంది రైతులకు రుణమాఫీ సొమ్ము ఎగవేసినట్టుగా లెక్కగట్టారు. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన తప్పులు జరగకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసే ప్రతిపాదనలపై మొదటి వంద రోజుల్లోనే కసరత్తు మొదలు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.